www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 25-9-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 178 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: తదియ ఉ.7:06 తదుపరి చవితి; నక్షత్రం: స్వాతి రా.7:09 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.1:27-3:15; దుర్ముహూర్తం: ఉ.10:07-10:55, మ.2:54-3:41; అమృతఘడియలు: ఉ.9:17-11:05; రాహుకాలం: మ.1:30-3:00; సూర్యోదయం: 6:08; సూర్యాస్తమయం: 6:05

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు చేయండి

26న బతుకమ్మకుంట సంబురాల్లో పాల్గొననున్న సీఎం

29న సరూర్‌నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో..

గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకి ఎక్కే అవకాశం: సీఎస్

12



ఏటీఎంల నుంచి పీఎఫ్ సొమ్ము విత్‌డ్రా

2026 జనవరి నుంచి అందుబాటులోకి సౌకర్యం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) చందాదారులు జనవరి 2026 నుంచి తమ ఖాతా నుంచి నగదును ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసుకోవచ్చు. అందుకోసం సంస్థ తన ఖాతాదారులకు ఏటీఎం కార్డు మాదిరి కార్డును జారీ చేస్తుంది. అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంస్థ ఇప్పటికే సమకూర్చుకుంది. అయితే ఖాతాదారుడు భవిష్యనిధి నుంచి ఎంత వరకూ డబ్బులు విత్ డ్రా చేసుకోవచ్చన్న అంశాన్ని సంస్థ ట్రస్టీల కేంద్ర బోర్డు(సీబీటీ) సమావేశం చర్చించి నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ సమావేశం అక్టోబరు రెండవ వారంలో జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఈపీఎఫ్ఓకు 7.8 కోట్ల మంది ఖాతాదారులు ఉండగా... రూ.28 లక్షల కోట్లు కార్పస్ ఫండ్ సంస్థ వద్ద ఉంది. అత్యవసర సమయాల్లో భవిష్యనిధిలో దాచుకున్న సొమ్మును వాడుకోవాలంటే గతంలో ఖాతాదారులకు రోజుల తరబడి సమయం పట్టేది. ఏటీఎం సౌకర్యం అందుబాటులోకి రావడం ఈపీఎఫ్ ఖాతాదారులకు పెద్ద ఊరట అనే చెప్పాలి. కాగా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కార్మిక శాఖ ఇప్పటికే ఆర్‌బీఐ, బ్యాంకులతో చర్చించింది.

రేపు అతి భారీ వర్షాలు!

రాష్ట్రంలోని పలు జిల్లాలకు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

నేడూ కొనసాగనున్న వానలు

ప్రాజెక్టులకు వరద ఉధృతి

సాగర్‌లో 26 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

12

'ఎఫ్‌ఎంసీజీ'కి జీఎస్‌టీ తంటా



తగ్గింపు అమలులో చిక్కులు.. పరిమాణం పెంచి పాత ధరలు!

న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అమలు చేయడం ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకు పెద్ద తలనొప్పిగా మారింది. చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో రూ.10, రూ.5, రూ.2 ఎంఆర్‌పీకి అమ్మే వస్తువుల ధరల్ని, జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో పావలా నుంచి 55 పైసల వరకు తగ్గించి అమ్మాల్సి వస్తోంది. అయితే తగ్గిన ధరలకు సరిపడా చిల్లర లేక అటు కొనుగోలుదారులు, ఇటు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు, గ్రామీణ ప్రజల నుంచి ఈ సమస్య ఎక్కువగా ఉందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు.

డిసెంబరు వరకు ఇంతే

సాధారణంగా ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు రెండు నెలల వినియోగానికి సరిపడా వస్తువులను మార్కెట్‌లో విడుదల చేస్తుంటాయి. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుపై ఈ నెల మొదటి వారంలో గానీ కంపెనీలకు స్పష్టత రాలేదు. నవంబరు వరకు మార్కెట్‌లో విడుదల చేసే వస్తువుల ఎంఆర్‌పీ ధరలను కంపెనీలు ఇప్పటికే ముద్రించేశాయి. ఇపుడు జీఎస్‌టీ తగ్గింపునకు అనుగుణంగా రేట్లు తగ్గించినా, చిల్లర సమస్య ఎదురవుతోంది. ఈ కారణంగా ఆయా ప్యాకెట్లలోని వస్తువుల పరిమాణం పెంచి, డిసెంబరు నుంచి పాత ఎంఆర్‌పీ ధరలకే మార్కెట్‌లో విడుదల చేయాలని కంపెనీలు యోచిస్తున్నాయి.

'ఇది తాత్కాలిక సమస్య. ప్యాకెట్‌లోని వస్తువుల పరిమాణం పెంచడం ద్వారా నెలన్నర నుంచి రెండు నెలల్లో ఈ సమస్యను అధిగమిస్తాం' అని పార్లే ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ మయాంక్ షా చెప్పారు. నువామా ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ సీనియర్ అధికారి అబనీశ్ రాయ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

తగ్గిన సి'మంట'

● బస్తాపై రూ.30 వరకు ఆదా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలుగు రాష్ట్రాలతో సహా దేశ వ్యాప్తంగా సిమెంట్ ధరలు తగ్గాయి. రిటైల్ మార్కెట్‌లో సిమెంట్ 50 కిలోల బస్తా ధర రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.30 వరకు తగ్గింది. ఈ నెల 21 వరకు బ్రాండును బట్టి ధర రూ.290 నుంచి రూ.370 వరకు ఉండేది. జీఎస్‌టీ భారం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గడంతో ఇప్పుడది రూ.260 నుంచి రూ.330 వరకు పలుకుతోంది. దీంతో గత నెల రోజుల నుంచి వినియోగదారులు కొనుగోళ్లకు ముందుకు వస్తున్నట్టు రిటైల్ డీలర్లు చెబుతున్నారు.

పెరగనున్న డిమాండ్: నిన్న మొన్నటి వరకు దేశ వ్యాప్తంగా సిమెంట్ అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి నెల సగటున 23 నుంచి 25 లక్షల టన్నుల సిమెంట్ అమ్ముడయ్యేది. వర్షాల దెబ్బకు అది గత నెల 21 లక్షల టన్నులకు పడిపోయినట్టు పరిశ్రమ వర్గాలు చెప్పాయి. పండుగల సీజన్, జీఎస్‌టీ లాభం తోడవడంతో అమ్మకాలు మళ్లీ పుంజుకుంటాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం 55 నుంచి 60 శాతం వరకు ఉన్న ఉత్పత్తి సామర్థ్య వినియోగం జనవరి నాటికి 60 శాతం మించే అవకాశం ఉందని ఒక కంపెనీ డైరెక్టర్ చెప్పారు.

అమెజాన్‌లో 'జీఎస్‌టీ బచత్ ఉత్సవ్'

50 నుంచి 80 శాతం వరకు డిస్కౌంట్

బెంగళూరు (ఆంధ్రజ్యోతి) : 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్'లో భాగంగా అమెజాన్ 'గ్రేట్ సేవింగ్స్ సెలబ్రేషన్ ఎట్ జీఎస్‌టీ బచత్ ఉత్సవ్'కు శ్రీకారం చుట్టింది. ఈ ఉత్సవ్‌లో నెటిజన్లు 50 నుంచి 80 శాతం డిస్కౌంట్‌తో ఆధునిక ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫ్యాషన్, బ్యూటీ, గృహోపకరణాలు, హెల్త్‌కేర్, నిత్యావసరాలను జీఎస్‌టీ తగ్గింపు ధరలతో కొనుగోలు చేయవచ్చు.



ఉత్సవ్ ప్రత్యేకతలు

- ప్రధాన పండగదినాల్లో డీల్ విత్ జీఎస్‌టీ సేవింగ్స్.
- నో కాస్ట్ ఇఎంఐ వెసులుబాటు.
- ప్రైమ్ సభ్యులకు అమెజాన్ పే రివార్డ్స్ ద్వారా ఐదు శాతం వరకు క్యాష్‌బాక్.
- అమెజాన్ విక్రేతలకు కొత్త జీఎస్‌టీ రేట్లకు అనుగుణంగా అవసరమైన టూల్స్ మార్గదర్శకాలు.
- జీఎస్‌టీ టాక్స్ కోట్స్‌పై అవగాహనకు మాస్టర్ క్లాస్.
- ధర నిర్ణయంలో విక్రేతలకే పూర్తి హక్కు.
- అమ్మకానికి లక్షకు పైగా ఉత్పత్తులు.
- రూ.43,749కే ఐఫోన్ 15 మోడల్ లభ్యం.
- శాంసంగ్ గెలాక్సీ ఎస్24 మోడల్ ధర రూ.71,999.
- ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై 10% డిస్కౌంట్.
- అమెజాన్ పే, ఐసీఐసీఐ క్రెడిట్ కార్డులపై అపరిమిత క్యాష్‌బాక్ సదుపాయం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,15,370 ▲	1,05,750 ▲	1,50,000 ▲
విజయవాడ	1,17,350 ▼	1,10,500 ▼	1,38,500 ▼
విశాఖపట్నం	1,17,360 ▼	1,06,050 ▲	1,50,000 ▲
రాజమండ్రి	1,15,360 ▲	1,05,750 ▲	1,38,900 ▲
ప్రొద్దుటూరు	1,18,700 ▲	1,09,200 ▲	1,39,000 ▲
ముంబై	1,13,580 ▼	1,04,040 ▼	1,34,090 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	540
చిత్తూరు	578	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	120
వరంగల్	105	గుంటూరు	122
కరీంనగర్	105	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	92
కర్నూలు	105	నెల్లూరు	97
విశాఖపట్నం	129	అనంతపురం	97
గోదావరి	120		

హైదరాబాద్‌లో హెచ్‌సీఏ జీసీసీ

● 3,000 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో ప్రముఖ అమెరికా కంపెనీ కొలువు తీరింది. అమెరికా, బ్రిటన్ దేశాల్లో 195 ఆస్పత్రులు, 2500 కేర్ సెంటర్ల ద్వారా వైద్య సేవలందిస్తున్న హెచ్‌సీఏ హెల్త్‌కేర్ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేసింది. సత్వా నాలెడ్జ్ పార్కులో నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ జీసీసీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ ఏడాది చివరికి ఈ జీసీసీ కోసం 7.5 కోట్ల డాలర్లు (సుమారు రూ.665.25 కోట్లు) ఖర్చు చేయనున్నట్టు హెచ్‌సీఏ హెల్త్‌కేర్ గ్లోబల్ కేపబిలిటీ నెట్‌వర్క్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎమిలీ డంకన్ చెప్పారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 1100 మంది పనిచేస్తున్నారు. వచ్చే ఏడాది చివరికి ఉద్యోగుల సంఖ్య 3,000కు పెరగనుంది.

82,000 దిగువకు సెన్సెక్స్

● రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: ఈక్విటీ సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ 82,000 పాయింట్లు, నిఫ్టీ 25,100 పాయింట్ల దిగువకు జారాయి. బ్యాంకింగ్, ఆటో, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడం ఇందుకు కారణం. విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ, ఐటీ షేర్లలో కొనసాగిన అమ్మకాలు కూడా వరుస నష్టాలకు మరో కారణం. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 386.47 పాయింట్లు కోల్పోయి 81,715.63 వద్దకు జారుకుంది. నిఫ్టీ 112.60 పాయింట్ల నష్టంతో 25,056.90 వద్ద ముగిసింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గి రూ.460.56 లక్షల కోట్లకు పడిపోయింది.

శంషాబాద్ విమానాశ్రయానికి రెండు విశిష్ట పురస్కారాలు

శంషాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి నేషనల్ ఎనర్జీ లీడర్-2025, ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషెంట్ యూనిట్-2025 సీఐఐ జాతీయ పురస్కారం దక్కాయి. విమానాశ్రయానికి నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు రావడం ఇది వరుసగా ఏడోసారి కాగా, ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియంట్ యూనిట్ గుర్తింపు దక్కడం తొమ్మిదోసారి. ఈ సందర్భంగా జీఎంఆర్ సీఈవో ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ విమానాశ్రయం ప్రారంభం నుంచి తాము ఇంధన సమర్థతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు.

బజాజ్ ఎలక్ట్రికల్ చేతికి మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ హక్కులు

ఒప్పందం విలువ రూ.146 కోట్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఎలక్ట్రికల్ అప్లయెన్స్ బ్రాండ్ మర్ఫీ రిచర్డ్స్ మేధో సంపత్తి హక్కులను కొనుగోలు చేస్తున్నట్లు బజాజ్ ఎలక్ట్రికల్స్ బుధవారం ప్రకటించింది. ఐర్లాండ్‌కు చెందిన గ్లెన్ డింప్లెక్స్ గ్రూప్‌లో భాగమైన గ్లెన్ ఎలక్ట్రిక్ నుంచి ఈ హక్కులను దక్కించుకోనున్నట్లు తెలిపింది. ఈ డీల్‌లో భాగంగా బజాజ్ ఎలక్ట్రికల్స్‌కు భారత్, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, మాల్దీవులు, శ్రీలంక మార్కెట్లలో మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ హక్కులు కూడా లభించనున్నాయి. ఈ ఒప్పందం విలువ రూ.146 కోట్లు. బజాజ్ ఎలక్ట్రికల్స్ గత రెండు దశాబ్దాలుగా మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్‌తో లైసెన్సు ఒప్పందం కలిగి ఉంది. తద్వారా సంస్థ మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ మిక్సర్లు, ఓవెన్, టోస్టర్ గ్రిల్స్, కాఫీ మేకర్స్, ఎయిర్ ఫ్రేయర్స్ ఐరన్ బాక్సులు, హాట్ ఎయిర్ బ్రష్, హెయిర్ స్ట్రెయిటెనర్స్, హెయిర్ డ్రయర్స్‌ను భారత్‌లో విక్రయిస్తోంది. మేధో సంపత్తి హక్కుల కొనుగోలుతో బజాజ్ ఎలక్ట్రికల్ భారత్ సహా నిర్దేశిత మార్కెట్లలో మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ హక్కులపై పూర్తి యాజమాన్యాన్ని కలిగి ఉండనుంది.

ఫోన్‌పే రూ.12,000 కోట్ల ఐపీఓ!

సెబీకి ముసాయిదా పత్రాలు

న్యూఢిల్లీ: ప్రపంచ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ గ్రూప్ అనుబంధ సంస్థ ఫోన్‌పే కూడా తొలి పబ్లిక్ ఆఫరింగ్‌కు (ఐపీఓ) రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ వివరాలను గోప్యంగా ఉంచేందుకు ఈ సంస్థ కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ మార్గాన్ని ఎంచుకుంది. ఐపీఓ ద్వారా ఫోన్‌పే రూ.12,000 కోట్ల వరకు నిధులు సమీకరించాలనుకుంటున్నదని, ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన జరగనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఓఎఫ్ఎస్ ద్వారా కంపెనీ వాటాదారులైన వాల్‌మార్ట్, టైగర్ గ్లోబల్, మైక్రోసాఫ్ట్ మొత్తంగా 10 శాతం వరకు వాటాను విక్రయించనున్నాయని వారన్నారు. 2016 ఆగస్టులో ప్రారంభమైన ఫోన్‌పే డిజిటల్ చెల్లింపులతో పాటు బీమా, రుణాలు, వెల్త్ సేవలనూ అందిస్తోంది. ప్రస్తుతం మార్కెట్ వాటాపరంగా ఫోన్‌పే దేశంలో అతి పెద్ద డిజిటల్ చెల్లింపుల సేవల కంపెనీగా ఉంది.

హిండెన్‌బర్గ్ నివేదిక.. భారత సంస్థలపై దాడి

గౌతమ్ అదానీ

న్యూఢిల్లీ: అమెరికన్ షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికలోని ఆరోపణలను దేశీయ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ తోసిపుచ్చడం తమ గ్రూప్ పాలన విధానాలు, పారదర్శకతకు బలమైన సమర్థన అని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ అన్నారు. ఎట్టకేలకు నిజం గెలిచిందని గ్రూప్ వాటాదారులకు బుధవారం రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక కేవలం అదానీ గ్రూప్‌పై జరిగిన దాడి మాత్రమే కాదు.. ప్రపంచ స్థాయిలో విస్తరించాలని కలలు కనే భారత సంస్థల ధైర్యసాహసాలకు ప్రత్యక్ష సవాలు అని గౌతమ్ అదానీ అన్నారు. తమను బలహీనపరిచే దురుద్దేశంతో విడుదల చేసిన నివేదిక.. గ్రూప్ పునాదులను మరింత బలోపేతం చేసిందటూ గడిచిన రెండేళ్లలో గ్రూప్ ఆర్థిక పురోగతిని అదానీ ఆ లేఖలో ప్రస్తావించారు.

స్పోర్ట్స్

పతకం తెచ్చే సత్తా ఉంటేనే..

2026 ఆసియా క్రీడలకు కఠిన ఎంపిక ప్రమాణాలు



న్యూఢిల్లీ: వచ్చే ఆసియా క్రీడల (2026)కు కఠినమైన ఎంపిక ప్రక్రియను కేంద్రం ప్రకటించింది. పతకాలు సాధించే సత్తా కలిగిన అథ్లెట్లనే ఎంపికలో పరిగణిస్తామని క్రీడా శాఖ స్పష్టంజేసింది. ఈ క్రమంలో ఆసియా ర్యాంకింగ్స్‌ను ప్రామాణికంగా తీసుకుంటారని పేర్కొంది. అలాగే ప్రభుత్వంపై భారం పడకున్నా..అంటే అథ్లెట్లు సొంత ఖర్చులతో కోచ్‌లు, ఇతర సహాయ సిబ్బందిని తీసుకువెళ్లడానికి కూడా అనుమతించబోమని తెలిపింది. ఈమేరకు ఎంపిక ప్రక్రియకు సంబంధించిన ఐదు పేజీల డాక్యుమెంట్‌ను క్రీడా శాఖ తన వెబ్‌సైట్‌లో బుధవారం అప్‌లోడ్ చేసింది. వ్యక్తిగత క్రీడాంశాల్లో తొలి ఆరు ర్యాంకుల్లో, అలాగే టీమ్ క్రీడాంశాల్లో భారత జట్టు ఎనిమిదో ర్యాంకు లోపు ఉంటేనే ఆసియా క్రీడల ఎంపికకు ఆయా క్రీడా సమాఖ్యలు సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఆసియా క్రీడలు వచ్చే ఏడాది సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు నాలుగు వరకు జపాన్‌లోని నగోయాలో జరగనున్నాయి. కామన్వెల్త్ క్రీడలు (ఆగస్టు 2026), సహా ఆసియా స్థాయిలో జరిగే ఇతర క్రీడలకూ ఇదే విధానం వర్తిస్తుందని వెల్లడించింది.

బ్యాటర్ల వైఫల్యం

● భారత్-ఎ 194 ఆలౌట్
● ఆసీస్-ఎ 16/3
● 242 పరుగుల ఆధిక్యంలో కంగారూలు

లఖ్‌నవూ: భారత్-ఎ బ్యాటర్లు ఘోరంగా విఫలమవడంతో.. రెండో అనధికార టెస్ట్‌లో ఆస్ట్రేలియా-ఎ భారీ ఆధిక్యాన్ని నమోదు చేసింది. ఆటకు రెండో రోజైన బుధవారం తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 194 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 420 పరుగులకంటే భారత్ 226 రన్స్ వెనుకబడింది. సాయి సుదర్శన్ (75), నారాయణ్ జగదీశన్ (38) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. టెస్ట్ రేస్‌లో ఉన్న నితీశ్ కుమార్ (1) సింగిల్ డిజిట్‌కే వెనుదిరగ్గా.. ప్రసిద్ధ్ కృష్ణ (16) కంకషన్‌తో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. పేసర్ హెన్రీ థార్న్‌టన్ 4 వికెట్లు తీశాడు. కాగా, రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 16/3 స్కోరు చేసింది. ఆలివర్ (1)ను మానవ్ అవుట్ చేయగా.. మెక్‌స్వీనే (11) క్రీజులో ఉన్నాడు. కొంటాస్ (3)ను బ్రార్.. కెల్లీ (0)ని సిరాజ్ పెవిలియన్ చేర్చారు. మొత్తంగా ఆసీస్ 242 రన్స్ ఆధిక్యంలో ఉంది.

అదరగొట్టిన వైభవ్, అభిగ్యాన్

● రెండో వన్డేలో ఆసీస్ అండర్-19 చిత్తు
● 2-0తో సిరీస్ భారత్ వశం

బ్రిస్బేన్: యువ బ్యాటర్లు అభిగ్యాన్ కుందు (64 బంతుల్లో 71), వైభవ్ సూర్యవంశీ (68 బంతుల్లో 70), విహాన్ మల్హోత్రా (74 బంతుల్లో 70) చెలరేగడంతో.. ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లో భారత అండర్-19 జట్టు 2-0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 51 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత భారత్ 49.4 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌటైంది. విల్ బైరోమ్ మూడు, యశ్ దేశ్‌ముఖ్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఆసీస్ 47.2 ఓవర్లలో 249 పరుగులకే కుప్పకూలింది. జేడెన్ డ్రేపర్ (107) సెంచరీ వృథా అయింది. ఆయుష్ మాత్రే మూడు, కనిష్క చౌహాన్ రెండు వికెట్లు పడగొట్టారు.



వైభవ్ (70)

1 ఈ మ్యాచ్‌లో ఆరు సిక్సులు బాదిన వైభవ్ మొత్తం 41 సిక్సర్లతో.. యూత్ వన్డేల్లో అత్యధిక సిక్సులు కొట్టిన ఉన్ముక్త్ చాంద్ (38 సిక్సులు) రికార్డును అధిగమించాడు.

ఫైనల్లో భారత్

● 41 రన్స్‌తో బంగ్లా చిత్తు
● బాదేసిన అభిషేక్ శర్మ
● తిప్పేసిన కుల్దీప్ యాదవ్



కుల్దీప్ (3/18)కు కెప్టెన్ సూర్య అభినందన



అభిషేక్ శర్మ (37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులతో 75)

దుబాయ్: వరుస విజయాలతో జోరు మీదున్న భారత్.. ఆసియా కప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అభిషేక్ శర్మ (37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులతో 75) ధనాధన్ అర్ధ శతకంతోపాటు బౌలర్లు రాణించడంతో.. బుధవారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో టీమిండియా 41 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 168/6 స్కోరు చేసింది. హార్దిక్ పాండ్యా (38), శుభ్‌మన్ గిల్ (29) రాణించారు. రిషద్ హొస్సేన్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో బంగ్లా 19.3 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. సైఫ్ హసన్ (69), పర్వేజ్ హొస్సేన్ ఇమాన్ (21) మినహా మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కుల్దీప్ మూడు.. బుమ్రా, వరుణ్ చక్రవర్తి చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. అభిషేక్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. సూపర్-4లో నాలుగు పాయింట్లతో టీమిండియా తొలి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. శ్రీలంక టోర్నీ నుంచి నిష్క్రమించింది. గురువారం పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగే మ్యాచ్‌తో రెండో బెర్త్ ఎవరికి దక్కుతుందో తేలుతుంది. లిట్టన్ దాస్ వెన్నునొప్పితో బాధపడుతుండడంతో జాకెర్ అలీ బంగ్లా తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు.

బౌలర్ల దెబ్బకు విలవిలా..

సైఫ్ ఒంటరి పోరాటం చేసినా.. టీమిండియా బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంతో బంగ్లా ఏదశలోనూ మ్యాచ్‌లోకి రాలేకపోయింది. రెండో ఓవర్‌లో ఓపెనర్ తన్జిద్ హసన్ (1)ను అవుట్ చేసిన బుమ్రా.. ఆరంభంలోనే బంగ్లాను దెబ్బకొట్టాడు. దీంతో సైఫ్, పర్వేజ్ ఆచితూచి ఆడడంతో స్కోరుబోర్డు మందకొడిగా కదిలింది. అయితే, నాలుగో ఓవర్‌లో వరుణ్ బౌలింగ్‌లో రెండు వరుస బౌండ్రీలతో దూకుడు పెంచిన పర్వేజ్.. ఆ తర్వాతి ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ బాదాడు. దీంతో ఆరు ఓవర్లకు బంగ్లా 44/1తో నిలిచింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ పరుగులను కట్టడి చేస్తూ బంగ్లా బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. ధాటిగా ఆడే ప్రయత్నం చేస్తున్న పర్వేజ్‌ను అవుట్ చేసిన కుల్దీప్.. రెండో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. మరోవైపు సైఫ్ వీలు చిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. కాగా, 10వ ఓవర్‌లో తన బౌలింగ్‌లో సిక్స్ బాదిన హృదయ్ (7)ను అక్షర్ అదే ఓవర్‌లో క్యాచౌట్ చేశాడు. ఆ తర్వాత షమీమ్ (0)ను వరుణ్ బౌల్డ్ చేయడంతో.. బంగ్లా 74/4తో ఇబ్బందుల్లో పడినట్టు కనిపించింది. జాకెర్ అలీ (4)ని సూర్య రనౌట్ చేశాడు. మరోవైపు అక్షర్ వేసిన 14వ ఓవర్‌లో రెండు సిక్సులతో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న సైఫ్.. జట్టు స్కోరును సెంచరీ దాటించాడు. బంగ్లా విజయానికి చివరి 5 ఓవర్లలో 61 పరుగులు కావల్సి ఉండగా.. సైఫుద్దీన్ (4)ను వరుణ్ వెనక్కి పంపాడు. 17వ ఓవర్‌లో రిషద్ (2), తన్జిమ్ హసన్ (0)ను కుల్దీప్ వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చగా.. సైఫ్‌ను బుమ్రా అవుట్ చేయడంతో బంగ్లా పోరాటం ముగిసింది.

'డెత్'లో డీలా..

డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అదిరే ఆరంభాన్నిచ్చినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో భారత్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా పవర్‌ప్లే తొలి మూడు ఓవర్లలో 17 పరుగులే చేసినా.. ఆ తర్వాత ఓపెనర్లు అభిషేక్, గిల్ బ్యాట్లు ఝుళిపించారు. నాలుగో ఓవర్‌లో నసుమ్ అహ్మద్ బౌలింగ్‌లో గిల్ 4, 6తో జోరు చూపగా.. అభిషేక్ సిక్స్‌తో మొత్తం 21 పరుగులు లభించాయి. ఇక్కడి నుంచి టాప్ గేర్‌లో సాగిన శర్మ రెండు సిక్సులు, నాలుగు ఫోర్లు బాదడంతో.. ఆరు ఓవర్లు ముగిసే సరికి భారత్ 72/0తో భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ, మధ్య ఓవర్లలో స్పిన్నర్ రిషద్.. గిల్‌తోపాటు వన్‌డౌన్ బ్యాటర్ శివం దూబే (2)ను అవుట్ చేసి టీమిండియా జోరుకు బ్రేకులు వేశాడు. దీంతో తొలి వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు సింగిల్‌తో అభిషేక్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. ఈ క్రమంలో కొంతసేపు స్తబ్దుగా ఉన్న అభిషేక్.. 11వ ఓవర్‌లో 6,4తో మరోసారి బ్యాట్‌కు పని చెప్పడంతో జట్టు స్కోరు సెంచరీ మార్క్ దాటింది. ధాటిగా ఆడుతున్న అభిషేక్ అనవసరంగా రనౌట్ కాగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరడంతో టీమిండియా బ్యాటింగ్ ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. తిలక్ వర్మ (5) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. అయితే, డెత్ ఓవర్లలో హార్దిక్ పాండ్యాకు అక్షర్ పటేల్ (10 నాటౌట్) జత కలవడంతో స్కోరు బోర్డు పరుగులు పెడుతుందని అంతా భావించారు. కానీ, బంగ్లా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో.. వీరిద్దరూ 34 బంతుల్లో 39 పరుగుల భాగస్వామ్యాన్ని మాత్రమే నమోదు చేశారు. అడపాదడపా షాట్లు ఆడిన పాండ్యా ఇన్నింగ్స్ ఆఖరి బంతికి పెవిలియన్ చేరడంతో.. టీమిండియా 170 మార్క్‌ను కూడా అందుకోలేక పోయింది.

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ X పాకిస్థాన్
రా.8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (రనౌట్) 75, గిల్ (సి) తన్జిమ్ షకిబ్ (బి) రిషద్ 29, శివమ్ దూబే (సి) హృదయ్ (బి) రిషద్ 2, సూర్యకుమార్ (సి) జాకెర్ అలీ (బి) ముస్తాఫిజుర్ 5, హార్దిక్ పాండ్యా (సి) తన్జిద్ హసన్ (బి) సైఫుద్దీన్ 38, తిలక్ (సి) సైఫ్ హసన్ (బి) తన్జిమ్ షకిబ్ 5, అక్షర్ (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 168/6; వికెట్ల పతనం:** 1-77, 2-83, 3-112, 4-114, 5-129, 6-168; **బౌలింగ్:** తన్జిమ్ షకిబ్ 4-0-29-1, నసుమ్ అహ్మద్ 4-0-34-0, ముస్తాఫిజుర్ 4-0-33-1, సైఫుద్దీన్ 3-0-37-1, రిషద్ హొస్సేన్ 3-0-27-2, సైఫ్ హసన్ 2-0-7-0.

బంగ్లాదేశ్: సైఫ్ హసన్ (సి) అక్షర్ (బి) బుమ్రా 69, తన్జిద్ హసన్ (సి) దూబే (బి) బుమ్రా 1, పర్వేజ్ హొస్సేన్ (సి) అభిషేక్ (బి) కుల్దీప్ 21, హృదయ్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 7, షమీమ్ హొస్సేన్ (బి) వరుణ్ 0, జాకెర్ అలీ (రనౌట్) 4, సైఫుద్దీన్ (సి) తిలక్ (బి) వరుణ్ 4, రిషద్ హొస్సేన్ (సి) తిలక్ (బి) కుల్దీప్ 2, తన్జిమ్ షకిబ్ (బి) కుల్దీప్ 0, నసుమ్ అహ్మద్ (నాటౌట్) 4, ముస్తాఫిజుర్ (సి) అక్షర్ (బి) తిలక్ 6, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం 19.3 ఓవర్లలో 127 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-4, 2-46, 3-65, 4-74, 5-87, 6-109, 7-112, 8-112, 9-116, 10-127; **బౌలింగ్:** హార్దిక్ 2-0-14-0, బుమ్రా 4-0-18-2, వరుణ్ చక్రవర్తి 4-0-29-2, కుల్దీప్ యాదవ్ 4-0-18-3, అక్షర్ పటేల్ 4-0-37-1, శివమ్ దూబే 1-0-10-0, తిలక్ వర్మ 0.3-0-1-1.

'కొరియా'లో భారత్‌కు నిరాశ

సువాన్: కొరియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలిరోజు భారత్‌కు నిరాశ ఎదురైంది. బుధవారం బరిలోకి దిగిన భారత షట్లర్లలో ఒక్కరు కూడా ముందంజ వేయలేకపోయారు. పురుషుల సింగిల్స్ ఆరంభ రౌండ్లో చికో ఆరా ద్వి వార్డోయో (ఇండోనేసియా)తో పోరులో 8-16తో వెనుకంజలో ఉన్న దశలో హెచ్ఎస్ ప్రణయ్ గాయం కారణంగా అర్ధంతరంగా వెనుదిరిగాడు. మిగతా షట్లర్లలో ఆయుష్ షెట్టి 18-21, 18-21తో సు లి యాంగ్ (తైపీ) చేతిలో, కిరణ్ జార్జ్ 14-21, 22-20, 14-21తో లో కీన్ యే (సింగపూర్) చేతిలో, అనుపమ ఉపాధ్యాయ 16-21, 15-21తో పుత్రి వర్దాని (ఇండోనేసియా) చేతిలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో మోహిత్ జగ్లాన్/లక్షిత జగ్లాన్ జోడీ 7-21, 14-21తో జపాన్ ద్వయం యు షిమోగామి/సయాక హోబార చేతిలో ఓటమి పాలయ్యారు.

అది అతడి అభిప్రాయం

షహీన్ షా అఫ్రీది

దుబాయ్: భారత్‌కు పాకిస్థాన్ పోటీయే కాదన్న టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ వ్యాఖ్యపై స్పందించేందుకు..పాక్ పేసర్ షహీన్ షా అఫ్రీది నిరాకరించాడు. 'అది అతడి అభిప్రాయం. ఈసారి మేం తలపడినప్పుడు (వచ్చే ఆదివారం జరిగే ఆసియా కప్ ఫైనల్‌ను దృష్టిలో పెట్టుకొని) ఏం జరుగుతుందో.. అప్పుడు చూద్దాం. మేం ఆసియా కప్ గెలిచేందుకు వచ్చాం. అందువల్ల మా అత్యుత్తమ ప్రదర్శన చేస్తాం' అని అఫ్రీది చెప్పుకొచ్చాడు.

వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు భారత జట్టు ఎంపిక నేడు

ముంబై: వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు భారత జట్టును గురువారం ఎంపిక చేయనున్నారు. వాస్తవంగా 15 మంది సభ్యుల జట్టును బుధవారం రాత్రి ప్రకటించాల్సి ఉంది. కానీ అనివార్య కారణాలవల్ల వాయిదా పడినట్టు బీసీసీఐ తెలిపింది. ప్రస్తుతం ఆసియా కప్‌కోసం దుబాయ్‌లో ఉన్న జాతీయ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్..సెలెక్టర్లతో వర్చువల్‌గా సమావేశమై చర్చించిన తర్వాత జట్టును ప్రకటించనున్నారు. తొలి టెస్ట్ వచ్చే నెల రెండున అహ్మదాబాద్‌లో ప్రారంభం కానుంది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 25-9-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 178
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: తదియ ఉ.7.06 తదుపరి చవితి; నక్షత్రం: స్వాతి రా.7.09 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.1.27-3.15; దుర్ముహూర్తం: ఉ.10.07-10.55, మ.2.54-3.41; అమృతఘడియలు: ఉ.9.17-11.05; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.05 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైల్వే ఉద్యోగులకు బోనస్

ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 వరకు..
నౌకల తయారీ, సముద్ర వాణిజ్య మౌలిక వసతులకు 69,725 కోట్ల ప్యాకేజీ.. దీంతో 30 లక్షల ఉద్యోగాలు
విద్యాసంస్థల్లో పరిశోధనలకు రూ.2,277 కోట్లు
బిహార్‌పై వరాల జల్లు.. రైలు, రోడ్డు ప్రాజెక్టులు
కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు 2

దేశవ్యాప్తంగా కొత్తగా 10,023 మెడికల్ సీట్లు 13

ఎంబీబీఎస్ సీట్లు 5,023.. పీజీ సీట్లు 5 వేలు
ప్రభుత్వ కాలేజీల్లో మంజూరుకు కేంద్రం నిర్ణయం
తెలంగాణకు 200-300 పీజీ సీట్లు వచ్చే అవకాశం!

రేపే జీవో విడుదల!

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రత్యేక జీవో

- ఆపై ఎన్నికల సంఘానికి సర్కారు లేఖ.. వెంటనే ఎన్నికలకు షెడ్యూల్.. నోటిఫికేషన్
- ఇప్పటికే పూర్తయిన రిజర్వేషన్ల ప్రక్రియ.. సర్కారుకు చేరిన క్షేత్రస్థాయి వివరాలు
- పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ సెంటర్లు సహా రిటర్నింగ్ అధికారుల జాబితా కూడా సిద్ధం
- శిక్షణకు సిద్ధంగా ఉండాలని సూచనలు.. సిద్ధంగా ఉన్న బ్యాలెట్ బాక్సులు
- మండలాలకు చేరిన నమూనా బ్యాలెట్ పేపర్లు.. క్షేత్ర స్థాయిలో ఎన్నికల జోష్



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకెళుతోంది. ఓవైపు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రత్యేక జీవో జారీ చేసేందుకు కసరత్తు కొనసాగిస్తూనే.. మరోవైపు ఎన్నికల నిర్వహణకు అవసరమైన వివరాల సేకరణ, సన్నాహాలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే ప్రత్యేక జీవోను శుక్రవారం విడుదల చేసేందుకు సిద్ధమైంది. ఆపై ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామంటూ ఎన్నికల సంఘానికి లేఖ రాయనుంది. ఆ తరువాత స్థానిక ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్‌లు వెలువడనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమైన రిజర్వేషన్లను ఖరారు చేయగా.. గ్రామ, మండల, జడ్పీటీసీల వారీగా పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వివరాలను కూడా సిద్ధం చేస్తోంది. ఆయా కేంద్రాలకు అవసరమైన రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సామగ్రి, యంత్రాంగానికి సంబంధించిన వివరాల సేకరణ కూడా ఇప్పటికే పూర్తయింది. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి జిల్లాల కలెక్టర్లు ఈ వివరాలను ప్రభుత్వానికి అందజేశారు. మరోవైపు వార్డు సభ్యుల నుంచి జడ్పీ చైర్‌పర్సన్ వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించే స్థానాలను ఆయా సామాజికవర్గాల శాతాన్ని బట్టి ఖరారు చేశారు. అయితే రిజర్వేషన్ల ఖరారుకు రెండు రోజులే సమయం ఇచ్చినందున.. తప్పొప్పులను సరిచూసుకునేందుకు ప్రభుత్వం బుధవారం వరకు అవకాశం కల్పించిన

మిగతా 13వ పేజీలో...

ఊహల ఆధారంగా పిటిషన్లు వేస్తారా?

పత్రికల్లో వచ్చిన కథనాలు చూసి కోర్టును ఆశ్రయిస్తారా?: హైకోర్టు 13
స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు వద్దంటూ దాఖలైన పిటిషన్ కొట్టివేత



గ్రూప్-1 నియామకాలకు పచ్చజెండా

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
ఫలితాలను రద్దు చేస్తూ
సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు నిలిపివేత
తుది తీర్పునకు లోబడి నియామకాలు
పేపర్ లీకేజీ, విధానపరమైన లోపాలు
ఉంటేనే కోర్టులు జోక్యం చేసుకోవాలి
తేల్చిన హైకోర్టు.. టీజీపీఎస్సీకి ఊరట
వచ్చే నెల 15న తదుపరి విచారణ

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 నియామకాలకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును నిలిపివేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి నియామకాలు చేపట్టుకోవచ్చని.. నియామకపత్రాలు ఇవ్వవచ్చని తెలిపింది. అయితే ఆ నియామకాలన్నీ తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని పేర్కొంది. "తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇది మొదటి గ్రూప్-1 నోటిఫికేషనా? ఇప్పటి

మిగతా 10వ పేజీలో...

గ్రూప్-1 తుది జాబితా

45 మంది డిప్యూటీ కలెక్టర్లు, 115 డీఎస్పీలు సహా 562 మందితో జాబితా విడుదల 10
హైకోర్టు తీర్పుతో అర్ధరాత్రి టీజీపీఎస్సీ వెల్లడి

కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు
అనుమతి ఇవ్వండి!

- ఫార్ములా ఈ-రేసు కేసులో గవర్నర్‌కు ప్రభుత్వ విజ్ఞప్తి
- కేసు ఫైలును గవర్నర్‌కు పంపిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- న్యాయనిపుణుల అభిప్రాయం కోరిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఐఏఎస్ అరవింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డిల ప్రాసిక్యూషన్‌కు విజిలెన్స్ కమిషనర్ సిఫారసు
- పీసీ యాక్ట్ ప్రకారం చర్యలకు కేంద్రానికి ప్రభుత్వం లేఖ



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కారు రేసు కేసు ఫైలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్ద నుంచి రాజ్‌భవన్‌కు చేరింది. ఈ కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ప్రభుత్వం కోరింది. దీనిపై గవర్నర్ న్యాయనిపుణుల అభిప్రాయం కోరినట్లు తెలిసింది. ఫార్ములా ఈ-కారు రేసు కేసు దర్యాప్తు చేపట్టిన ఏసీబీ.. తమ దర్యాప్తు పూర్తయిందని, కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఇదివరకే ప్రభుత్వానికి లేఖ రాసింది. ప్రభుత్వం ఆ లేఖను, ఏసీబీ రిపోర్టును విజిలెన్స్ కమిషనర్‌కు పంపించింది. ఏసీబీ రిపోర్టును పరిశీలించిన విజిలెన్స్ కమిషనర్.. నిందితులపై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టవచ్చంటూ క్లియరెన్స్ ఇచ్చారు. అయితే కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలకు గవర్నర్ అనుమతి అవసరమైనందున.. విజిలెన్స్ సిఫారసుతో పాటు ఏసీబీ నివేదికను గవర్నర్‌కు సీఎస్ పంపించారు. దీనిపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం న్యాయనిపుణుల అభిప్రాయాన్ని కోరినట్లు తెలుస్తోంది. వారి అభిప్రాయం అందిన తర్వాత కేటీఆర్ ప్రాసిక్యూషన్‌పై గవర్నర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో కేటీఆర్ సహా ఐదుగురిని నిందితులుగా ఏసీబీ

మిగతా 12వ పేజీలో...


పోలీసు అధికారుల సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టులు (తెలుపు టీ షర్టుల్లో)

71 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమక్షంలో..
లొంగిపోయిన వారిలో 21 మంది మహిళలు, ముగ్గురు మైనర్లు
30 మందిపై మొత్తంగా 64 లక్షల రివార్డు

అబూజ్‌మాడ్ ఎన్‌కౌంటర్ బూటకం

ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో కాత రామచంద్రారెడ్డి కుమారుడి పిటిషన్ 11
పోలీసుల ఎన్‌కౌంటర్ కథ అబద్ధం
మావోయిస్టు దండకారణ్య స్పెషల్ కమిటీ

భగ్గుమన్న లద్దాఖ్

హింసాత్మకంగా మారిన 'రాష్ట్ర హోదా' నిరసనలు

నలుగురి మృతి
70 మందికి పైగా గాయాలు
లేహ్‌లో బీజేపీ ఆఫీసు దగ్ధం
సెక్రటేరియట్ భవనానికి నిప్పు
పోలీసులపై రాళ్లు రువ్విన ఆందోళనకారులు
వాంగ్‌చుక్ నిరసన విరమణ
ఆయన రెచ్చగొట్టడం వల్లే హింస.. కేంద్రం ఆరోపణ


ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో లేహ్‌లోని బీజేపీ ఆఫీసు నుంచి వస్తున్న పొగలు

లేహ్, సెప్టెంబరు 24: లద్దాఖ్‌లో ఆందోళనకారులు రెచ్చిపోయారు. కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించడంతో పాటు ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్లతో ప్రారంభించిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. బుధవారం లేహ్ నగరంలో ఆందోళనకారులు విధ్వంసం సృష్టించారు. స్థానిక బీజేపీ కార్యాలయానికి నిప్పుపెట్టారు. పోలీసులతోనూ ఘర్షణకు దిగారు. వారిపై రాళ్లు రువ్వారు. దీంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్ప వాయువును ప్రయోగించారు. లాఠీచార్జి

మిగతా 2వ పేజీలో...



శ్రీశైలానికి ఎలివేటెడ్ కారిడారే!

ప్రాథమికంగా అలైన్‌మెంట్ ఖరారు చేసిన కేంద్రం

ప్రాజెక్టు ఆర్థికంగా లాభదాయకం కాదని అభిప్రాయం
నిర్మించండి.. మేం 50% ఖర్చు భరిస్తాం
కేంద్రానికి తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
33% నిధుల రూపంలో.. 17% నిర్మాణ సామగ్రి పన్నుల రద్దు
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చలు
మన్ననూరు చెక్‌పోస్టు-పాతాళగంగ.. 54 కి.మీ. కారిడార్

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి శ్రీశైలం మీదుగా ఆంధ్రప్రదేశ్ వెళ్లేందుకు 'మార్గం' సులభతరం కానుంది. ఈ రహదారిలో ప్రస్తుతం ఉన్న ఇబ్బందులను తొలగిస్తూ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. ఈ దారి అలైన్‌మెంట్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి 6 ప్రతిపాదనలను పంపగా.. ఎలివేటెడ్ కారిడారే ఉత్తమమని ప్రాథమికంగా నిర్ణయించింది. ఇంత వరకూ బాగానే ఉన్నా ఈ ప్రాజెక్టు ఆర్థికంగా అంత లాభదాయకం కాదని ఈ నెల 9న ఢిల్లీలో జరిగిన భేటీలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇదే విషయాన్ని కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయగా.. ప్రాజెక్టు నిర్మాణాల విషయంలో అన్నిసార్లూ ఆర్థిక అంశాలనే చూడకూడదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఈ కారిడార్ నిర్మాణంతో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి మార్గం సులభతరం కావడంతో పాటు ఏపీ వెళ్లేందుకు ఎంతగానో దోహదపడుతుందని, రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్య, వ్యాపార లావాదేవీలు మరింత పెరుగుతాయని కూడా తెలిపింది. శ్రీశైలం మార్గంలో కారిడార్ అవసరం కాబట్టి ప్రాజెక్టు ఖర్చులో సగం వాటాను భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. కాగా, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.7,700 కోట్లు ఖర్చవుతుందని సమగ్ర నివేదికలో పేర్కొన్నారు. ఆ మొత్తంలో 50శాతం వాటా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...

తొలగించిన ఉద్యోగులకు
మళ్లీ డిమాండ్!

హెచ్-1బీ వీసా ఫీజు భారీ పెంపుతో మారిన పరిణామాలు
ఆ వీసాపై అమెరికాకు వెళ్లి.. ఇటీవలి కాలంలో ఉద్యోగం కోల్పోయినవారికి కంపెనీల పిలుపు
ప్రతిభావంతులైన భారతీయ టెకీలకు స్వాగతం: జర్మనీ



వాషింగ్టన్, సెప్టెంబరు 24: ఒకరి సంక్షోభం మరొకరికి అవకాశం. ఇది ప్రకృతి చేసే న్యాయం. హెచ్-1బీ వీసా ఫీజు పెంపు విషయంలోనూ అదే జరగబోతోంది. టెక్ కంపెనీలకు పెనుభారంగా మారనున్న ఈ నిర్ణయం.. ఇప్పటికే ఆ వీసాను కలిగి ఉండి, ఉద్యోగాలు పోగొట్టుకున్నవారికి వరంగా మారనుంది. అదెలా అంటే.. కృత్రిమ మేధ అందుబాటులోకి రావడంతో వ్యయ నియంత్రణలో భాగంగా ఒరాకిల్, ఇంటెల్, మైక్రోసాఫ్ట్, ఏడబ్ల్యూఎస్ తదితర టెక్ దిగ్గజ సంస్థలు ఇటీవలికాలంలో చాలా మంది ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే. పొట్టోణ్ని పొడుగోడు కొడితే.. పొడుగోణ్ని పోచమ్మ కొట్టిందన్న సామెత చందంగా.. ఏఐ రాకతో కంపెనీలు తమ ఉద్యోగుల పొట్టకొడితే.. ట్రంప్ వీసా ఫీజు పెంపు నిర్ణయం ఆ కంపెనీల తల బొప్పి కట్టించేలా చేసింది. కొత్త వీసా దరఖాస్తులకు లక్ష డాలర్ల ఫీజు

మిగతా 2వ పేజీలో...


బిహార్‌లోని పట్నాలో సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్, అజయ్ మాకెన్

మోదీ సర్కార్‌కు చట్టబద్ధత లేదు

ఓట్ల చోరీతో గెలిచిన ఈ ప్రభుత్వానికి.. నైతికంగా, రాజకీయంగా ఏ విలువా లేదు
ఎక్కడ చూసినా 'ఓట్ చోర్.. గద్దీ చోడ్'
కాంగ్రెస్ పోరాటంలో అంతా కలిసిరావాలి
బెడిసికొట్టిన మోదీ 'కౌగిలింతల దౌత్యం'
మిత్రదేశమంటూనే సుంకాలు వేసిన ట్రంప్
అమెరికా జబ్బు కంటే చైనా మందు ప్రమాదం
బిహార్‌లో సీడబ్ల్యూసీ భేటీలో తీర్మానం
ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో అత్యంత వెనుకబడ్డ బీసీలకు చట్టం: రాహుల్

పట్నా, సెప్టెంబరు 24: ఎన్నికల్లో బీజేపీయే గెలిచేలా వ్యవస్థీకృతంగా జరుగుతున్న ఓట్ల చోరీ కుట్ర బయటపడిందని.. అలా ఏర్పడిన ఈ ప్రభుత్వానికి ఎలాంటి నైతిక, రాజకీయ చట్టబద్ధత లేదని కాంగ్రెస్ పేర్కొంది. ఓట్ల చోరీ వ్యవహారంతో ప్రజాస్వామ్యంపై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలిపోతోందని వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మన ప్రజాస్వామ్యానికి ముప్పు అని.. ఓటర్ల జాబితాల్లో అక్రమాల కోసం బీజేపీ చేస్తున్న మోసమని అభివర్ణించింది. దేశ ప్రజలు దీనంతటినీ గమనించాలని.. ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చింది. 'ఓట్ చోర్.. గద్దీ చోడ్ (ఓట్ల దొంగ.. గద్దె దిగు)' నినాదం

మిగతా 2వ పేజీలో...

తెలంగాణలో 42% బీసీ రిజర్వేషన్లకు ప్రశంస

దీనిపై ప్రత్యేక తీర్మానం చేశాం: కేసీ వేణుగోపాల్ 2

దేశ ద్రోహి కాంగ్రెస్.. ప్రజా ద్రోహి బీజేపీ

యూరియా అడిగితే థర్డ్ డిగ్రీనా?.. ఇదేనా రాహుల్ మొహబ్బత్ కీ దుకాణ్
మోదీ జీఎస్టీ పేరిట 15 లక్షల కోట్లు దోచుకున్నందుకు పండగ చేస్కోవాలా?
చంద్రబాబు కోసమే మేడిగడ్డ బ్యారేజీని రేవంత్ పట్టించుకోవట్లేదు: కేటీఆర్
కృష్ణా జలాల వాటాపై అవగాహన లేని రేవంత్, ఉత్తమ్: హరీశ్ రావు 12

కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలపై ప్రత్యక్ష పోరాటాలు

తెలంగాణలో హస్తం పార్టీకి బీజేపీయే ప్రత్యామ్నాయం
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 100 శాతం బీజేపీదే విజయం
స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధం: రాంచందర్‌రావు



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రత్యక్ష పోరాటాలకు సన్నద్ధం కావాలని బీజేపీ నిర్ణయించింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు మోసపూరితమని తేలిపోయిందని, ఏ ఒక్క డిక్లరేషన్ కూడా

మిగతా 12వ పేజీలో...



● బ్యాంకాక్‌లో 50 మీటర్లు కుంగిన రోడ్డు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నడిబొడ్డున.. రోడ్డు ఆకస్మాత్తుగా భూమిలోకి కుంగిపోయి 50 మీటర్ల భారీ గొయ్యి ఏర్పడింది. ఫలితంగా పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయి, కరెంటు తీగలు గాల్లో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. నీటి పైపులైన్లు పగిలిపోయి పెద్ద ఎత్తున్న నీరు పైకి ఉబికి రావడంతో పాటు సమీపంలోని భవనాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటన బుధవారం ఉదయం సమ్సెన్ రోడ్డులోని ఓ ఆస్పత్రి సమీపంలో జరిగింది. దీంతో ఆ ప్రాంతాన్ని అధికారులు పూర్తిగా మూసివేశారు. ముందు జాగ్రత్త చర్యగా హాస్పిటల్ నుంచి రోగులను, సమీప అపార్ట్‌మెంట్ వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో జరుగుతోన్న భూగర్భ రైల్వే స్టేషన్ నిర్మాణ పనుల కారణంగానే భారీ గొయ్యి ఏర్పడిందని బ్యాంకాక్ గవర్నర్ చాడ్‌చార్ట్ సిట్టిపాంట్ స్పష్టం చేశారు. అయితే, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, మూడు వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపారు.

మిగ్ శకం ముగిసే వేళాయె!

» మిగ్-21 ఫైటర్ జెట్ల సేవలకు రేపే వీడ్కోలు



చండీగఢ్, సెప్టెంబరు 24: భారత వాయుసేన (ఐఏఎఫ్)లో ఓ చారిత్రక అధ్యయనానికి తెరపడనుంది. ఆరు దశాబ్దాలకు పైగా భారత గగనతల రక్షణకు వెన్నుదన్నుగా నిలిచిన మిగ్-21 సేవలకు వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది. రష్యాకు చెందిన దిగ్గజ మిగ్-21 ఫైటర్ జెట్లు శుక్రవారం చండీగఢ్ ఎయిర్ బేస్‌లో జరిగే డీకమిషన్ కార్యక్రమంలో వాయుసేన నుంచి గౌరవంగా రిటైర్ కానున్నాయి. ఐఏఎఫ్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వీటికి ఘనంగా వీడ్కోలు పలకనున్నారు. 'పాంథర్స్' అనే మారుపేరుతో పిలిచే 23వ స్క్వాడ్రన్‌కు చెందిన చివరి మిగ్-21 బైసన్ యుద్ధ విమానంలో చివరిసారిగా ప్రయాణించి 'బాదల్-3' అనే కాల్‌సైన్‌తో వీడ్కోలు పలుకుతారు. మిగ్-21 యుద్ధ విమానం 1963లో తొలిసారిగా భారత్‌లో అడుగుపెట్టింది కూడా ఈ ఎయిర్‌ఫోర్స్ కేంద్రంలోనే. అప్పట్లో వింగ్ కమాండర్ దిల్బాగ్ సింగ్ దీనికి నాయకత్వం వహించారు. ఆ తర్వాత 1981లో ఆయన ఎయిర్ చీఫ్ మార్షల్ స్థాయికి ఎదిగారు. ఆరు దశాబ్దాలపాటు సేవలందించిన మిగ్-21ల వీడ్కోలుపై ఐఏఎఫ్ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. 'ఆరు దశాబ్దాల సేవ.. లెక్కలేనన్ని ధైర్యసాహసాల కథలు.. ఒక దేశ ఆత్మగౌరవాన్ని గగనతలంలో మోసిన యుద్ధ గుర్రం' అని ట్వీట్ చేసింది. శుక్రవారం జరిగే ఫ్లైపాస్ట్ వేడుకలో పాల్గొనే 23వ స్క్వాడ్రన్‌కు చెందిన ఆరు మిగ్-21 జెట్లు ల్యాండింగ్ అయిన తర్వాత వాటికి జల ఫిరంగులతో అభివాదం చేస్తారు.

నీట్‌లో 1475వ ర్యాంకు..
కాలేజీలో చేరాల్సిన రోజే యువకుడి ఆత్మహత్య!

ఎంబీబీఎస్ ఇష్టం లేదని సూసైడ్ నోట్.. మహారాష్ట్రలో ఘటన

ముంబై, సెప్టెంబరు 24: తమ బిడ్డడు ఇక వైద్యవిద్యలో చేరనున్నాడనే సంబురం ఆ తల్లిదండ్రుల్లో క్షణాల్లోనే మాయమై తీరని విషాదం మిగిలింది. ఎంబీబీఎస్ చదివేందుకు కాలేజీలో ప్రవేశం పొందాల్సిన రోజే ఆ అబ్బాయి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మహారాష్ట్రలోని చంద్రార్‌పూర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. మృతుడు 19 ఏళ్ల అనురాగ్ అనిల్ బోర్కర్. నవార్‌గావ్ గ్రామానికి చెందిన అనురాగ్, నీట్ (అండర్ గ్రాడ్యుయేట్)లో 99.99 పర్సంటైల్ సాధించాడు. జాతీయ స్థాయిలో 1475వ ర్యాంకు వచ్చింది. కౌన్సెలింగ్‌లో యూపీలోని గోరఖ్‌పూర్ కాలేజీలో సీటొచ్చింది. అక్కడికి వెళ్లేందుకు లగేజీతో సిద్ధమైన అనురాగ్, ఇంట్లోనే ఓ గదిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనా స్థలిలో పోలీసులకు సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో అనురాగ్ ఏం రాశాడన్న విషయాన్ని పోలీసులు వెల్లడించలేదు. అయితే.. తనకు వైద్య విద్య చదవడం గానీ, డాక్టర్ అవ్వడం గానీ ఇష్టం లేదని ఆ నోట్‌లో అనురాగ్ రాసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

ఆరేళ్లలోపు పిల్లలను
తాత్కాలిక సంరక్షణకు తీసుకోరాదు: కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: అనాథ పిల్లలను తాత్కాలిక సంరక్షణకు స్వీకరించేందుకు సంబంధించిన నిబంధనలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఆరేళ్లలోపు పిల్లలను తాత్కాలిక సంరక్షణ (ఫోస్టర్ కేర్)కు స్వీకరించకూడదని తెలిపింది. తాత్కాలిక సంరక్షణ విషయమై జువెనైల్ జస్టిస్ రూల్స్‌లోని నిబంధన నెంబరు 23(3), తాత్కాలిక సంరక్షణ మార్గదర్శకాల్లోని పాయింట్ నెంబరు 4(1)కి రకరకాలుగా భాష్యాలు చెబుతున్న నేపథ్యంలో ఈ స్పష్టతనిచ్చింది. ఏయే సందర్భాల్లో పిల్లలను తాత్కాలిక సంరక్షణకు స్వీకరించవచ్చో అన్నదాన్ని జువెనైల్ జస్టిస్ చట్టంలోని రూల్ నెంబరు 44లో వివరించారని, వాటిని పాటిస్తూ ఆరేళ్లు, అంతకుపైబడ్డ వయసు ఉన్నవారినే స్వీకరించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు దత్తత వ్యవహారాలను పర్యవేక్షించే సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) రాష్ట్ర, జిల్లా స్థాయి సంస్థలకు సమాచారం పంపించింది. మరోవైపు, తప్పిపోయిన పిల్లలను గుర్తించేందుకు, అందుకు సంబంధించిన కేసులను దర్యాప్తు చేసేందుకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందించాలని బుధవారం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

మతమార్పిడి అక్రమమైతే పెళ్లి చెల్లదు

» అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్, సెప్టెంబరు 24: మతమార్పిడి చట్టవిరుద్ధమని తేలినప్పుడు దాని ఆధారంగా జరిగే వివాహం కూడా ఆటోమేటిక్‌గా రద్దవుతుందని అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పింది. చట్టం దృష్టిలో వారు వివాహితులు కారని తెలిపింది. ముస్లిం మతానికి చెందిన మహమ్మద్ బిన్ కాసీం అలియాస్ అక్బర్, హిందూ మతానికి చెందిన జైనాబ్ పర్వీన్ అలియాస్ చంద్రకాంతల వివాహం విషయంలో కోర్టు ఈ తీర్పునిచ్చింది. చంద్రకాంత మతం మారినట్టు దొంగ సర్టిఫికెట్లు సమర్పించారని ఆమె తల్లిదండ్రులు పిటిషన్ సమర్పించగా, తమ వివాహంలో ఇతరులు జోక్యం చేసుకోకూడదంటూ కాసీం వేసిన మరో పిటిషన్ వేశారు. ఈ రెండింటిపై న్యాయమూర్తి విచారణ జరిపారు. చంద్రకాంత ముస్లిం మతంలోకి మారినట్టు ఖాన్‌కారే ఆలియా అరిఫీయా సంస్థ ఫిబ్రవరి 22న సర్టిఫికెట్ ఇచ్చింది. దాన్ని ఆధారం చేసుకొని మే 26న ముస్లిం చట్టాల ప్రకారం వివాహం జరిపించినట్టు క్వాజీ ధ్రువపత్రం ఇచ్చారు. మతమార్పిడి జరిగినట్టు ఇచ్చిన సర్టిఫికెట్ నకిలీదని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. ఆ ఆరోపణ సరైనదేనని, తాము ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదని ఆ సంస్థ కార్యదర్శి తెలిపారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి వివాహం చెల్లదని ప్రకటించారు. అయితే వారు ప్రత్యేక వివాహం చట్టం కింద పెళ్లిని రిజిస్టర్ చేసుకోవచ్చని, దాని ప్రకారమయితే మత మార్పిడి సమస్య తలెత్తదని సూచించారు.

మోదీ సర్కార్‌కు చట్టబద్ధత లేదు



(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు బిహార్‌లో ఇంటింటా వినిపిస్తోందని, రేపు దేశవ్యాప్తంగా మారుమోగుతుందని పేర్కొంది. ఈ మేరకు బిహార్‌లోని పాట్నాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో రెండు తీర్మానాలు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో అగ్రనేత రాహుల్ గాంధీ, సీనియర్లు అజయ్ మాకెన్, కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేశ్, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దామోదర, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నిర్ణయాలు తీసుకునే సీడబ్ల్యూసీ సమావేశాలను దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బిహార్‌లో నిర్వహించడం ఇదే మొదటిసారి.

రాహుల్‌కు సెల్యూట్ చేస్తున్నాం..

ఓటు చోరీ వ్యవహారంతో దేశ ప్రజల్లో ప్రజాస్వామ్యంపై నమ్మకం సడలిపోతోందని సీడబ్ల్యూసీ తీర్మానంలో పేర్కొంది. "బీజేపీ గెలిచేలా వ్యవస్థీకృతంగా, క్రమపద్ధతిలో జరుగుతున్న కుట్ర బయటపడింది. ఇలా ఓట్ల చోరీతో ఏర్పడిన ఈ ప్రభుత్వానికి ఎలాంటి నైతిక, రాజకీయ చట్టబద్ధత లేదు. నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, ధరల పెరుగుదల, విద్య, వైద్య వ్యవస్థల విధ్వంసం వంటివేవీ బీజేపీకి పట్టవు. ఎందుకంటే తాము ప్రజలకు సేవ చేసి ఓట్లు పొందాల్సిన అవసరం లేదని, ఓట్ల చోరీతో గెలిచేయవచ్చని వారికి తెలుసు. అలాంటి ఓటు చోరీపై ధైర్యంగా పోరాడుతూ, అవకతవకలను బయటపెడుతున్న రాహుల్ గాంధీకి సెల్యూట్ చేస్తున్నాం" అని తెలిపింది. ఇప్పుడు ఓటు చోరీ చేస్తున్నవారు భవిష్యత్తులో ప్రజల గౌరవాన్ని, రాజ్యాంగం కల్పించిన హక్కులనూ చోరీ చేస్తారని విమర్శించింది. సమావేశం అనంతరం జైరామ్ రమేశ్ మీడియాతో మాట్లాడారు. "వచ్చే నెలలో రాహుల్ గాంధీ ఓటుచోరీపై మరిన్ని కీలక అంశాలను బయటపెడతారు. ఎన్డీయే ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. తెలంగాణలో సీడబ్ల్యూసీ భేటీ నిర్వహించిన ఐదు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు రెండు నెలల్లో బిహార్‌లో మహాఘట్‌బంధన్ కూటమి అధికారంలోకి రావడం ఖాయం" అని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో ఈబీసీలకు చట్టం: రాహుల్

బీసీల్లో మరింత వెనుకబడిన కులాల (ఈబీసీ) వారి కోసం.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం తరహాలో ప్రత్యేక చట్టం తెస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. బిహార్‌లోని పాట్నాలో సీడబ్ల్యూసీ భేటీ అనంతరం 'ఈబీసీలకు న్యాయ సంకల్పం' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ మాట్లాడారు. బిహార్ జనాభాలో ఎక్కువశాతం ఉన్న ఈబీసీల కోసం 10 ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. ఈబీసీ అట్రాసిటీస్ చట్టం తెస్తామని, స్థానిక ఎన్నికల్లో వారి రిజర్వేషన్లను 30శాతానికి పెంచుతామని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లోనూ రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు.

మోదీ 'కౌగిలింతల దౌత్యం' బెడిసికొట్టింది

గత పదేళ్లలో భారత విదేశాంగ విధానం కుప్పకూలిపోయిందని.. మోదీ 'కౌగిలింత దౌత్యం' బెడిసికొట్టిందని కాంగ్రెస్ విమర్శించింది. దౌత్యపరంగా మన దేశం ఒంటరిదైపోయిందని, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోలేని దుస్థితిలో పడిందని తీర్మానంలో ఆరోపించింది. "ఎన్డీయే ప్రభుత్వం అటు అమెరికా, ఇటు చైనాల మధ్య ఊగిసలాడుతూ తెలివితక్కువగా వ్యవహరించింది. మిత్రదేశం అంటూనే భారత్‌పై ట్రంప్ భారీగా టారిఫ్‌లు విధించారు. హెచ్1బీ వీసాల విధానాన్ని కఠినతరం చేశారు. దీనికి ప్రతిగా మోదీ ప్రభుత్వం చైనా వైపు మళ్లింది. ఇది మరింత ప్రమాదకరం. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా ఆయుధాలు అందించింది" అని పేర్కొంది. అమెరికా జబ్బు కంటే..చైనా పేరిట వేస్తున్న మందు మరింత ప్రమాదకరమని అభివర్ణించింది.

మోదీ ప్రభుత్వ పతనానికి నాంది: ఖర్గే

బిహార్‌లో జరగనున్న ఎన్నికలు భవిష్యత్తులో కేంద్రంలో మోదీ అవినీతి ప్రభుత్వ పతనానికి నాంది పలకనున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఓట్ల చోరీ, ఆర్థిక వ్యవస్థ మందగమనం, నిరుద్యోగం, సామాజిక విభజన, స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలను బలహీనం చేయడం వంటివాటితో దేశం అల్లకల్లోలం అవుతోందని ఆరోపించారు. అయితే, బిహార్‌లో మిత్రపక్షాలపై పెత్తనం చేసేందుకే పాట్నాలో సీడబ్ల్యూసీ భేటీ నిర్వహించారని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. దీనిని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ఖండించారు.

తెలంగాణలో 42% బీసీ రిజర్వేషన్లకు ప్రశంస

దీనిపై ప్రత్యేక తీర్మానం చేశాం: కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ, ఈబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సీడబ్ల్యూసీ సమావేశం ప్రశంసించింది. ఈ మేరకు ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించినట్టు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత తొలుత తెలంగాణకే దక్కిందన్నారు. సీడబ్ల్యూసీ భేటీలో దేశ రాజకీయ పరిస్థితిపై జైరాం రమేశ్, బిహార్‌లో పరిస్థితిపై ఆ రాష్ట్ర పీసీసీ చీఫ్ రాజేశ్‌రామ్ తీర్మానాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత పునర్ వ్యవస్థీకరణ, ఓట్ చోరీ అంశంపై విస్తృతంగా చర్చించామన్నారు.

ఓటు తొలగింపునకు ఈ-వెరిఫికేషన్ తప్పనిసరి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: ఓటర్ల జాబితా నుంచి ఓటు తొలగింపు ప్రక్రియ దుర్వినియోగం కాకుండా కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో, ఓటర్ ఐడీకి జత చేయబడిన మొబైల్‌కు ఓటీపీ పంపించడం ద్వారా ఓటును తొలగించడానికి అవకాశం ఉండేది. తాజా మార్పుతో ఈసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో ఓటు తొలగింపునకు ఫాం 7, కొత్త ఓటు కోసం ఫాం 6 దరఖాస్తు చేసినపుడు పాప్ అప్ వస్తుంది. అది ఆధార్ వెరిఫికేషన్‌కు సూచనలు చేస్తుంది. అది పూర్తయిన తరువాత మాత్రమే తిరిగి ఈసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో దరఖాస్తు స్వీకరణ పూర్తి అవుతుంది. కర్ణాటకలోని ఆళంద అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేయడానికి చాలా ముందుగానే... ఈ ఏడాది జూలై - ఆగస్టు నెలల్లోనే ఆ మేరకు సాంకేతిక మార్పులు చేసినట్లు ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఈ మార్పు రాహుల్ ఆరోపణలకు స్పందన ఎంత మాత్రం కాదని ఈసీ స్పష్టం చేసింది. 'ఆళందలో ఓట్ల తొలగింపునకు 6,018 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందాయి. పరిశీలన అనంతరం కేవలం 24 మాత్రమే సరైనవని, మిగిలిన 5,994 దరఖాస్తులు తప్పుడివని తేలింది. వాటిని తిరస్కరించాం' అని ఈసీ పేర్కొంది.

లోకం తీరు



ఓటు రక్షకులు వస్తున్నారు!


» 'ఓట్ల చోరీ' కట్టడిలో భాగంగా నియమించనున్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24 : 'ఓట్ల చోరీ'పై ఈసీని తప్పుబడుతూ పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఓట్ల రక్షకులను రంగంలోకి దింపుతోంది. ఓటరు జాబితాలను పరిశీలించి ఓటు చేర్పు, తొలగింపుల్లో గుర్తించిన అక్రమాలను 'ఓట్ల రక్షకులు' ఈసీ దృష్టికి తీసుకెళతారు. ఇందుకు అవసరమైన శిక్షణను వీరికి కాంగ్రెస్ ఇస్తుంది. ఈ మొత్తం కార్యక్రమాన్ని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక వాద్రా పర్యవేక్షిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఓట్ల రక్షకుల తుది జాబితా ఖరారు, వారికి శిక్షణ ఆమె ఆధ్వర్యంలో చేపడుతున్నట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో భాగంగా.. ప్రయోగాత్మకంగా తొలుత ఐదు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో వీరిని నియమిస్తారు. గత లోక్‌సభ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన రాజస్థాన్ రూరల్, ఆల్వార్ (రాజస్థాన్); కాంకెర్ (ఛత్తీస్‌గఢ్), మొరేనా(మధ్యప్రదేశ్), బాన్స్‌గావ్(యూపీ)లను ఇందుకోసం ఎంపిక చేశారు. ఇరవై పోలింగ్ కేంద్రాలకు ఒకరి చొప్పున ఒక లోక్‌సభ పరిధిలో 100 మందిని నియమిస్తారు. గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి సమక్షంలోనే శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆ తర్వాత 20వేలు కంటే తక్కువ ఓట్ల తేడాతో కోల్పోయిన మరో ఐదు స్థానాలను ఎంపిక చేయనున్నారు. కాగా, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. కర్ణాటకలోని అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్లచోరీ వ్యవహారంలో సీఐడీ అడిగిన ఆధారాలను ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. అలంద్‌లో ఓటరు జాబితానుంచి కొందరి పేర్లు ఈసీ తొలగించిందనేది తేలిపోయిందని రాహుల్ వ్యాఖ్యానించారు.

రైల్వే ఉద్యోగులకు బోనస్

» ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951

» 10.91 లక్షల మందికి ప్రయోజనం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: రైల్వే ఉద్యోగులకు ఉత్పాదకత ఆధారిత బోనస్‌ను కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఇది ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 వరకు ఉంటుందని తెలిపింది. దీని వల్ల 10,91,146 మంది ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ.. రైల్వే ఉద్యోగుల బోనస్‌కు ఆమోద ముద్ర వేసింది. ఏటా దసరా పండగ వేళ ఉత్పాదకత ఆధారిత బోనస్‌ను రైల్వే ఉద్యోగులకు కేంద్రం ప్రకటిస్తోంది. 2024-25లో రైల్వే ఉద్యోగుల పనితీరు చాలా బాగుందని, 1614.9 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా జరిగిందని, 730 కోట్ల మంది ప్రయాణికులు రైల్వేలో ప్రయాణించారని ఒక ప్రకటనలో కేంద్రం తెలిపింది. సముద్ర వాణిజ్యరంగానికి పెద్ద పీట వేస్తూ నౌకల తయారీ, మౌలిక సదుపాయాల పెంపుదలకు రూ.69,725 కోట్ల భారీ ప్యాకేజీకి కేంద్ర క్యాబినెట్ అంగీకరించింది. దీనివల్ల 45 లక్షల టన్నుల నౌకా నిర్మాణ సామర్థ్యం సమకూరుతుందని, ఈ రంగంలోకి రూ.4.5 లక్షల కోట్ల పెట్టుబడులు తరలివస్తాయని, ఫలితంగా కొత్తగా దాదాపు 30 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని కేంద్రం ఒక ప్రకటనలో వెల్లడించింది. మరోవైపు, దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో డాక్టోరల్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లకు రూ.2,277 కోట్లను కేటాయించే పథకానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఎన్నికలు జరగనున్న బిహార్‌లో రూ.2,192 కోట్ల వ్యయంతో 104 కి.మీ.ల సింగిల్ రైల్వే ట్రాక్‌ను డబ్లింగ్ చేసే ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతోపాటు ఆ రాష్ట్రంలో రహదారుల విస్తరణకు రూ.3,822 కోట్ల మొత్తాన్ని కేటాయించింది.

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

» ముగ్గురు మావోయిస్టుల మృతి

రాంచీ, సెప్టెంబరు 24: ఝార్ఖండ్ రాష్ట్రంలోని గుమ్లా జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బిష్ణుపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం అందడంతో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో బలగాలను చూసిన మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. ప్రతిదాడిగా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఆరుగురు నక్సలైట్లు బుధవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. ఈ ఆరుగురిపై మొత్తం రూ.62 లక్షల రివార్డులు ఉన్నాయని డీజీపీ రష్మి శుక్లా తెలిపారు. లొంగిపోయిన వారిలో నార్త్ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యుడు భీమన్న అలియాస్ సుఖ్‌లాల్ ముత్తయ్య కుల్మేథే (58), అతడి భార్య విమలక్క, సద్మేక్ (56) కూడా ఉన్నారు. వీరిద్దరిపై రూ. 16 లక్షల చొప్పున రివార్డు ఉంది.

భగ్గుమన్న లద్దాఖ్



లద్దాఖ్ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు నిప్పు పెట్టిన ఆందోళనకారులు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ హింసాత్మక ఘటనల్లో నలుగురు మరణించగా, 22 మంది పోలీసులు సహా 70 మందికిపైగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. నిరసనలు హింసగా మారడంతో కేంద్ర ప్రభుత్వం లేహ్‌లో ఆంక్షలు విధించింది. నిరసనలు, ఎక్కువ మంది గుమిగూడడంపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని ఎన్డీయే ప్రభుత్వం 2019, ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఆ తర్వాత జమ్మూకశ్మీరు, లద్దాఖ్‌లకు రాష్ట్ర హోదా కల్పించాలన్న డిమాండ్లు వచ్చాయి. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ పరిధిలో చేర్చాలని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. ఈ డిమాండ్లతో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నేతృత్వంలో 15 మంది నిరాహార దీక్ష ప్రారంభించారు. వారిలో ఇద్దరి ఆరోగ్యం క్షీణించడంతో బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో వాంగ్‌చుక్ మంగళవారం తన నిరశనను విరమించారు. హింసకు పాల్పడవద్దని ఆందోళనకారులకు విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో 'లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ)'కి చెందిన యువజన విభాగం ఆందోళనలకు పిలుపునిచ్చింది. బుధవారం కొందరు నిరసనకారులు పోలీసులపైకి రాళ్లు విసరడంతో హింస మొదలైంది. నిరసనకారులు బీజేపీ కార్యాలయానికి, సెక్రటేరియట్ భవనానికి నిప్పు పెట్టారు. ప్రజల డిమాండ్లపై చర్చించేందుకు అక్టోబరు 6న సమావేశానికి రావాలంటూ కేంద్రం లద్దాఖ్ ప్రతినిధులను ఆహ్వానించిన సమయంలో ఈ హింస చోటుచేసుకోవడం గమనార్హం. కాగా, లద్దాఖ్‌లో హింసకు కారణం పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అని కేంద్ర హోం శాఖ ఆరోపించింది. "అరబ్ ప్రజాస్వామ్య ఉద్యమాలు, నేపాల్‌లో జెన్-జీ ఉద్యమాలను ప్రస్తావిస్తూ వాంగ్‌చుక్ రెచ్చగొట్టే ప్రకటనలు చేశారు. ఆ ప్రకటనలతో రెచ్చిపోయిన అల్లరిమూకలు హింసకు పాల్పడ్డారు" అని పేర్కొంది.

రాజ్యాంగ భద్రతల కోసం..!

కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలనను లద్దాఖ్ ప్రజలు మూడేళ్లుగా నిరసిస్తున్నారు. తమ భూమి, సంస్కృతి, వనరుల పరిరక్షణ కోసం రాజ్యాంగ భద్రత ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర హోదాతో పాటు లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతున్నారు. అలాగే లేహ్, కార్గిల్‌కు వేర్వేరు లోక్‌సభ స్థానాలు ఉండాలని, లద్దాఖ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. వాంగ్‌చుక్ పదేపదే నిరాహార దీక్షలకు దిగడంతో లద్దాఖ్ ప్రజల ఉద్యమం వెలుగులోకి వచ్చింది. తాజాగా ఆయన ఈ నెల 10 నుంచి 35 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. కానీ, ఆందోళనలు హింసాత్మకం కావడంతో మంగళవారం దీక్షను విరమించారు.

తొలగించిన ఉద్యోగులకు మళ్లీ డిమాండ్!

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించడం కన్నా.. తీసేసిన పాత ఉద్యోగులనే మళ్లీ కొలువుల్లోకి తీసుకుందామనే నిర్ణయానికి ఆయా కంపెనీలు వస్తున్నాయి. గణాంకాలు చూస్తే.. 2025 జనవరి నుంచి ఇప్పటిదాకా టెక్ కంపెనీలు 1,44,926 మందిని తొలగించాయి. వ్యయ నియంత్రణ పేరుతోనో.. కృత్రిమ మేధ కారణంగానో.. 2024లో తొలగించిన ఉద్యోగుల సంఖ్య ఏకంగా 2,38,461 కావడం గమనార్హం. హెచ్-1బీ వీసా కలిగి ఉండి ఇలా కంపెనీల నిర్ణయాల కారణంగా ఉద్యోగాలు కోల్పోయినవారికి ఆ వీసా స్టేటస్ 60 రోజులపాటు యాక్టివ్‌గానే ఉంటుంది. ఆలోగా వారు వేరే కంపెనీల్లో ఉద్యోగాలు చూసుకోవడానికే ఆ వెసులుబాటు. అలా ఇటీవలికాలంలో ఉద్యోగాన్ని కోల్పోయినవారిలో చాలా మందికి.. తమ వద్ద చేరాలంటూ త్వరలోనే కంపెనీల నుంచి ఫోన్ కాల్స్ వచ్చే అవకాశం ఉందని అమెరికాలోని ఇమిగ్రేషన్ లా ఫర్మ్ 'చగ్ ఎల్ఎల్‌సీ' న్యాయవాది నవనీత్ ఎస్ చగ్ తెలిపారు. వారికి హెచ్-1బీ వీసా ఉన్నందున.. మళ్లీ లాటరీలోకి వెళ్లాల్సిన అవసరం ఉండదు. సాధారణ ట్రాన్స్‌ఫర్ పిటిషన్ ద్వారా తమ కంపెనీలోకి తీసుకోవచ్చు. ఇన్ని ప్రయోజనాలు ఉండడంతో కంపెనీల దృష్టి అలాంటి ఉద్యోగులపై పడింది. కాగా.. ఇప్పటికే ఇండియాలో ఏర్పాటు చేసుకున్న గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల(జీసీసీ) ద్వారా ప్రపంచవ్యాప్తంగా తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్న అమెరికన్ బ్యాంకులు సిటీగ్రూప్, గోల్డ్‌మ్యాన్ శాక్స్ గ్రూప్ వంటివి.. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయా జీసీసీలపై మరింతగా ఆధారపడేందుకు సిద్ధమవుతున్నట్టు బ్లూమ్‌బెర్గ్ సంస్థ ఒక నివేదికలో పేర్కొంది.

మా దేశానికి రండి

నిపుణులైన భారతీయ టెకీలకు అమెరికా తన ద్వారాలు మూసేస్తుంటే.. వరుసగా ఇతర దేశాల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల చైనా మన టెకీలకు ఆహ్వానం పలకగా.. తాజాగా జర్మనీ భారతీయ ప్రతిభకు తలుపులు తెరిచింది. "స్థిరమైన వలస విధానాలు, ఐటీ, మేనేజ్‌మెంట్, టెక్నాలజీ, సైన్స్ రంగాల్లో ఇండియన్లకు గొప్ప ఉద్యోగావకాశాలతో జర్మనీ ప్రత్యేకంగా నిలుస్తోంది.. అత్యంత నిపుణులైన భారతీయులకు ఇదే నా పిలుపు" అంటూ భారత్‌లో జర్మనీ రాయబారిగా ఉన్న డాక్టర్ ఫిలిప్ అకర్‌మాన్ 'ఎక్స్' ద్వారా పిలుపునిచ్చారు. జర్మనీలో స్థానికుల కన్నా అక్కడ పనిచేస్తున్న భారతీయుల సగటు సంపాదనే ఎక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



ఫిలిప్ అకర్‌మాన్

సాహితీవేత్త భైరప్ప కన్నుమూత



బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహితీవేత్త ఎస్ఎల్ భైరప్ప(94) బుధవారం కన్నుమూశారు. ఆయన హాసన్ జిల్లా చన్నరాయపట్టణలో 1931, ఆగస్టు 30న జన్మించారు. తన రచనల ద్వారా ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన రాసిన 'తంతు' నవలకు భారతీయ భాషా పరిషత్ పురస్కారం లభించింది. 'దాటు' నవలకు 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. 2010లో మంద్ర నవలకు సరస్వతి సమ్మాన్ పురస్కారం లభించింది. సరస్వతీ సమ్మాన్ పురస్కారం పొందిన తొలి కన్నడిగుడిగా ఆయన గుర్తింపు పొందారు. భైరప్ప 2023లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు.

పహల్గాం ఉగ్రవాదులకు సహకరించిన లష్కర్ సభ్యుడి అరెస్టు

శ్రీనగర్, సెప్టెంబరు 24: పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి కేసులో జమ్మూ-కశ్మీర్ పోలీసులు మరో వ్యక్తిని పట్టుకున్నారు. ఉగ్రవాదులకు ప్రయాణ సౌకర్యాలు కల్పించాడన్న ఆరోపణపై కుల్గాం జిల్లాకు చెందిన మహమ్మద్ యూసుఫ్ కటారియా (26)ను అరెస్టు చేశారు. అతడు లష్కర్ ఎ తోయిబాలో కీలక సభ్యుడిగా పనిచేస్తున్నాడు. కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేటు 14 రోజుల రిమాండ్ విధించారు. జులై నెలలో నిర్వహించిన ఆపరేషన్ మహదేవ్‌లో మరణించిన ఉగ్రవాదులకు ప్రయాణ సౌకర్యాలు కల్పించినట్టు గుర్తించారు. ఆ సందర్భంగా లభించిన ఆయుధాలను విశ్లేషించినప్పుడు అతడి ప్రమేయం ఉన్నట్టు తేలింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ నోట అదేమాట!

ఐక్యరాజ్యసమితిలో అమెరికా అధ్యక్షుడి ప్రసంగం కంటున్న, వింటున్న వారికి ఎదురుగా డోనాల్డ్ ట్రంప్ కాక ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూను చూస్తున్నట్టే ఉండట. పాలస్తీనా విషయంలో ట్రంప్ ఈ అంతర్జాతీయ వేదికమీద చేసిన వ్యాఖ్యలన్నీ ఇజ్రాయెల్ ప్రధాని స్వహస్తాలతో రాసిచ్చినట్టుగా ఉండటంలో ఆశ్చర్యమేమీ లేదు. అమెరికా అధ్యక్షుడు కాస్తంత ఎడంగా గాజా, పాలస్తీనాల విషయంలో ఆలోచనలు చేస్తున్నారన్న భ్రమలు ఎవరికైనా ఇంకా మిగిలివుంటే ఈ దెబ్బతో తొలిగిపోయినట్టే. దౌత్యానికీ, చర్చలకు, అవగాహనకు వేదికగా నిలవాల్సిన ఐక్యరాజ్యసమితిలో ఆయన ఓ చవుకబారు రాజకీయ ప్రసంగం చేశారు. పనిలోపనిగా సమితిని ఎందుకూ కొరగానిదంటూ తీవ్రంగా అవమానించాడు. పాలస్తీనాను స్వతంత్రదేశంగా గుర్తించిన 80శాతం సభ్యదేశాలను ఉగ్రవాదుల మద్దతుదారులుగా అభివర్ణించాడు. ఇజ్రాయెల్, పాలస్తీనాలు ఇరుగుపొరుగు దేశాలుగా సుహృద్భావంతో కొనసాగడమనే ఆలోచనే మహాపాపమని ఆయన తేల్చేశాక, మిగతా ప్రపంచం ఎంత గొంతుచించుకున్నా ప్రయోజనం ఉండకపోవచ్చు.

గాజా పూర్తిగా నేలమట్టమై, ఆకలికీ, ఆయుధాలకు డెబ్బైవేలమంది పాలస్తీనియన్లు ప్రాణాలు వదిలేసి, లక్షలాదిమంది తరలిపోయిన తరువాత, ఇంతకాలమూ నోరుమెదపని దేశాలన్నీ ఇప్పుడు ఒక్కసారిగా స్వతంత్ర పాలస్తీనా వంటి పెద్దపెద్ద మాటలు మాట్లాడటం పాలస్తీనియన్లను అవమానించడమేనని అంటారు కొందరు. అమెరికా అధ్యక్షుడి ప్రసంగంలో గాజా ఊసులేదు, అక్కడ ఒక మారణకాండ సాగుతోందనీ, అది మరుభూమిగా మారిందన్న స్పృహే ఆయన భాషలో కనబడలేదు. నెతన్యాహూ మాదిరిగానే ట్రంప్ దృష్టిలో పాలస్తీనియన్లు అరాచకశక్తులు, విధ్వంసకారులు. వారి గురించి ఆలోచించడం, వారి ఉనికిని గుర్తించడమంటే ఆప్తమిత్ర ఇజ్రాయెల్‌కు ద్రోహం చేయడమే.

యూకే, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా ఇత్యాది పెద్దదేశాలు సైతం ఐక్యరాజ్యసమితిలో పాలస్తీనాను అధికారికంగా గుర్తించడం వందేళ్ళ ఇజ్రాయెల్–పాలస్తీనా ఘర్షణలో చరిత్రాత్మకమైన మార్పుగానే చెప్పుకోవాలి. ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సారథ్యంలో సాగుతున్న ఈ ప్రయత్నం దౌత్యం మాత్రమే హమాస్ మీద ఒత్తిడి పెంచుతుందని నమ్ముతోంది. గాజాలో యుద్ధం ముగించి, రెండు రాజ్యాల ఏర్పాటుతో శాంతి నెలకొంటుందని వీరి వాదన. అరబ్ దేశాలన్నీ హమాస్ నిరాయుధీకరణను, పాలస్తీనా అథారిటీకి ఆయుధాల అప్పగింతనూ గట్టిగా కోరుతున్నందున రెండేళ్ళకు పైగా సాగుతున్న యుద్ధాన్ని ఈ మార్గంలో ఆపవచ్చునని వాటి నమ్మకం. అయితే, అమెరికా మద్దతుతోనే పాలస్తీనా రాజ్యస్థాపన సాధ్యమవుతుందనీ, లేనిపక్షంలో అది పగటికలగా మిగిలిపోతుందనీ, గాజా పీడకల సజీవంగా కొనసాగుతుందని యూరప్ పెద్దలకు తెలియనిదేమీ కాదు. గాజా మారణకాండ అంతిమదశకు చేరుకున్న ఈ తరుణంలోనైనా అమెరికా అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించనిపక్షంలో యూరప్ పరువు పూర్తిగా మంటగలిసిపోతుందని వారి భయం. ఆచరణ సాధ్యమేనా అన్న ప్రశ్నను అటుంచితే, రెండుదేశాల సిద్ధాంతాన్ని సజీవంగా ఉంచడానికి వీరి ప్రయత్నం ఉపకరిస్తుంది. అమెరికా మీద కాకున్నా, ఇజ్రాయెల్‌మీద ఒత్తిడి పెంచడానికి పనికొస్తుంది.

పాలస్తీనా దేశం ప్రస్తావన తెస్తే, గాజాకు పట్టిన గతే వెస్ట్‌బ్యాంక్ వంటి ఆక్రమిత భూభాగాలకు పడుతుందన్నది నెతన్యాహూ వ్యాఖ్యల సారాంశం. వెస్ట్‌బ్యాంక్‌ను పూర్తిగా ఆక్రమించుకొని రెండు దేశాల ఆలోచనకు పునాదిలోనే గండికొట్టేందుకు ఆయన సిద్ధంగా ఉన్నాడు. పాలస్తీనా ఊసుని మొత్తంగా చెరిపివేయడానికి ఆ ప్రాంతాల్లో గాజా తరహా ఊచకోతలకు కూడా ఆయన వెనుకాడడు. ఆ కర్తవ్య నిర్వహణలో తన అండదండలు సంపూర్ణంగా ఉంటాయన్నది ట్రంప్ ప్రసంగం సారాంశం. భద్రతామండలిలో మిగతా పద్నాలుగు దేశాలూ మరోవైపు ఉన్నప్పటికీ, వీటో ప్రయోగించి ఇజ్రాయెల్‌ను ఎప్పటికప్పుడు అమెరికా రక్షించుకువస్తున్నది. ఇప్పుడు సర్వప్రతినిధి సభలోనూ స్వతంత్ర పాలస్తీనా విషయంలో అమెరికా, ఇజ్రాయెల్ ఏకమాటగా ఉన్నాయి. ఇజ్రాయెల్‌కు నిరంతరాయంగా సర్వశక్తులూ సమకూరుస్తూ పాలస్తీనియన్ల ఊచకోతలో తన చేయి కూడా ఉన్న అమెరికా అధ్యక్షుడు నోబెల్‌శాంతి గురించి వల్లిస్తూండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

కీలకమవుతున్న డిజిటల్ అక్షరాస్యత

చాలా మంది చదవటం, రాయటం రావడమే అక్షరాస్యత అనుకుంటారు. డిజిటల్ అక్షరాస్యతపైనా ఇలాంటి అపోహలే వున్నాయి. 'నాకు స్మార్ట్ ఫోన్ వాడకం తెలుసు. వాట్సాప్ చాటింగ్ చేస్తున్నాను. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలున్నాయి. వీడియోలు తీసి యూట్యూబ్‌లో పెడుతున్నాను... కాబట్టి నాకు డిజిటల్ అక్షరాస్యతవున్నట్టే' అని చాలామంది భావిస్తుంటారు. కానీ అది సరిపోదు. మన నిత్యజీవితావసరాల్లో ఎన్నింటికి మనం యాప్స్‌ను వాడుకోగలుగుతున్నాం అనేది మన డిజిటల్ అక్షరాస్యత స్థాయిని తెలియజేస్తుంది.



ప్రయాణాలకు టిక్కెట్లు కావాలి, అత్యవసరంగా ఫుడ్ కావాలి, బయటకు వెళ్లడానికి క్యాబ్ కావాలి... వీటన్నిటికీ తత్తరపడకుండా సమర్థవంతంగా యాప్స్ ఉపయోగించుకోగలుగుతున్నామా? మనకు తెలిసిన సమాచారం అవునో కాదో నిర్ధారించుకోవాలి... ఇంటర్నెట్‌ను పూర్తి స్థాయిలో శోధించగలుగుతున్నామా? అసలు సాగులో ప్రాథమిక పాఠాలు మొదలుకొని సంక్లిష్టమైన సైన్సు విషయాల వరకూ ఆన్‌లైన్‌లో అందుబాటులో వుంటాయని మనకు తెలుసు... వాటిని మన అవసరం మేరకు వాడుకోగలుగుతున్నామా?

బ్రిటిష్ శాస్త్రవేత్త హెర్బర్ట్ స్పెన్సర్ ప్రతిపాదించిన 'సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్' (Survival of the Fittest) సిద్ధాంతం అందరికీ తెలుసు. పర్యావరణ మార్పులకు అనుగుణంగా మనుగడ సాగించగల జీవులే కొనసాగుతాయనీ, అలా లేనివి కనుమరుగవుతాయని దాని సారాంశం. డిజిటల్ అక్షరాస్యత కూడా అంతే. ప్రపంచం వేగంగా మారిపోతున్నప్పుడు మనం దానికి దీటుగా రూపొందాలి. విద్యార్థులు, పట్టభద్రులు, రైతులు, కార్మికులు, గృహిణులు... ఒకరేమిటి, అన్ని వర్గాలవారూ దీన్ని సాధించి తీరాల్సిన లక్ష్యంగా భావించకపోతే దూసుకుపోతున్న ప్రపంచం మనల్ని జాలిగా చూస్తుంది. టెక్నాలజీ ప్రపంచంలో మనకు చోటుండదు. వెనకబడి పోతాం.

మన దేశంలో ప్రస్తుతం 80.6 కోట్లమంది ఇంటర్నెట్ వినియోగదారులున్నారు. ఈ ఏడాది ఆఖరుకు అది 90 కోట్లు దాటుతుందన్న అంచనా వుంది. బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు ఇప్పటికే 98.5 కోట్లకు చేరుకున్నాయి. అందులో వైర్‌లెస్ వాటా 93.5 కోట్లయితే, వైర్ కనెక్షన్‌వి 4.5 కోట్లు. ఈ విస్తృతి మన దేశానికి ఒక ఖ్యాతిని తెచ్చింది. ప్రపంచ ఆన్‌లైన్ జనాభా వరసలో మనం రెండో స్థానంలో వున్నాం. ఇదంతా నగర, పట్టణ ప్రాంతాల వ్యవహారం అనుకోనవసరం లేదు. గ్రామీణ భారతంలో 40 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులున్నారు. అంటే డిజిటల్ విభజన చెరిగిపోవటం ఇక ఎంతో దూరంలో లేదు! 96 శాతం 5జీ కవరేజ్‌లోకి వెళ్లాక డిజిటల్ ఉపకరణాలు మన జీవితంలో విడదీయరాని భాగం అయ్యాయి. చెల్లింపులు మొదలుకొని ఆరోగ్య పరిరక్షణ వరకూ అన్నీ ఆ ఉపకరణాలతో ముడిపడివున్నాయి.



ప్రపంచం వేగంగా మారిపోతున్నప్పుడు మనం దానికి దీటుగా రూపొందాలి. విద్యార్థులు, పట్టభద్రులు, రైతులు, కార్మికులు, గృహిణులు... ఒకరేమిటి, అన్ని వర్గాలవారూ 'డిజిటల్ అక్షరాస్యత'ను సాధించి తీరాల్సిన లక్ష్యంగా భావించకపోతే ముందుకు దూసుకుపోతున్న ప్రపంచం మనల్ని జాలిగా చూస్తుంది. టెక్నాలజీ ప్రపంచంలో మనకు చోటుండదు. వెనకబడిపోతాం.

మనకు దృగ్గోచరంకాని కొన్ని వ్యవస్థలు సమష్టిగా పనిచేయటం, మన దగ్గరుండే యాప్‌లు సమన్వయంతో మనకు కావలసిన ఫలితాలను రాబడతాయని అవగాహన చేసుకోవటం డిజిటల్ అక్షరాస్యతలో ప్రధానమైన భాగం. ఉదాహరణకు మీరు క్యాబ్ బుక్ చేసినప్పుడు ఆ యాప్ గూగుల్ మ్యాప్స్ యాప్‌కు తనంత తాను అనుసంధానించుకుని ఏ దిశగా రావాలో, ఎటు వెళ్లాలో సూచిస్తుంది. ఇదంతా క్షణాల్లో జరిగిపోతుంది. మీరు యూపీఐ ద్వారా చెల్లించినప్పుడు ఆ క్షణంలోనే మీ బ్యాంకు ఆ లావాదేవీని నిర్ధారిస్తుంది. కొన్ని సాఫ్ట్‌వేర్ లింక్స్– వాటిని మనం డిజిటల్ బ్రిడ్జిలందాం– తమలో తాము 'సంభాషించుకోవటం' వల్ల ఇదంతా సాధ్యమవుతోంది. ఒక రెస్టారెంట్‌లోకి మీరు వెళ్లారనుకుందాం. అక్కడ ఇష్టమైనది ఆర్డర్ ఇస్తారు. వెయిటర్ మీ ఎంపికలను రాసుకుని కిచెన్‌లో ఇస్తాడు. వారు వెంటనే ఆర్డర్ చేసినవన్నీ అతనికివ్వగా, మీరు కూర్చున్నచోటకు ఆ ఆహారపదార్థాలు వస్తాయి. మీకు ఆ హోటల్‌లో కిచెన్ ఎక్కడుందో తెలియదు. చేసేవారెవరో కూడా తెలియదు. అయినా కోరుకున్నవి మీ చెంత వుంటాయి. యాప్‌ల అంతర్గత సంభాషణ అలాగే ఉంటుంది. ఇలాగే మీ–సేవ ద్వారా వచ్చే ధ్రువీకరణ పత్రాలు, ఆన్‌లైన్ క్లాస్‌రూంలు, సాగుకు తోడ్పడే ఏఐ ఉపకరణాలు... ఇవన్నీ మీ ఫోన్ లేదా మీ ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్‌లలో తెరవెనుక పరస్పర సంక్లిష్ట సంభాషణల ద్వారా కోరినవి మీ ముందు పరుస్తాయి.

డిజిటల్ అక్షరాస్యతలో ఐచ్ఛికం (ఆప్షనల్) అనే మాటే లేదు. అది తప్పనిసరి. వచ్చే అయిదు, పదేళ్లలో ఏ రంగంలో– అది సాగు కావొచ్చు, చదువు కావొచ్చు– ఉపాధి కావాలన్నా డిజిటల్ నైపుణ్యాలు ఉండి తీరాలి. రైతులు ఏఐ ఆధారిత ముందస్తు పంట సమాచారాన్ని, మార్కెట్ల గురించిన ఇన్ఫర్మేషన్‌ను పొందక తప్పదు. విద్యార్థులు హైబ్రిడ్ తరగతుల్లో నేర్చుకోవటం తప్పనిసరవుతుంది. పరిశ్రమలన్నీ ఆటోమేషన్‌పై ఆధారపడతాయి. ఆఖరికి సీనియర్ సిటిజన్‌లు కూడా డిజిటల్ హెల్త్ రికార్డులు ఉపయోగించవలసివస్తుంది. వ్యక్తులుగా మెరుగైన ఉపాధి అవకాశాలు పొందటానికి కావొచ్చు, ఇతరులతో సమానంగా ఆర్థిక లబ్ధి పొందటం, జ్ఞానాన్ని సాధించటం వగైరాలకు కావొచ్చు– అందుకు డిజిటల్ అక్షరాస్యత తప్పనిసరి. సమూహాలకైతే మెరుగైన పారదర్శకత, సమర్థవంతమైన పాలన, ఆర్థిక ప్రగతి సాధనకు ఇది అవసరం.

డిజిటల్ సాధికారత వరకూ చూస్తే దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. టీ–ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్‌ను ప్రభుత్వం అనుసంధానం చేయగలిగింది. మారుమూల ప్రాంతాల్లోనివారికి సైతం చదువు, ఈ–గవర్నెన్స్, ఆరోగ్య పరిరక్షణ వగైరాలను అందుబాటులోకి తెచ్చింది. మీ–సేవ వేదికగా 150 రకాల సేవలను అందిస్తోంది. ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు, బిల్లుల చెల్లింపులు, దరఖాస్తులు... ఒకటేమిటి దాదాపు సమస్తం ఇప్పుడు ప్రజల మునివేళ్లపై ఉన్నాయి. డిజిటల్ ప్రపంచాన్ని ఏలుతున్న దిగ్గజ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం భాగస్వామ్యం తీసుకుంది. మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం ద్వారా ఏఐలో, ఇతరేతర సాఫ్ట్‌వేర్ నైపుణ్యాల్లో యువతను తీర్చిదిద్ది భవిష్యత్తరాల ఉద్యోగ యోగ్యత సామర్థ్యాన్ని పెంచటమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. సాఫ్ట్‌వేర్ నైపుణ్యాల్లో విద్యార్థులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు పొందే అర్హతలను అందించడంలో టాస్క్ (తెలంగాణ అకాడెమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ముందంజలో వుంది.

సమ్మిళిత వృద్ధికి డిజిటల్ అక్షరాస్యత ఒక పునాదిగా ఎంత అవసరమో దేశానికి తెలంగాణ మార్గనిర్దేశం చేస్తోంది. టీ–ఫైబర్, టీ వర్క్స్, టీ హబ్, మీసేవ, టాస్క్, ప్రపంచ భాగస్వామ్యాల ద్వారా భవిష్యత్తును అందిపుచ్చుకోవటం కాదు... దాన్ని నిర్మించటం ఎలాగో దేశానికి తెలంగాణ చేసి చూపుతోంది. 20వ శతాబ్దంలో సంప్రదాయ అక్షరాస్యత మాదిరే 21వ శతాబ్దంలో డిజిటల్ అక్షరాస్యత మనుగడకు సంబంధించిన నైపుణ్యంగా మారింది. దాన్ని ఎంత వేగంగా స్వీకరించగలిగితే అంత త్వరగా దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

○ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

మతమేదైనా జాతీయతే ప్రధానం!

1963 భారత గణతంత్ర దినోత్సవాల్లో కవాతు వందనంలో పాల్గొనటానికి అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేకంగా ఆహ్వానించిన ఒక స్వచ్ఛంద సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. చరిత్ర తెలియని ఇప్పటి తరానికి ఇది వింతగా అనిపించవచ్చు. కానీ, నెహ్రూ అలా చేయటానికి గల ఒక బలమైన కారణం– 1962 నాటి చైనా దురాక్రమణ వల్ల జరిగిన యుద్ధంలో గాయపడిన సైనికులకు తక్షణ వైద్యం అందేలా చేయటంలోను, శ్రీనగర్ విమానాశ్రయంలో పేరుకుపోయిన మంచు పెళ్లల్ని తొలగించటంలోను ఆరెస్సెస్ స్వయంసేవకులు చేసిన అసాధారణ సేవ. ఆరు దశాబ్దాల తరువాత 2020–2022 కాలంలో కొవిడ్ కారణంగా ఉత్పన్నమైన భయంకర పరిస్థితుల్లో అదే సేవా స్ఫూర్తితో పనిచేసిన స్వచ్ఛంద సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. దేశంలో ఏ ప్రమాదాలూ, ఉపద్రవాలూ ఎక్కడ సంభవించినా ఎవరూ ఆహ్వానించకుండా తనంత తానుగా రంగంలోకి దిగి సేవలందించటం సంఘ్ ప్రవృత్తి. ఇంతటి సేవా స్ఫూర్తి కలిగిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భవించి ఈ 2025 విజయదశమి నాటికి వందేళ్లు.



1925లో విజయదశమి శుభదినాన కేవలం ఐదుగురు యువకులతో నాగపూర్‌లో కేశవరావు బలిరాం హెడ్గేవార్ 'రాష్ట్రీయ స్వయం సేవక సంఘా'న్ని స్థాపించారు. కేశవరావు పూర్వీకులు తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాదు జిల్లా బోధన్ దగ్గర కందుకూరు గ్రామానికి చెందినవారు. అక్కడి నుంచి వారు మహారాష్ట్రలోని నాగపూర్ ప్రాంతానికి వలస వెళ్లారు. కేశవరావు పేద కుటుంబంలో జన్మించి, కష్టాలు అనుభవిస్తూనే, కలకత్తాలో డాక్టర్ విద్య పూర్తి చేసారు. ఆయన బాల్యం నుంచి దేశభక్తి, జాతీయవాదం, భారతీయ సంస్కృతి, ఇతిహాసాల పట్ల మక్కువ చూపేవారు. ఆంగ్లేయులను మన దేశం నుంచి పారద్రోలాలనే భావనతో రగిలిపోయేవారు. అయితే, స్వాతంత్ర్యం కోసం పోరాటంలో హింసకు తావుండకూడదని విశ్వసించేవారు. కలకత్తా నుంచి నాగపూర్‌కి తిరిగివచ్చి, స్థానిక యువకులను సమావేశపరిచి వారిని స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించారు. వారికి అవసరమైన వ్యాయామశాలలు, అఖాడాలు నిర్వహించారు. కాంగ్రెస్‌లో చేరి బాలగంగాధర తిలక్, మహాత్మ గాంధీ, సుభాష్ చంద్రబోస్, డా. ముంజె వంటి నాయకులతో కలిసి పనిచేసి, మహారాష్ట్రలో యువనాయకుడిగా ఎదిగారు. బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని కారాగార శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటున్న సమయంలోనే ఆయన మనసులో ఒక అంతర్మథనం సాగుతూ ఉండేది. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇంతకుముందు లేదా? ఆ స్వాతంత్ర్యాన్ని ఎందుకు కోల్పోయాం? ఎందుకు మన దేశం 700 సంవత్సరాలపాటు బానిసత్వంలో మగ్గింది? ఈ అంతర్మథనం, తర్వాత సుదీర్ఘమైన అధ్యయనం వల్ల ఆయనకు ఒక విషయం స్పష్టమైంది. ఒకప్పుడు ప్రకృతిని ఆరాధించే మన భారతీయతలో ఏకత్వం ఉంది. వర్గం, వర్ణం, భాష, ప్రాంతం, సంప్రదాయం పేరుతో అనైక్యంగా ఉండడం వల్లనే అనేక విదేశీ దండయాత్రల్లో మనం ఓడిపోయాం. తిరిగి దేశానికి పూర్వ వైభవ స్థితిని తేవాలన్న దృఢమైన, అచంచలమైన సంకల్పం ఆయనలో కలిగింది. దేశం కోసం, ధర్మం కోసం, సమాజం కోసం సర్వస్వాన్ని అర్పించి సేవ చేసే యువకుల బృందమే భారతదేశానికి పూర్వ వైభవ స్థితిని తీసుకురాగలదని ఆయన విశ్వసించారు. మన ప్రాచీన ఋషులు, మునులు, సంతులు, తత్త్వవేత్తలు బోధించిన విషయాలను దృష్టిలో పెట్టుకుని, ఆ హిందుత్వం, భారతీయత మూర్తీభవించిన సంఘటిత సమాజాన్ని నిర్మించడానికై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను స్థాపించారు.

శిల్పి ఒక రాయిని చెక్కి శిల్పం చేసినట్టుగా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రతి భారతీయునిలో అంతర్లీనంగా ఉన్న ఉన్న శక్తిని జాగృతం చేసి, ఆ వ్యక్తిని క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయతతో నింపటానికి తన శాఖల ద్వారా ప్రయత్నిస్తున్నది. అలాంటి శాఖల విస్తరణే సంఘ్ కార్యం. సంఘ్ ఏనాడూ మతంతో ముడిపడిలేదు. మతమేదైనా జాతీయతే ప్రధానంగా భావించింది. "ఇది నా మాతృభూమి. నా మాతృభూమి కోసం సర్వస్వాన్ని త్యాగం చేస్తాను. అవసరమైతే ప్రాణ త్యాగమైనా చేస్తాను" అన్న సంకల్పం ఉంటే చాలు. అందుకే సంఘ్ ప్రార్థన 'నమస్తే సదా వత్సలే మాతృభూమి' అంటూ మొదలవుతుంది.

శిల్పి ఒక రాయిని చెక్కి శిల్పం చేసినట్టుగా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రతి భారతీయునిలో అంతర్లీనంగా ఉన్న శక్తిని జాగృతం చేసి, ఆ వ్యక్తిని క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయతతో నింపటానికి తన శాఖల ద్వారా ప్రయత్నిస్తున్నది. అలాంటి శాఖల విస్తరణే సంఘ్ కార్యం. సంఘ్ ఏనాడూ మతం పేరుతో ముడిపడిలేదు. మతమేదైనా జాతీయతే ప్రధానంగా భావించింది.

సంఘ్ స్వయం సేవకులను నిర్మాణం చేస్తుంది. స్వయం సేవకులు తమ బాధ్యతగా సమాజంలో ఉన్నటువంటి అన్ని క్షేత్రాలలో సంఘ్ భావజాలాన్ని, సంఘ్ సిద్ధాంతాన్ని అమలుపరిచేలా బాధ్యతలు తీసుకుంటారు. అలా దేశం గర్వించదగిన నాయకుల్ని తయారు చేసింది సంఘ్. అటల్ బిహారీ వాజపేయి, ఎల్.కె. అద్వానీ, భైరన్‌సింగ్ షెకావత్, నానాజీ దేశముఖ్, మురళీమనోహర్ జోషి, బంగారు లక్ష్మణ్, రామనాథ్ కోవింద్, వెంకయ్యనాయుడు, నరేంద్ర మోదీ, రాజనాథ్ సింగ్, నితిన్ గడ్కరీ లాంటి వేలాదిమందిని రాజకీయ క్షేత్రంలోకి పంపింది. వీరేగాక సమాజానికి కనపడని అనేక మందిని, కార్మిక, ధార్మిక, విద్యార్థి, కిసాన్, ఆదివాసీ, సేవా, సామాజిక సమరసతా రంగాల్లోకి పంపింది. ఇంకా వివిధ వృత్తి రంగాలలో కృషి చేసేందుకు ప్రముఖ నాయకులను ఆయా రంగాలకు సంఘ్ కేటాయించింది.

1940లో కేశవరావు బలిరాం హెడ్గేవార్ పరమపదించిన తరువాత మాధవ్ సదాశివ గోల్వాల్కర్ (గురూజీ) సర్ సంఘ్ ద్వితీయ చాలక్‌గా 1940 నుంచి 1973 వరకు దాదాపు 33 సంవత్సరాల పాటు నిరంతర తపోదీక్షతో దేశమంతటా పర్యటిస్తూ పనిచేసారు. అప్పటివరకు కేవలం మహారాష్ట్ర ప్రాంతానికే పరిమితమైన సంఘాన్ని అఖిల భారతీయ స్థాయిలో విస్తృతపరిచారు. దేశవ్యాప్తంగా సంఘ్ శాఖలను, ప్రచారక్ (సన్యాసిగా) వ్యవస్థను ఉద్యమ స్థాయిలో విస్తరించారు. సమాజంలోని అన్ని రంగాలలో సంఘ్ సంస్థలను నిర్మాణం చేసి వాటికీ ప్రచారకులను పంపించారు. గురూజీ 1973లో పరమపదించారు.

గురూజీ తదనంతరం బాల సాహెబ్ దేవరస్‌గా ప్రసిద్ధి చెందిన మధుకర్ దత్తాత్రేయ దేవరస్ 1973 నుంచి సర్ సంఘ్ తృతీయ చాలక్‌గా బాధ్యతలు చేపట్టారు. హిందూ సమాజంలో లోతుగా పేరుకుపోయిన అంటరానితనం, అస్పృశ్యత, దేవాలయ ప్రవేశ నిరాకరణ, కులాంతర వివాహాల వ్యతిరేకత లాంటి సామాజిక రుగ్మతల నివారణకై కృషి చేయాలని, దళిత గిరిజన సమాజానికి సేవ చేసి, వారిని సంఘటితం చేయాలనీ ఆయన పిలుపు ఇచ్చారు. ఈ పిలుపు మేరకు స్వయం సేవకులందరు వేలాదిగా బస్తీల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. సంఘ్ 'సేవా భారతి' పేరుతో విద్య, వైద్య, నైపుణ్య శిక్షణ తదితర కార్యక్రమాలు ప్రారంభించింది. ఈనాడు 'సేవ భారతి' దేశవ్యాప్తంగా 373 జిల్లాల్లో 35,560 శాఖలతో సేవలు అందిస్తున్నాయి. ఇప్పుడు 'సామాజిక సమరసత' జాతీయ స్థాయిలో పెద్ద ఉద్యమంగా సాగుతోంది.

1975 అత్యవసర పరిస్థితి సమయంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై నిషేధం విధించింది. ఆమె నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యానికి పట్టిన గ్రహణాన్ని ఎదుర్కోవడానికి సంఘ్ అన్ని రాజకీయ పక్షాలను, నాయకులను ఏకతాటి మీదకు తీసుకువచ్చేందుకు కృషి చేసింది. లోక్ సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ సోషలిస్టు నాయకులైన జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీదేశాయ్ లాంటి మహోన్నత నాయకులతో కలిసి సంఘ్ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం చేపట్టింది. భారతదేశ చరిత్రలో రెండవ స్వాతంత్ర్య సంగ్రామం అనదగినంత ప్రాముఖ్యత కలిగిన ఈ ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో అనేకమంది స్వయం సేవకులు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారు.

1947లో దేశ విభజన సమయంలో లక్షలాది మంది కాందిశీకుల శిబిరాలను నిర్వహించి, వారికి రక్షణ కల్పించి సంఘ్ అండగా నిలబడింది. 1977లో ఆంధ్రప్రదేశ్‌లోని దివిసీమలో వచ్చిన పెను ఉప్పెనకు ఊళ్ళకు ఊళ్ళే తుడిచి పెట్టుకుపోయిన సందర్భంలో సంఘ్ తన స్వయం సేవకులను వెంటనే రంగంలోకి దించింది. ఆయా సహాయ కార్యక్రమాలకు ఆరెస్సెస్ సైక్లోన్ రిలీఫ్ కమిటీలు ఏర్పాటు చేసి అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఉప్పెన ఉధృతికి శవాల దిబ్బలుగా మారిన ఊళ్లల్లో ప్రత్యేకంగా 'శవ సేన' పేరుతో ఒక బృందాన్ని తయారు చేసి మరణించిన వారి అంతిమ సంస్కారాలు నిర్వహించే బాధ్యతను సంఘ్ తీసుకుంది. తుపానుతో తీవ్రంగా నష్టపోయిన మూలపాలెం గ్రామాన్ని విరాళాల సహాయంతో పునర్నిర్మించి, 'దీనదయాళ్‌పురం'గా నామకరణం చేసి, అక్కడున్న అందరికీ పక్కా ఇళ్లు నిర్మించింది. వాటిని అప్పటి కేంద్ర విదేశాంగమంత్రి అటల్ బిహారీ వాజపేయి, ముఖ్యమంత్రి చెన్నారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగానే ప్రముఖ గాంధేయవాది ప్రభాకర్ జీ "ఆరెస్సెస్ అంటే రెడీ ఫర్ సెల్ఫ్ లెస్ సర్వీస్ (Ready for Selfless Service)" అని కొనియాడారు.

సంఘ్ ఏనాడూ హింసను బోధించదు. హింసను ప్రోత్సహించదు. కేరళ, ఈశాన్య భారత రాష్ట్రాలలో దేశ వ్యతిరేకశక్తులు సంఘ్ కార్యకర్తల మీద దాడులు చేశాయి. కిరాతకంగా ప్రాణాలు తీశాయి. కానీ సంఘ్ ఏనాడూ ఇలాంటి చర్యలకు పాల్పడలేదు. కుల, వర్ణ, వర్గ వివక్షలకు అతీతంగా సంఘ్ నిర్మాణం జరిగింది. అందుకే ఈ శక్తి అచంచలమైంది. అలా నిర్మితమైంది కాబట్టే ఆరెస్సెస్ ఇద్దరు సమర్థులైన, నీతిమంతులైన ప్రధానమంత్రుల్ని ఈ దేశానికి అందించగలిగింది. వందేళ్ళ క్రితం అయిదుగురితో ప్రారంభమైన ఆరెస్సెస్ ఇవ్వాళ దేశంలో కోట్లాది స్వయం సేవకులతో భరతమాత సేవకి తనని తాను పునరంకితం చేసుకుంటోంది.



• బండారు దత్తాత్రేయ
పూర్వ గవర్నర్, హర్యానా

అధికార వికేంద్రీకరణా.. రాజకీయ ఆధిపత్యమా?

1990లలో రాజీవ్‌గాంధీ దూరదృష్టితో ఒక మంచి ఆలోచనను ముందుకు తెచ్చారు. "అధికారం ప్రజల వద్దకు రావాలి" అని ఆయన తరచూ చెప్పేవారు. భారతదేశం అసలు గ్రామాల్లోనే ఉందని, ఆ గ్రామాలు తమ అభివృద్ధిని తామే నిర్ణయించుకోలేకపోతే ప్రజాస్వామ్యం పూర్తిగా పని చేయదని ఆయన నమ్మకం. ఈ ఆలోచనలు ఆయన పాలనా కాలంలోనే మొదలైనాయి. 1980ల చివర్లో ఆయన పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రయత్నాలు చేశారు. ఆ సమయంలో దేశంలోని గ్రామీణ ప్రాంతాలు చాలా వెనుకబడి ఉన్నాయి. ఢిల్లీ లేదా రాష్ట్ర రాజధానుల నుంచి అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజలకు తమ సమస్యలు తామే పరిష్కరించుకునే అవకాశం లేదు.


రాజీవ్ ఆలోచనను ఆచరణలో పెట్టడానికి 1992లో రాజ్యాంగంలో 73, 74 సవరణలు తీసుకువచ్చారు. ఇవి గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలకు బలాన్ని ఇచ్చాయి. ఈ సవరణలతో ఎన్నికలు నియమానుసారం జరగాలి, పథకాలను ప్రజలు రూపొందించుకోవాలి, నిధులు వారే వాడుకోవాలి. ఉదాహరణకు– ఒక గ్రామంలో నీటి సమస్య ఉంటే, గ్రామసభలో చర్చించి ట్యాంకు నిర్మాణం చేసుకోవచ్చు. పట్టణాల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించుకోవచ్చు.

భారతదేశంలో అధికారం ఎప్పుడూ కేంద్రీకృతమై ఉండేది. బ్రిటిష్ కాలం నుంచి వచ్చిన వ్యవస్థలు అలానే కొనసాగాయి. రాజీవ్‌గాంధీ ఈ వ్యవస్థను మార్చాలని కోరారు. ఆయన హత్య తర్వాత ఈ సవరణలు అమలయ్యాయి. కానీ ఇక్కడే సమస్య మొదలైంది. ఒకవైపు ప్రజలకు అధికారం ఇస్తున్నారు, మరోవైపు రాజకీయ నాయకులు తిరిగి ఆ అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు.

పంచాయతీలకు రాజ్యాంగ హోదా వచ్చిన ఏడాది తర్వాత, 1993లో కేంద్ర ప్రభుత్వం ఎంపీ నిధుల (ఎంపీ లాడ్స్) పథకాన్ని మొదలుపెట్టింది. దీని ప్రకారం ప్రతి ఎంపీకి తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంవత్సరానికి ఐదు కోట్ల రూపాయలు కేటాయిస్తారు. రాష్ట్రాలు కూడా ఎమ్మెల్యే నిధుల పథకాన్ని ప్రారంభించాయి. పైకి చూస్తే ఇది మంచి పథకమే అనిపిస్తుంది. అభివృద్ధి వేగంగా జరుగుతుంది అని అనుకున్నారు. కానీ లోతుగా చూస్తే లోపం కనిపిస్తుంది. పంచాయతీలు, మున్సిపాలిటీలకు అభివృద్ధి పనులు చేయడానికి రాజ్యాంగం హక్కులను ఇచ్చింది. ఎంపీలు, ఎమ్మెల్యేల అసలు పని చట్టాలు చేయడం కదా? ఎందుకు అభివృద్ధి పనుల్లో పాలుపంచుకోవాలి? ఇది రాజకీయ నాయకులను కాంట్రాక్టర్లలా మారుస్తున్నది.

ఒక ఉదాహరణ తీసుకుందాం. గ్రామసభలో చర్చించి ట్యాంకు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. కానీ ఎమ్మెల్యే వచ్చి, తన నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేస్తానని చెప్పారు. ఎందుకంటే ఆ హాల్‌పై తన పేరు రాసుకోవచ్చు, ఓట్లు వస్తాయి. ఇలా ప్రజల అవసరాలు పక్కకు వెళ్ళిపోతాయి. కొత్త రోడ్డు లేదా పాఠశాల భవనం ఎలా వచ్చింది అని ఏదైనా గ్రామానికి వెళ్లి అడిగితే చాలామంది చెప్పేది 'మా ఎమ్మెల్యే చేయించారు', 'మా ఎంపీ డబ్బు ఇచ్చారు.' కానీ 'గ్రామసభ నిర్ణయించింది' అని ఎవరూ చెప్పరు. ఇది ఈ పథకాల వల్ల వచ్చిన మార్పు. రాజీవ్‌గాంధీ కోరిన 'ప్రజలే యజమానులు' అనే ఆలోచన పక్కదారి పట్టి, రాజకీయ పరిరక్షణ విధానంగా మారింది.

ఎంపీ, ఎమ్మెల్యే నిధుల వల్ల రాజకీయ నాయకులు ఆ నిధులపై పట్టు సాధించారు. ఇది భారత ప్రజాస్వామ్యానికి పెద్ద సవాలు. చాలా రాష్ట్రాల్లో పంచాయతీలకు నిధులు సరిగా రావడం లేదు, ఎమ్మెల్యేలు తమ నిధులను ఓట్లు రాబట్టడానికి ఒక ఆయుధం లాగా ఉపయోగిస్తున్నారు. దీంతో 30 ఏళ్ల క్రితం రాజీవ్‌గాంధీ కన్న కల దెబ్బతిన్నది. రాజ్యాంగాన్ని, రాజీవ్ వారసత్వాన్ని గౌరవిస్తే, స్థానిక సంస్థలపై విశ్వాసం పెంచాలి.



ఈ పథకాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ అసలు పని మానేసి, ప్రాజెక్ట్ మేనేజర్లుగా అవతారం ఎత్తుతున్నారు. ఇది అధికార వికేంద్రీకరణకు వ్యతిరేకం. పైగా అవసరం లేని పనులు చేస్తున్నారు. తద్వారా అవినీతి పెరుగుతున్నది. ఉదాహరణకు, 2018 కాగ్ రిపోర్టులో ఎంపీ నిధులలో 20శాతం నిధులు తప్పుగా వాడినట్టు తేలింది. పంచాయతీలను గ్రామసభలో ప్రశ్నించవచ్చు, కానీ ఎంపీల ఖర్చులపై ఎవరూ అడగరు. దీంతో జవాబుదారీతనం లేకుండా పోతున్నది. ఆరోగ్యం, విద్య వంటి దీర్ఘకాల పనులకు కాకుండా, త్వరగా కనిపించే రోడ్లు, గేట్లు, విగ్రహాలపై డబ్బు ఖర్చు చేస్తున్నారు. ఆ కారణంగా ప్రజల ప్రధాన అవసరాలు తీరవు.

గ్రామంలో చివరి వ్యక్తికి కూడా అధికారం ఇవ్వాలని రాజీవ్‌గాంధీ కోరారు. కానీ ఇప్పుడు ఆ వ్యక్తి ఎమ్మెల్యే దయ మీద ఆధారపడుతున్నాడు. 73, 74 సవరణల ఆత్మ దెబ్బతిన్నది. స్థానిక సంస్థలు బలహీనంగానే కొనసాగుతున్నాయి. రాజకీయ నాయకులు నిధులపై పట్టు సాధించారు. ఇది భారత ప్రజాస్వామ్యానికి పెద్ద సవాలు. చాలా రాష్ట్రాల్లో పంచాయతీలకు నిధులు సరిగా రావడం లేదు, ఎమ్మెల్యేలు తమ నిధులను ఓట్లు రాబట్టడానికి ఒక ఆయుధం లాగా ఉపయోగిస్తున్నారు.

"ఈ నిధులు ప్రజల తక్షణ అవసరాలు తీర్చడానికి మంచివే కదా" అని మద్దతుదారులు అడగవచ్చు. అదే పని స్థానిక సంస్థలు చేయగలవు కదా– అని వీటిని వ్యతిరేకించేవారు ప్రశ్నిస్తున్నారు. సెకండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ కమిషన్ (2005–2009) ఈ పథకాలు రద్దు చేయాలని సూచించింది. సుప్రీంకోర్టు 2010లో ఇవి రాజ్యాంగబద్ధమేనని చెప్పినా, అధికార విభజనకు విరుద్ధమని అంగీకరించింది. ప్రశ్న అభివృద్ధి కావాలా? వద్దా అని కాదు, ఎవరు నిర్ణయిస్తారు అన్నదే.

ముందుకు వెళ్లే మార్గాలు ఉన్నాయి. ఈ పథకాలను రద్దు చేసి, నిధులను నేరుగా పంచాయతీలకు ఇవ్వాలి. నాయకులు సలహా ఇవ్వొచ్చు, కానీ తుది నిర్ణయం స్థానికులదే కావాలి. గ్రామసభలు, వార్డు కమిటీలకు బలం పెరగాలి. ప్రతి ప్రాజెక్టును ప్రజా సమావేశంలో చర్చించాలి. సాంకేతికతతో పారదర్శకత పెంచాలి. ప్రతి రూపాయి ఖర్చు ఆన్‌లైన్‌లో కనిపించాలి. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ వార్డు సచివాలయాలు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నాయి. స్థానిక నాయకులకు తగిన శిక్షణ ఇవ్వాలి. ప్లాన్లు వేయడానికి నిపుణులు, సిబ్బంది కావాలి. ఎమ్మెల్యేలు తమ అసలైన బాధ్యతలను తిరిగి చేపట్టాలి.

30 ఏళ్ల క్రితం రాజీవ్‌గాంధీ కన్న కల ఎంపీలు, ఎమ్మెల్యేల నిధుల వల్ల దెబ్బతిన్నది. రాజ్యాంగాన్ని, రాజీవ్ వారసత్వాన్ని గౌరవిస్తే, స్థానిక సంస్థలపై విశ్వాసం పెంచాలి. ప్రజాస్వామ్యం అంటే నాయకులు కానుకలు ఇవ్వడం కాదు, ప్రజలు తమ భవిష్యత్తును నిర్ణయించుకోవడం. ఆ మార్గంలో నడిస్తేనే మన ప్రజాస్వామ్యం బలపడుతుంది.


▪ పి. వేణుగోపాల్‌రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు

ఫార్మసిస్టులపై నిర్లక్ష్యమేల!?


- ఉమ్మడి జిల్లాలో 70కి పైగా ఫార్మసిస్టు పోస్టులు ఖాళీ
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల కొరత
- ఉన్నవారిపైనే అధిక పనిభారం
- సక్రమంగా అమలుకాని చట్టం
- నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

7

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
గురువారం 25 సెప్టెంబరు 2025



సమ్మక్కసాగర్ బ్యారేజీ(ఫైల్)



సాగునీటి చిక్కులు 'సమ్మక్క' తీర్చేనా!?

- సమ్మక్క సాగర్‌కు ఎన్‌వోసీకి చత్తీస్‌గఢ్ సానుకూలతపై హర్షం
- కాళేశ్వరం, సమ్మక్క సాగర్ కింద ఎస్సారెస్పీ-2 రెండు లక్షల ఎకరాల ఆయకట్టు
- రెండు ప్రాజెక్టుల కింద ఒకే ఆయకట్టును చూపటంపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు
- ఎన్‌వోసీ వచ్చినా.. కొత్తగా 2లక్షల ఎకరాల ఆయకట్టు చూపిస్తేనే అనుమతులు
- కాళేశ్వరం ఎత్తిపోతలు నిలిచిపోవటంతో ఎస్సారెస్పీ-2కింద సాగునీటికి కొరత
- సీతారామ ప్రాజెక్టుకొత్త డిజైన్‌లో మహబూబాబాద్, డోర్నకల్‌కు దక్కని చోటు
- పాకాల నుంచి బయ్యారం వరకు గోదావరి జలాలను మళ్లించాలంటున్న రైతులు
- సమ్మక్క నీళ్లు ఎస్సారెస్పీ-2 స్థిరీకరణ, పాకాల-బయ్యారం కొత్త ఆయకట్టుకా..?

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సమ్మక్క సాగర్ బ్యారేజీకి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) ఇవ్వడానికి చత్తీస్‌గడ్ సానుకూలత వ్యక్తం చేయటం రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుండగా.. కొత్త ఆయకట్టుపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కింద చూపించిన ఎస్సారెస్పీ-2 ఆయకట్టును సమ్మక్క సాగర్ కింద చూపించటం ఏమిటని సీడబ్ల్యూసీ ప్రశ్నిస్తోంది. సమ్మక్కసాగర్‌కు కొత్త ఆయకట్టు చూపించాలని సీడబ్ల్యూసీ కోరుతోంది. దీంతో ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు అలైన్‌మెంట్ మార్పులతో మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు నియోజకవర్గాలకు సాగునీరు అందే పరిస్థితి లేనందున, పాకాల వరకు వెళుతున్న గోదావరి జలాలను బయ్యారం వరకు మళ్లించి కొత్తగా సమ్మక్కసాగర్‌కు ఆయకట్టును సృష్టించవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సమ్మక్క నీళ్లను పాకాల నుంచి బయ్యారం మళ్లిస్తే.. కాళేశ్వరం ఎత్తిపోతలు లేకపోవటంతో ఎస్సారెస్పీ-2 కింద రైతులకు సాగునీటి పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తం అవుతోంది. దీంతో సమ్మక్కసాగర్ నీటితో ఎస్సారెస్పీ-2 ఆయకట్టును స్థిరీకరించాలా? లేక పాకాల- బయ్యారం లింకులో కొత్త ఆయకట్టు సృష్టించాలానే సందిగ్ధం అధికారయంత్రాంగంలో నెలకొంది.



ఎస్సారెస్పీ-2పై అభ్యంతరాలు

దేవాదుల ఎత్తిపోతలను పెంచేందుకు ప్రభుత్వం 2018లో తుపాకులగూడెం వద్ద గోదావరిపై సమ్మక్కసాగర్‌ను నిర్మించింది. ఈ బ్యారేజీతో 6.94 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం

(మిగతా 7లో..)

సీతారామ కష్టాలను సమ్మక్క తీర్చేనా..?

భద్రాద్రి కొత్తగూడెంలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టును ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో 6.74 లక్షల ఎకరాలకు గోదావరి నీరు అందించేందుకు ప్రభుత్వం చేపట్టింది. అయితే కిన్నెరసాని అభయారణ్యం కారణంగా అనుమతులు రావడంలో ఆలస్యం జరుగుతోంది. దీంతో ప్రభుత్వం ఇటీవల సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసింది. ఈ మార్పులతో మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాలోని బీడు భూములకు గోదావరి నుంచి నీరందే పరిస్థితి లేదు. సీతారామ ప్రాజెక్టుకు 2016లో శంకుస్థాపన చేసినప్పుడు టేకులపల్లి మండలంలోని రోళ్లపాడు వద్ద 16 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ప్రతిపాదించారు. ఈ రిజర్వాయర్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారానే ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు నీరందించే వీలుంది. ఎలాంటి చిక్కులు లేకుండా సమ్మక్క బ్యారేజీ నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం నుంచి రోళ్లపాడుకు నీరందించి, ఆ లోటును భర్తీ చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా సమాచారం. ఇప్పటికే సమ్మక్క సాగర్ నీరు దేవాదుల ద్వారా రామప్ప వరకు చేరుతోంది. రామప్ప నుంచి వరంగల్ జిల్లా పాకాల సరస్సులోకి మళ్లిస్తున్నారు. పాకాల నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్ద చెరువులోకి మళ్లించి, అక్కడి నుంచి ఇల్లందులోని రోళ్లపాడు రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను మళ్లిస్తే.. సీతారామ ప్రాజెక్టు లక్ష్యం నెరవేరే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే అంశంపై ఇటీవల మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కొత్తగా లక్ష ఎకరాలకు వరకు సాగునీరు అందించటంతో పాటు మరో లక్ష ఎకరాల ఆయకట్టు స్థిరీకరించవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

గాయత్రి అలంకారంలో భద్రకాళి

సింహ, గజ వాహనంపై ఊరేగిన ఉత్సవమూర్తి



గాయత్రి అలంకరణలో భద్రకాళి దేవి

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన భద్రకాళి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం ఉదయం 4 గంటలకు నిత్య పూజలతో చతుష్టానార్చన నిర్వహించిన అనంతరం అమ్మవారిని గాయత్రి మాతగా అలంకరించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు నేతృత్వంలో అమ్మవారికి చతుష్టానార్చన, చంద్రగంట, దుర్గార్చన నిర్వహించారు. ఉదయం 11గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని సింహవాహనంపై ఊరేగించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించారు. సాయంత్రం గజ వాహనంపై ఊరేగింపుతో పాటు మైసాసుర మర్ధని దుర్గార్చన నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, భద్రకాళి గుట్టపై ఉన్న శివపార్వతుల విగ్రహం చుట్టూ చెట్లు చేమలు ఉండడం వల్ల విగ్రహం భక్తులకు కనిపించడం లేదు. ఈ విషయంలో ధర్మకర్తల వినతిపై అధికారులు చెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గాదె శ్రవన్‌కుమార్‌రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మోత్కూరి మయూరి రామేశ్వర్‌రావు, తొనుపునూరి వీరన్న, పాలడుగుల ఆంజనేయులు, ఆలయ సిబ్బంది కూచన హరినాథ్ పాల్గొన్నారు.

సందడిగా బతుకమ్మ

- ఉత్సాహంగా పాల్గొన్న మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి
- జీడబ్ల్యూఎంసీ ఆవరణలో కోలాహలం



బల్దియా కార్యాలయంలో బతుకమ్మలతో మంత్రి, మేయర్, కమిషనర్



గిల్లగిరుక ఆడుతున్న మంత్రి, మేయర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో పలువురు మహిళా ప్రముఖులు ఆడిపాడారు. గౌరమ్మను భక్తిప్రపత్తులతో కొలిచారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను చేబూని సందడి చేశారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో పాటు నగర కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతిబింబం అని, బతుకమ్మ పండగ పాటలు, నృత్యాలతో మహిళలు పరవశిస్తారని అన్నారు. మహిళల ఆత్మగౌరవం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో బతుకమ్మ సంబరాలు వేడుకగా జరుపుకుంటారని అన్నారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. రంగురంగుల పూలతో బతుకమ్మను చేసుకుని గౌరవించే సంస్కృతి మన రాష్ట్రంలోనే ఉంటుందని గుర్తు చేశారు. అనంతరం ఆటా పాటలతో బతుకమ్మల వద్ద సంప్రదాయ అడుగులు వేశారు. ఈ సంబరాల్లో మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి గిల్లగిరుక ఆడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు, బల్దియా మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాం..

- పాల సహకార సంఘాలకు రూ.450 కోట్ల నిధులు
- జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఎస్‌జీఎం శ్రీధర్
- ముల్కనూర్ మహిళా డెయిరీలో రాష్ట్రస్థాయి సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌జీఎం శ్రీధర్

భీమదేవరపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ మహిళా డెయిరీలో ఎన్‌డీడీబీ 60 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించారు. రాష్ట్రస్థాయి సదస్సును ముల్కనూర్ మహిళా డెయిరీలో జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. 1966లో భారతదేశం ఇతర దేశాల నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకునేదన్నారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జాతీయ పాడి పరిశ్రమ సంస్థను ఏర్పాటు చేసి జాతీయ పాడిపరిశ్రమ సంస్థ చైర్మన్‌గా వీజే కురియన్‌ను నియమించారన్నారు. ఆయన పాల ఉత్పత్తిలో విప్లవం తీసుకురావడంతో నేడు ఇతర దేశాలకు పాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. దేశంలోని ప్రైవేట్ పాల సంఘాల నుంచి పాల సహకార సంఘాలు తట్టుకునేలా పలు పథకాలను గతంలో తీసుకువచ్చిందన్నారు. పాల వినియోగదారుడికి నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందజేసేందుకు దేశంలోని పాల సహకార సంఘాల ఆధునీకరణకు ఈ యేడు రూ.450కోట్లను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ నిధులతో పాల సహకార సంఘాల్లో ఆధునిక యంత్రాలు, మార్కెటింగ్, గడ్డి గింజలు, పశువులకు అవసరమైన వైద్య సేవలు, తదితర సేవలను అందించి మేలైన పాల దిగుబడులను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో నెప్ కాబ్ జాతీయ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు, తెలంగాణ పాడి పరిశ్రమ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుత్త అమిత్‌రెడ్డి, ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, దక్షిణ భారతదేశం ఎన్‌డీడీబీ ప్రతినిధి మేరి జాకబ్, ముల్కనూర్ డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జిల్లా పశువైద్యాధికారి రాధాకృష్ణ, నాబార్డు ప్రతినిధులు, నల్లగొండ, రంగారెడ్డి, కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ అందక పసికందు మృతి

ఎంజీఎంలో కలకలం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఓ పసికందు మృతి చెందాడు. ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన మోక్షిత్ (రెండు నెలలు) సబ్బు నీళ్ల తాగి ఈ నెల 21న ఎంజీఎంకు చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. వైద్యులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మోక్షిత్ మృతి చెందాడు. కాగా, ఆక్సిజన్ అందక తమ కుమారుడు మృతి చెందారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆక్సిజన్ ఆటో మోడ్‌లో ఉన్నదని, వెంటిలేటర్‌పై 12మంది పిల్లలు ఉన్నారని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే అందరూ పిల్లలు చనిపోయేవారని స్పష్టం చేశారు. కేవలం పుట్టుకతో వచ్చిన అవలక్షణాల మూలంగానే మోక్షిత్ మృతి చెంది ఉంటాడని స్పష్టం చేశారు.

పెన్షన్లు అందించడంలో పాలకులు విఫలం

- మానవత్వం లేని కేసీఆర్, రేవంత్‌రెడ్డి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



పరకాలలో పెన్షన్‌దారుల సన్నాహక సభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పరకాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ పెన్షన్లను అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. అర్హత కలిగిన పది లక్షల మంది పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే.. నేటికీ ఆ విషయంపై రాష్ట్రప్రభుత్వంతో పాటు ప్రతిపక్షాల నాయకులు మాట్లాడటం లేదన్నారు. బుధవారం పరకాల పట్టణంలోని మయూరి గార్డెన్‌లో వికలాంగుల, చేయూత పెన్షన్‌దారుల నియోజకవర్గ సన్నాహక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. హామీలను నేటి వరకు అమలు పర్చడం లేదని పేర్కొన్నారు. సీఎం పెన్షన్లు పెంచకుండా మోసం చేస్తే, మాజీ సీఎం కేసీఆర్ మౌనం పాటిస్తున్నారని ఆరోపించారు. పెన్షన్ పొందే వారు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే కావడం వల్ల ప్రతిపక్షాలు కూడా మాట్లాడటం లేదన్నారు. వికలాంగులకు రూ.6వేలు, మిగతా పెన్షన్ దారులకు రూ.4వేలు పెంచి అందించకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటం తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నేత సుధాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సోమన్న, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు గద్దల సుకుమార్, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రాజు, రవీందర్, రజనికుమార్, గౌస్‌పాషా, రాజుమొగిలి, చారి, రజిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన 'ఉదయం' షోరూం

ప్రాంతీయ, సంప్రదాయ దుస్తులకు నిలయం



సుబేదారిలో 'ఉదయం' షోరూమ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య

హనుమకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురుషుల నిర్దిష్ట ప్రాంతీయ, సంప్రదాయ దుస్తులకు సంబంధించి దక్షిణ భారతదేశంలోని అత్యంత విశ్వసనీయమైన పేర్లలో ఒకటైన 'ఉదయం' హనుమకొండలో తన ప్రత్యేక షోరూంను ఏర్పాటు చేసింది. సుబేదారి రోడ్డులో ఏర్పాటైన ఈ షోరూంను బుధవారం ఉదయం లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 320 ఎఫ్, సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, లయన్ డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య లాంఛనంగా ప్రారంభించారు. హనుమకొండ రెడ్‌క్రాస్ చైర్మన్, ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ పి.విజయ్‌చందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయగా, ప్రాపర్టీ యజమాని వైట్ల జనార్ధన్ తొలి కొనుగోలు చేశారు. ఉదయం పూర్తిస్థాయి ఉత్పత్తులైన ధోతీలు, చొక్కాలు, వెడ్డింగ్ సెట్, మ్యాచింగ్ సెట్, నిర్దిష్ట ప్రాంతీయ సెట్, షర్టింగ్, సూటింగ్, పంచకచ్చమ్, చిన్నారుల ధోతీలు, చొక్కాలు, టవల్స్ లోదుస్తులు ఈ షోరూంలో అందుబాటులో వున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సంప్రదాయం, సొగసు, సౌకర్యాన్ని మిళితం చేసిన అపూర్వమైన షాపింగ్ అనుభవాన్ని కస్టమర్లు పొందవచ్చని తెలిపారు. నాణ్యత, సంప్రదాయం, నూతనత్వానికి సంబంధించిన నిబద్ధతతో వినియోగదారులకు నిర్దిష్ట ప్రాంతీయ, సహజమైన దుస్తులను అందించాలనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్

అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలి

ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సుధారాణి సమావేశం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులతో జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వరంగల్ ట్రైసిటీస్‌లో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు జరిగాయని, ఇంకా కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయని, అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, ఇరిగేషన్ ఈఈ కిరణ్, డీఈలు శ్రీకాంత్, హర్షవర్ధన్, ఏఈ సౌజన్య పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు సత్కారం



రవికుమార్ దంపతులను సత్కరిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలో చాలాకాలంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు రవికుమార్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ నాగయ్య, ఆర్ఐలు చంద్రశేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కాటారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దేవరాంపల్లిలో పేకాడుతున్న ఆరుగురిని పోలీసులు మంగళవార రాత్రి అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్సై శ్రీనివాస్ బుధవారం వెల్లడించారు. గ్రామంలో పలువురు పేకాడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పేకాడుతున్న వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.20,040 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రేపటి నుంచి బోనస్ పంపిణీ



మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి ముల్కనూర్ బ్యాంక్ సభ్యులకు దసరా బోనస్ రూ.3.70కోట్లు పంపిణీ చేస్తున్నట్లు బ్యాంక్ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 26, 27 తేదీల్లో ఆయా గ్రామాల్లోని బ్యాంక్ గోదాముల్లో బోనస్‌ను రైతులకు పంపిణీ చేస్తారన్నారు. ముల్కనూర్‌లో 448 మంది సభ్యులకు రూ.34.63లక్షలు, ముత్తారంలో 114 మందికి రూ.9లక్షలు, భీమదేవరపల్లిలో 257 మందికి రూ.17.25 లక్షలు, గట్లనర్సింగాపూర్‌లో 366 మందికి రూ. 33.51 లక్షలు, కొత్తపల్లిలో 512 మం దికి రూ.47.38 లక్షలు, ఎర్రబెల్లిలో 288 మందికి రూ. 14.54 లక్షలు, గోపాల్‌పూర్ లో 217 మందికి రూ. 23.32 లక్షలు, జీల్గులలో 204 మందికి రూ.20.74 లక్షలు, కొప్పూర్‌లో 256 మందికి రూ.21.08 లక్షలు వంగరలో 186 మందికి రూ.15.83 లక్షలు, రత్నగిరిలో 203 మంది సభ్యులకు రూ.16.51లక్షలు, మల్లారంలో 351 మందికి రూ.33.58 లక్షలు, కొత్తకొండలో 241 మందికి రూ.17లక్షలు, ముస్తాపాపూర్‌లో 295 మందికి రూ. 23.46 లక్షలు, బొల్లోనిపల్లెలో 86 మందికి రూ.7.10 లక్షలు, జగన్నాథ్‌పూర్‌లో 131 మందికి రూ.12.46 లక్షలు, రంగయ్యపల్లిలో 130 మందికి రూ.10.27లక్షలు, ధర్మారంలో 81 మందికి రూ.7.16 లక్షలు బోనస్‌ను అందిస్తున్నామని తెలిపారు.

బురద, దుర్వాసనతో ఇక్కట్లు

● చెత్త తరలింపు కేంద్రంలో సమస్యల మోత ● బురద కూపంలో ఆటోలు నడపలేమంటున్న డ్రైవర్లు
●చినుకు పడిందంటే చెత్త లోడులో నిలుస్తున్న స్వచ్ఛ ఆటోలు ● మేయర్, కమిషనర్ పర్యటించినా ఫలితం శూన్యం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలోని హనుమకొండ బాలసముద్రంలోని చెత్త తరలింపు కేంద్రం (సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్)లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇటీవల వరంగల్ నగరంలో భారీగా కురిసిన వర్షాలకు ఈ ప్రాంతం పూర్తిగా బురదమయమైంది. నిత్యం ఈ ప్రాంతంలో స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు, టిప్పర్లు లోపలికి వెళ్లి వస్తుంటాయి. తరుచుగా వెళ్లి వచ్చే వాహనాల నుంచి కింద పడిపోయిన చెత్త, బురద కాస్త వర్షపు నీటిలో కలిసిపోయి ఆ ప్రాంతంలో సుమారు అర కిలోమీటరు వరకు దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సమీప ప్రజలు పలుమార్లు మునిపల్ కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టింపు లేనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అలాగే ఈ బురదలో వాహనాలన నడపలేమంటూ మునిసిపల్ ప్రభుత్వ, ఔట్ సోర్సింగ్ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త తరలింపు ప్రక్రియ

హనుమకొండతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, కాలనీల ఇండ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను సేకరించిన స్వచ్ఛ ఆటోలు.. బాలసముద్రంలోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వస్తాయి. ఇక్కడ నుంచి ర్యాంప్ సహాయంతో టిప్పర్లలోకి ఎక్కించి ముడి చెత్తను రాంపూర్ డంపింగ్ యార్డ్‌కు తరలిస్తారు. ఇలా ప్రతీ రోజు 400 స్వచ్ఛ ఆటోలు, 25 ట్రాక్టర్లు, 8 టిప్పర్లు ప్రతీ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మూడు నుంచి నాలుగు ట్రిప్పుల చెత్తను ఇక్కడి నుంచి తరలిస్తారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో వాహనాలు



విరిగిపోయి ప్రమాదంగా ఉన్న ర్యాంపు

తిరగడం వల్ల లోతైన గుంతలు ఏర్పడ్డాయి. అదే విధంగా వర్షం కురిసిన సమయంలో ఈ ప్రాంతం మొత్తం చెత్తతో కూడిన బురదనీటిలో నిండి ఉంటోంది. ఈ కారణంగా రోజూ మూడు ట్రిప్పుల చెత్తను తరలించాల్సిన స్వచ్ఛ ఆటోలు.. ఒక్క ట్రిప్పు కూడా తిరగలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆటోలకు జీపీఎస్ సిస్టం అమర్చి కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) నుంచి వీక్షించడం వల్ల ఎక్కువ చెత్తను సేకరించలేకపోతున్నామని డ్రైవర్లు వెల్లడించారు. అంతే కాకుండా స్టేషన్ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోందని కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి నుంచి సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పూర్తిగా ఎత్తివేయాలని పలుమార్లు ధర్నాలు, వినతి పత్రాలు అందించినట్టు చుట్టుపక్కల ప్రజలు వెల్లడించారు.



బాలసముద్రం చెత్త తరలింపు కేంద్రం బురదనీటితో అస్తవ్యస్తం

పట్టింపులేని అధికారులు

వర్షపు నీరులో చెత్త కలిసి ఈ ప్రాంతంలో లిచేట్ (విషపూరిత రసాయనం)గా తయారవుతోందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇది భూగర్భ జలాలను కలుషితం చేసి సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నట్టు తెలిపారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో చెత్త నుంచి వెలువడిన నీరు భూమిలో కలిసిపోయి బోర్లు, బావులలో కలిసిపోయి విషంగా మారుతోంది. 2019 నుంచి ఇప్పటి వరకు సమీప ప్రజలు చెత్త తరలింపు కేంద్రాన్ని ఇక్కడి నుంచి తరలించాలని యాభైకిపైగా ఫిర్యాదులు చేసినట్టు తెలిపారు. అయినా అధికారుల తీరులో చలనం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించేందుకు గత నెల మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించారు. స్వచ్ఛ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆవరణతో పాటు చుట్టుపక్కల మొత్తం ప్రహరీ నిర్మించడంతో పాటు ర్యాంప్ చుట్టూ సీసీ రోడ్డు వేస్తామని హామీ ఇచ్చి వెళ్లారు. కానీ మునిసిపాలిటీలో కోట్ల నిధులు మూలుగుతున్నా.. ఇక్కడ అభివృద్ధి పనులు చేయడం లేదని స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బాలసముద్రంలోని చెత్త తరలింపు స్టేషన్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని డ్రైవర్లు కోరుతున్నారు.

రక్త మార్పిడిపై విచారణ

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒక రక్తానికి బదులు మరో రక్తం ఎక్కించి మహిళా రోగి జ్యోతికి సీరియస్ అయిన ఘటనపై మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్ బుధవారం ఎంజీఎం ఆస్పత్రి సిబ్బంది విచారించారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురానికి చెందిన జ్యోతి (38) జ్వరంతో ఈ నెల 16న ఎంజీఎంలో చేరారు. ఆమెను పరీక్షించిన వైద్యులు వెంటనే రక్తం ఎక్కించాలని ఓ పాజిటివ్‌కు బదులు బిపాజిటివ్ రక్తం ఎక్కించిన విషయం తెలిసిందే. బాధితురాలి భర్త ఫిర్యాదుతో ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి నుంచి వచ్చిన విచారణ బృందం.. ఎంజీఎంలో బాధితురాలు చికిత్స పొందిన వార్డులో విచారణ చేసి ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టు ఆధారంగా బుధవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్రకుమార్ ఎంజీఎం ఆస్పత్రికి వచ్చి విచారణ చేశారు. బ్లడ్‌బ్యాంకులో టెక్నీషియన్లు, వార్డులో ఆ రోజు విధుల్లో ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని విచారించారు. విచారణలో డీఎంతోపాటు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు బోనస్

కాజీపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికులకు 78 రోజుల దసరా బోనస్ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ పి.రవీందర్ బుధవారం వెల్లడించారు. నాన్ గెజిటెడ్ రైల్వే కార్మికులకు 78 రోజుల వేతనానికి సమానమైన గరిష్ఠ మొత్తం రూ.17,951 చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైల్వేలో ట్రాక్ మెయింటెనెన్స్, లోకో పైలెట్లు, రైల్వే గార్డులు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, సాంకేతిక నిపుణులు, సహాయకులు, పాయింట్స్ మెన్లు, మినిస్ట్రీయల్ సిబ్బంది, ఇతర సి-గ్రూప్‌తో వివిధ కేటగిరీలోని రైల్వే కార్మికులకు ఈ బోనస్ చెల్లించనున్నట్లు రవీందర్ చెప్పారు.

కోకో పిట్ యూనిట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

బాలసముద్రంలోని కంపోస్ట్ యూనిట్ పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోకో పిట్ యూనిట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం హనుమకొండ 30వ డివిజన్ బాలసముద్రంలోని వర్మీ కంపోస్ట్, డీఆర్‌సీసీ, కోకో పిట్ యూనిట్, స్విమ్మింగ్‌పూల్, కంపోస్ట్ యూనిట్‌లను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కోకో పిట్ యూనిట్‌లో సిబ్బంది సరిగా పనిచేయడం లేదని, వారిని అక్కడ పని చేసే సిబ్బందిని వెంటనే మార్చాలని అధికారులను ఆదేశించారు. ఇంకా స్విమ్మింగ్ పూల్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా లేవని, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్‌ల పనితీరు బాగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పూల్ ప్రాంతంలో చెత్తగా ఉందని, అక్కడి జవాన్‌ను వెంటనే మార్చాలని సీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



బాలసముద్రంలోని కోకోపిట్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

సమష్టి పోరాటంతోనే రాజ్యాధికారం

కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్



ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్‌ను సన్మానిస్తున్న ఓబీసీ కుల సంఘాల నాయకులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో పోరాడితేనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని బీసీభవన్‌లో ఓబీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాసుందర్‌రాజ్ యాదవ్ హాజరై మాట్లాడారు. ఈ నెల 26న చాకలి ఐలమ్మ, 27న కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతులు ఉన్నందున ఓబీసీ ఆధ్వర్యంలో వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించాలని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా బీసీలు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేయడానికి ప్రభుత్వం కొత్త ఎత్తుగడలు వేస్తోందన్నారు. త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా ఏ పార్టీలో ఉన్నా వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సుందర్‌రాజ్ యాదవ్‌ను ఓబీసీ కుల సంఘాల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ టి.విజయలక్ష్మి, బొనగాని యాదగిరిగౌడ్, అశోక్ ముదిరాజ్, బండారి వివేకానంద, వైద్యం రాజగోపాల్, వేణుమాధవ్‌గౌడ్, తుపాకుల రవి, డాక్టర్ రాము, భిక్షపతి, క్రాంతి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సందడిగా ఉమ్మడి జిల్లాస్థాయి వూషు ఎంపిక పోటీలు



రాష్ట్రస్థాయి వూషు పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హనుమకొండ కాపువాడలోని లవ్‌లీ డాల్స్ హైస్కూల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి వూషు ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను క్రీడా పోటీల నిర్వహణ కన్వీనర్ రాయకంటి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీల్లో అర్హత సాధించి పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌జీఎఫ్ఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వెలిశెట్టి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాస్థాయిలో అండర్ 17, 19 బాలబాలికల ఎంపిక పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిత్యం వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు శీలం పార్థసారథి, సంతోష్, కోచ్ ధన్‌రాజ్, అసోసియేషన్ బాధ్యులు యాకూబ్, రమేశ్, రామకృష్ణ, విజయ్‌కుమార్, సంజీవ, స్నేహిత్, రెబెక్కా, కవిత పాల్గొన్నారు.

డెంగీతో బాలుడి మృతి



శివకుమార్ (ఫైల్)

వేలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బాలుడు బక్క శివకుమార్ (11) డెంగీ బారిన పడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. బక్క రాజు - మమతలకు ఒక కుమార్తె, కుమారుడు శివకుమార్ అదే గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. ఐదు రోజుల కిందట జ్వరం బారిన పడ్డాడు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించినా జ్వరం తగ్గలేదు. అక్కడే రక్త పరీక్షలు చేయించగా డెంగీ సోకినట్లు వైద్యుడు గుర్తించారు. మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

గ్రామంలో పారిశుధ్య లోపం వల్ల దోమలు ప్రబలి విష జ్వరాల బారిన పడుతున్నట్లు గ్రామస్థులు ఆరోపించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వైద్యులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

దొంగల బీభత్సం

తాళాలు పగలగొట్టి దొంగతనాలు

అడ్డొచ్చిన మనుషులపై దాడి చేస్తున్న వైనం

మామునూరు, వరంగల్ పోలీస్ డివిజన్‌లలో ఘటనలు

లక్షల్లో నగదు, ఆభరణాలతో పరారైన గుర్తు తెలియని వ్యక్తులు

బెంబేలెత్తిపోతున్న పోలీసు కమిషనరేట్‌లోని ప్రజలు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. చోరీల నియంత్రణకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను పటాపంచలు చేస్తున్నారు. పట్టుకోండి చూద్దాం.. అంటూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. సాధారణంగా పండుగ వేళలో దొంగతనాలు జరుగుతుంటాయి. కానీ ఇంకా పూర్తిగా పండుగ సందడి మొదలు కాకముందే ముందస్తుగానే కమిషనరేట్‌లోకి దొంగలు చొరబడ్డారు. తాళాలు పగలగొట్టి చోరీ చేస్తున్నారు. కొన్ని ఏరియాల్లో ఎదురుతిరిగిన మనుషులపై దాడులకు తెగబడుతున్నారు. ఒంటిపై ఉన్న బంగారంతో పాటు ఇంట్లో ఉన్న సొమ్మును, నగదును దోచుకెళుతున్నారు. ఒకే రోజు మామునూరు, వరంగల్ పోలీస్ సబ్ డివిజన్‌లలో వేర్వేరు ముఠాలు చోరీలు చేశాయి. దీంతో పోలీసులకు కంటి మీద కునుకులేకుండా పోతోంది. ఈ క్రమంలో దొంగలను పట్టుకుకోవడంతో పాటు చోరీల నియంత్రణ కోసం నగర శివార్లలో పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.



మామునూరు డివిజన్‌ను వదలని దొంగలు

మామునూరు డివిజన్ దొంగలు అచ్చొచ్చినట్లు కనిపిస్తోంది. చోరీలు చేసుకోవడానికి ఈ డివిజన్ అనుకూలంగా ఉంటుందని ఎంచుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రధానంగా మామునూరు డివిజన్‌లోని సంగెం, గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో దొంగల కన్ను పడింది. బతుకమ్మ పండుగ తొలిరోజు గీసుగొండ పోలీసుస్టేషన్ పరిధిలోని గొర్రెకుంట శివారులోని అపర్ణకాలనీలో మిట్టపల్లి సాంబయ్య ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు పడి 35 గ్రాముల బంగారాన్ని చోరీ చేశారు. బొడ్డుచింతలపల్లిలో 54 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఏనుమాముల పోలీసుస్టేషన్ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో మద్దూర్ వినోద్ ఇంటి తాళాలు పగలగొట్టి 4.5 తులాల బంగారు ఆభరణాలు, 25 తులలా వెండి ఆభరణాలు, రూ.5,500 నగదు దోచుకెళ్లారు. అదే విధంగా పరకాల సబ్‌డివిజన్‌లోని ఒగ్లాపూర్, దామెరలోనూ చోరీలు జరిగాయి. ఈ యేడు ఇంకా పండుగ సందడి కాకముందే.. తాజాగా గత శనివారం గీసుగొండ మండలంలోని సింగ్యా తండాలోని స్వామి అనే వ్యక్తిపై దాడి చేసి అదే తండాకు చెందిన భద్రమ్మను బెదిరించి 2 తులాల బంగారం చైన్, రూ. 30,000 నగదు, విశ్వనాథపురంలో రవీందర్ ఇంట్లో అరతులం బంగారం, వెండి, రూ.15వేల నగదు, భూక్య బిక్షపతి ఇంట్లో 20 తులాల వెండి, రూ. 8000 నగదు, అక్కినపల్లి ప్రదీప్ ఇంట్లో తులన్నర బంగారం, మూడు తులాల బ్రాస్లైట్, 20 తులాల వెండిని చోరీ చేశారు. సంగెం పీఎస్ పరిధిలోని రేఖ్యానాయక్ తండాలోని రాజ్‌కుమార్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు లక్షల నగదు, మూడు తులాల బంగారం, 32 తులాల వెండి, ఒక సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోయారు.

వరంగల్ సబ్ డివిజన్‌లో..

వరంగల్ పోలీస్ సబ్‌డివిజన్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్ఆర్ నగర్‌లో కొత్తగా నిర్మాణం జరుగుతున్న ఇంటిలో పడుకున్న మహిళ మెడలో నుంచి శనివారం రాత్రి మూడు తులాల పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు గుంజుకొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో వరంగల్ పోలీస్ కమిషనర్‌తో పాటు డీసీపీ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన చోరీలో పాల్గొన్న ముఠానే ఇక్కడ పుస్తెల తాడు చోరీ చేసిందని అనుమానించిన పోలీసులు.. తక్షణమే వరంగల్ కమిషనరేట్ నుంచి ఒక బృందంగా ఖమ్మంకు వెళ్లి ముఠా కోసం గాలిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే గతంలో తాళాలు ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసిన దొంగలు.. ఇప్పుడు నేరుగా మనుషులపైనే దాడి చేసి ఒంటిపై ఉన్న ఆభరణాలు, ఇంట్లో నగదు, ఇతర వస్తువులను లూటీ చేస్తుండటంతో కమిషనరేట్ పరిధిలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7350	5300
మక్కలు	1850	1521
కందులు	5390	3022
పెసళ్లు	3790	3022
పల్లికాయ (సూక)	6260	3500
పల్లికాయ (పచ్చిది)	4400	2400
పసుపు (కాడి)	11522	7889
పసుపు (గోల)	9500	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16500	12000
యూఎస్341ఏసీ	14700	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

ఫార్మసిస్టులపై నిర్లక్ష్యమేల!?

- ఉమ్మడి జిల్లాలో 70కి పైగా ఫార్మసిస్టు పోస్టులు ఖాళీ
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల కొరత
- ఉన్నవారిపైనే అధిక పనిభారం
- సక్రమంగా అమలుకాని చట్టం
- నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం



హనుమకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫార్మసిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోగికి మందులు అందజేయడం మొదలు పెట్టినప్పటి నుంచి రోగం నయం అయ్యే వరకు ప్రతీ దశలోనూ ఫార్మసిస్టు కీలక పాత్ర పోషిస్తారు. పరిశోధనలు చేసి ఔషధాలను కనిపెట్టే వారు, వాటిని తయారు చేసేవారు, ప్రజలకు చేరవేసే వారు, ఔషధ గుణాలను రోగికి వివరించి సలహాలు సూచనలు అందించే మెరుగైన వైద్యవనరులుగా ఫార్మసిస్టులను వినియోగించుకోవలసిన ప్రభుత్వాలు వారి విషయంలో చిన్నచూపును ప్రదర్శిస్తున్నాయి.

మందుల కొరత

ప్రభుత్వ ఆస్పత్రుల్లో, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రా లు, బస్తీ దవాఖానాలలో తీవ్రమైన మందుల కొరత ఉంది. రోగు లు బయట మందులు కొనుక్కోవలసిన పరిస్థితి ఉంది. రోగులు ఇందుకు ఫార్మసిస్టులను బాధ్యులను చేస్తూ వారిపై దూషణలకు దిగుతుండడం తరుచూ జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో మందులు ఉన్నా ఇవ్వడం లేదన్న కోపంతో వారిపై దాడు లు జరిగిన ఉందంతాలు కూడా ఉన్నాయి. మందుల కొరతను నివారించడంలో ఫార్మసిస్టులకు వైద్యులు, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు సహకరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వీరితో కొరవడిన సమన్వయం ఫార్మసిస్టులను ఇబ్బందుల పాలు చేస్తోంది. కమ్యూనిటీ ఫార్మసీలలో రోగులు ఎదుర్కొనే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొవడంలో ఫార్మసిస్టులకు శిక్షణ, వనరులు అవసరం. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

అర్హులెక్కడ?

ఉమ్మడి జిల్లాలో 2400 రిటేల్ మెడికల్ షాపులు, 450 మెడికల్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో అర్హులైన ఫార్మసిస్టులు ఉండడం లేదు. నిబంధనల ప్రకారం వారి సర్టిఫికెట్ల ఆధారంగానే లైసెన్సులు తీసుకుంటున్నారు. పేరుకు షాపుల్లో గోడలపై సర్టిఫికెట్లు దర్శనమిస్తున్నాయి కానీ.. అందులో వారు ఉండడం లేదు. ఇది ఫార్మసీ చట్టానికి విరుద్ధం. ఒక ఫార్మసిస్టు తన సర్టిఫికెట్‌ను అనధికారికంగా ఇంకొకరి దగ్గర కుదువ పెట్టరాదు. కానీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నది ఇదే. మందుల షాపులు, మెడికల్ ఏజెన్సీల నిర్వాహకులు లైసెన్సుడు ఫార్మసిస్టులను తగిన వేతనంతో ఉద్యోగాల్లో పెట్టుకుంటే చాలా వరకు నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుంది.

పదినెలవుతున్నా ఫలితాలేవి?

రాష్ట్రవ్యాప్తంగా 700 ఫార్మసిస్టుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం కిందటేడు నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 98 పోస్టులు ఉన్నాయి. పరీక్షలు పూర్తయినా ఇంత వరకు ఫలితాలను ప్రకటించలేదు. పరీక్ష రాసిన నిరుద్యోగులంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కొంత మంది కోర్టుకు వెళ్లడం వల్ల ఫలితాల ప్రకటనలో జాప్యం జరుగుతున్నట్లు చెబుతున్నా ఈ విషయంలో ప్రభుత్వం తన వంతు చొరవ చూపడం లేదు.

డైరెక్టర్ పోస్టు భర్తీ ఎప్పుడు?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ పోస్టు ఆంధ్రకు వెళ్లింది. తెలంగాణలో ఈ డైరెక్టర్ పోస్టు ఇప్పటికీ ఖాళీగానే ఉంది. ఎంతో కాలం తర్వాత డైరెక్టర్ పోస్టు మంజూరైనా భర్తీ మాత్రం జరగలేదు. ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించి నెట్టుకువస్తున్నారు. అన్ని అర్హతలున్న, ఫార్మసిస్టు నిపుణులను డైరెక్టర్‌గా నియమించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 71 డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు పోస్టులు ఇప్పటికీ భర్తీ కాలేదు.

పెద్ద సంఖ్యలో ఖాళీలు

ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో ఫార్మసిస్టుల కొరత తీవ్రంగా ఉంది. పెద్ద సంఖ్యలో ఫార్మసిస్టుల ఖాళీలు ఉన్నాయి. ఫార్మసిస్టులు లేని చోట డాక్టర్లు, చివరికి నర్సులే ఫార్మసిస్టుల అవతారం ఎత్తి రోగులకు మందులను అందజేస్తున్నారు. రోగుల సంఖ్యకు సరిపడే ఫార్మసిస్టులు లేకపోవడం వల్ల ఉన్నవారిపైనే అధిక పని భారం పడుతోంది. ఆస్పత్రుల్లోని మందుల కౌంటర్లలో అత్యవసర రోగులకు అవసరమైన మందులను అందచేయడానికి నైట్ డ్యూటీలో ఫార్మసిస్టులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల పోస్టుల ఖాళీ వల్ల నైట్ డ్యూటీలో ఫార్మసిస్టులు లేక రోగులు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఫార్మసీ వృత్తి ప్రాధాన్యతను గుర్తించాలి



ప్రజారోగ్య సంక్షేమంలో కీలకమైన ఫార్మసీ వృత్తి ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించాలి. రాష్ట్రంలోని ఫార్మసిస్టుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఫార్మసిస్టుల ఉద్యోగావకాశాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలి. ఫార్మసీ కోర్సుపూర్తి చేసినవారికి ఫార్మసీ కళాశాలల్లో బోధన సిబ్బందిగా, డ్రగ్ కంట్రోల్ శాఖలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లుగా, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లలో అసిస్టెంట్లుగా ప్రభుత్వం నియమించాలి. ఫార్మసీ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలి. ఫార్మసిస్టుల పోస్టుల పరీక్షా ఫలితాలను వెంటనే ప్రకటించాలి. మెరిట్ అభ్యర్థులతో నియామకాలు చేపట్టాలి.

ఉప్పు భాస్కర్‌రావు,
రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు



పర్వతగిరిలో ఎర్రబెల్లికి తమ బాధలు చెప్పుకుంటున్న మహిళా రైతులు

రైతుల బాధలు కనిపించడం లేదా?

మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆగ్రహం

పర్వతగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రికి రైతుల బాధలు కనిపించడం లేదా? అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయకపోవడంపై అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పర్వతగిరి మండల కేంద్రంతోపాటు కల్లెడ పీఏసీఎస్ వద్ద రైతుల దీనస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల గోడును విని ధైర్యం చెప్పారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ రైతులు అర్ధరాత్రి నుంచి క్యూలైన్లు కట్టి యూరియా కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని, పాలన చేతగాక కాంగ్రెస్ నాయకులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే..

పర్వతగిరిలోని తన నివాసంలో దయాకర్‌రావు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే ఉన్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పట్ల సైతం మేధావులు, యువకులు, మహిళలు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు.

అనంతరం పర్వతగిరిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, లునావత్ పంతులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బోయినపెల్లి యుగేందర్‌రావు, గోనె సంపత్, దేవేందర్, రాజు, శ్రీనివాస్, వెంకన్న, మాధవరావు, శ్రీను, జిల్లా, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శలు...

రాయపర్తి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యతండాలో యూరియా క్యూలైన్‌లో జరిగిన తోపులాటలో గాయపడిన మునావత్ మాంజ్యా నాయక్‌ను బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం పెర్కవేడు గ్రామంలోని గుంటూరుపల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాకినేని వీరయ్య అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

సూర్యతండాకు చెందిన లైన్‌మన్ మునావత్ హన్మంత్ విధుల్లో ఉండగా జరిగిన ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతుండగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జట్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, పూస మధు తదితరులు పాల్గొన్నారు.

పృథ్వీకి ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్ అవార్డు

రాష్ట్రపతి నుంచి స్వీకరణ

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ పట్టణానికి చెందిన వర్ధమాన సినీ కళాకారుడు ఉప్పరి పృథ్వీకి జాతీయ స్థాయిలో ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్ అవార్డు వరించింది. ఈ అవార్డును ఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. పృథ్వీ తండ్రి శేఖర్ డోర్నకల్‌లో కుంగ్‌ఫూ మాస్టర్‌గా ఎంతోమందికి శిక్షణ ఇచ్చారు.

ఈ కళ ద్వారా రైల్వేలో ఉద్యోగం సాధించిన ఆయన అనంతరం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత తెలుగు సినిమాలకు స్టంట్ మాస్టర్‌గా పనిచేస్తూ.. పలు చిత్రా ల్లో పాత్రలు పోషించారు. ఈ క్రమంలో తన కుమారుడు పృథ్వీకి కుంగ్‌ఫూలో శిక్షణ ఇచ్చారు. తన తండ్రి దగ్గర మెళకువలు నేర్చుకున్న ఆయన పలు సినిమాలకు స్టంట్ మాస్టర్‌గా కొరియోగ్రాఫర్‌గా పని చేశారు.

ఇటీవల ప్రకటించిన జాతీయ ఉత్తమ స్థాయి చిత్రాలలో ఒకటైన 'హనుమాన్' చిత్రంలో పృథ్వీ నటించడంతో పాటు స్టంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేశారు. దీంతో ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డోర్నకల్ ప్రాంత వాసులు పృథ్వీకి అభినందనలు తెలిపారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న డోర్నకల్‌కు చెందిన ఉప్పరి పృథ్వీ

ఫోన్‌లోనే బిల్డ్‌నౌ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చు

- కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి
- కుడా కార్యాలయంలో అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న కుడా చైర్మెన్ వెంకట్రాంరెడ్డి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇకపై ఇండ్లు నిర్మించుకునే వారు ఫోన్‌లోనే బిల్డ్‌నౌ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చని కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్, కుడా సీపీవో అజిత్‌రెడ్డితో పాటు 120 గ్రామాల ఆర్ఐలు, పంచాయతీ సెక్రెటరీలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. బిల్డ్‌నౌ యాప్ ఏఐ సిస్టం ద్వారా భవన అనుమతులు నిమిషాల్లో పొందే విధంగా రూపొందించామ న్నారు. అధికారుల జోక్యం లేకుండా పారదర్శకతతో అనుమతులు జారీ చేస్తామన్నారు. దరఖాస్తుదారులు కార్యాలయా నికి రాకుండా ఇండ్ల వద్ద నుంచే అనుమతులు పొందవచ్చన్నారు. వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందిస్తూ వినియోగదారులు దరఖాస్తుల స్టేటస్‌లు తెలుపుతుందని అన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ద్వారా పనిచేసేందుకు బిల్డ్‌నౌ యాప్‌ను రూపొందించామన్నారు. అదే విధంగా ఇంటి స్థలం 75 గజాలలోపు ఉంటే దరఖాస్తును సమర్పించిన వెంటనే అనుమతులు జారీ అవుతాయన్నారు. టీడీసీపీ, పట్టణాభివృద్ధి సంస్థలు, అగ్నిమాపకశాఖ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ తదితర శాఖలన్నింటినీ బిల్డ్‌నౌ యాప్‌కు అనుసంధానం చేశామని వెంకట్రాంరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు, పనులు అమ్ముకున్న చరిత్ర రాజయ్యది

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- చిలుపూర్‌లో లబ్దిదారులకు చెక్కుల పంపిణీ



చిలుపూర్‌లో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత పదిహేనేళ్ళుగా నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి పనులు, పథకాలను అమ్ముకున్న చరిత్ర మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వరలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో రూ. 53 లక్షల విలువ గల కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిన అనతికాలంలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రైతు రుణమాఫీతో పాటు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రేషన్‌కార్డుల జారీ, రైతుభరోసా, మహాలక్ష్మి వంటి సంక్షేమ పథకా లను అమలు చేస్తున్న తీరు దేశానికే మార్గదర్శకమన్నారు. కేవలం 21 నెలల్లోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.1025 కోట్లను మంజూరు చేయించానన్నారు. కార్యక్రమంలో చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మార్కెట్ చైర్మన్ లావణ్యరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎమ్మార్వై అర్జున్, గడ్డమీది సురేశ్, రత్నాకర్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, ఎమ్డీ షకీల్, ఏడవెళ్ళి మల్లారెడ్డి, తాళ్ళపల్లి సమ్మయ్య, జీడి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

తాటికొండలో వనిత టీస్టాల్ ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభివృద్ధితోనే సమాజంలో నేడు కుటుంబాలు జీవిస్తున్నాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం మండలంలోని తాటికొండ గ్రామంలో ఇందిరా మహిళశక్తి కార్యక్రమంలో భాగంగా కుంబోజు మదుమాల-రాజు దంపతులు ఏర్పాటు చేసిన వనిత టీస్టాల్‌ను కడియం ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు ఏడు ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాలకు మంజూరు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఏడు మండలాలకు ఏడు పెట్రోల్ పంప్‌లను మహిళా సంఘాలకు ఇచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాపోలు మధుసూధన్ రెడ్డి, బేతి జయపాల్ రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు బేతి మంజుల, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భళా పోలీస్!

- ఐనవోలు మండలంలో వినూత్న కార్యక్రమం
- ద్విచక్ర వాహనాలపై గస్తీ తిరుగుతూ ప్రజలతో మాటామంతీ
- పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచన
- వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు...



నందనంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న మామునూరు ఏసీపీ వెంకటేష్, సీఐ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ఐనవోలు మండలంలో పోలీసులు బుధవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రజలను చైతన్య పరిచే ఉద్దేశ్యంతో గ్రామాల్లో ద్విచక్ర వాహనాలపై గస్తీ తిరుగుతూ భరోసా కల్పించారు. ప్రజలతో స్వయంగా మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. నేరాలపై అప్రమత్తంగాఉండాలంటూ అవగాహన కల్పించారు. పండుగను ప్రశాంతంగా జరుపుకొని ఆనందంగా గడపాలని సూచించారు. మామునూరు ఏసీపీ వెంకటేష్ నేతృత్వంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్, పోలీసు సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ సూచనలు చేశారు. రాజకీయ పార్టీల నాయకులు వివాదాలకు తావులేకుండా పండుగలు జరుపుకోవాలని కోరారు. పండుగల్లో రాజకీయాలు చేసి గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పండుగల వేళ చోరీలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి గ్రామంలో ప్రవేశ మార్గాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను యువతకు వివరించారు. సైబర్ నేరాలు జరిగే విధానం, వాటి బారిన పడకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. గస్తీ సందర్భం గా వివిధ గ్రామాల్లో బతుకమ్మలు ఆడే స్థలాలను పరిశీలించారు. కాగా, పోలీసులు ఈ చేపట్టిన ఈ కార్యక్రమంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సాగునీటి చిక్కులు 'సమ్మక్క' తీర్చేనా!?

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ ప్రాజెక్టుకు ఇన్నాళ్లు కొర్రీలు పెట్టిన చత్తీస్‌గడ్ ప్రభుత్వం ఇటీవలే సానుకూల వ్యక్తం చేయటం రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. దేవాదుల మూడు దశల పనులు పూర్తి కావస్తుడటంతో పాటు భూసేకరణపై ప్రభుత్వం దృష్టి సారించటంతో దేవాదుల కల సాకారం అవుతుందనే ఆనందం రైతుల్లో వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో సాగునీటిపై కొత్త చిక్కులు తెరపైకి వస్తున్నాయి. సమ్మక్కసాగర్ నుంచి 2,51,310 హెక్టార్లకు సాగునీటితో పాటు ఎస్సారెస్పీ ఫేస్-2లో 1,78,000హెక్టార్ల (4.45 లక్షల ఎకరాలు) ఆయకట్టును స్థిరీకరించనున్నట్లుగా సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లో పేర్కొన్నారు. అయితే ఇదే ఆయకట్టును కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లో ప్రభుత్వం చూపించింది. ఎస్సారెస్పీ-2 పరిధిలోని ఆయకట్టును కాళేశ్వరం ప్రాజెక్టు, సమ్మక్కసాగర్‌లకు రెండింటికి డీపీఆర్‌లో చూపించటంపై కేంద్ర జలవనరుల సంఘం అభ్యంతరాలు తెలిపింది. ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టును కాళేశ్వరం ప్రాజక్టుకే పరిమితం చేస్తే, సమ్మక్కసాగర్ సంబంధించిన ప్రాజెక్టు ప్రయోజనాల వ్యయం(కాస్ట్ బెనిఫిట్‌రేషియో) తగ్గుతోంది. ప్రస్తుత డీపీఆర్‌లో ఒక రూపాయి ఈ ప్రాజక్టుపై ఖర్చు చేస్తే.. కొత్త పాత ఆయకట్టుల ద్వారా రూ.1.67 లాభం వస్తుందని సీడబ్ల్యూసీకి తెలిపారు. కానీ ఎస్సారెస్పీ-2 ఆయకట్టును తొలగిస్తే రూపాయిన్నర ఖర్చుకు రూపాయి వరకు కూడా ప్రయోజనం కనిపించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో సమ్మక్క బ్యారేజ్ కింద కొత్తగా రెండు లక్షల ఆయకట్టును చూపాలంటూ కేంద్ర జల సంఘం సూచించింది.

ఎస్సారెస్పీ-2 ఆయకట్టుకు నీటి కష్టాలేనా..?

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు రెండు దశల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.74లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ-1 కింద 3,64,078 ఎకరాల్లో, ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టు ఉందని అంచనా. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఈ ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా గత ప్రభుత్వం కేంద్ర జలమండలికి నివేదిక ఇచ్చింది. అయితే సమ్మక్కసాగర్ నిర్మాణంతో దేవాదుల ఎత్తిపోతల కింద కొత్త ఆయకట్టును ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీంతో ఎస్సారెస్పీ-2 కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా ప్రభుత్వం సీడబ్ల్యూసీకి డీపీఆర్‌లో చూపించింది. రెండు ప్రాజెక్టుల కింద ఎస్సారెస్పీ ఆయకట్టును చూపించటంతో సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దీంతో కొత్తగా పాకాల-బయ్యారం- రోళ్లపాడు వరకు సమ్మక్కసాగర్ నీటిని ఎత్తిపోయాలని ప్రభు త్వం ప్రణాళిక రూపొందిస్తోంది. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు నియోజకవర్గాలోని రైతులకు ప్రయోజనం చేకూరుతందని అంచనా వేస్తున్నారు. దీంతో ఎస్సారెస్పీ-2 కింద ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం పక్కన పెట్టింది. రెండేళ్లుగా కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయటం లేదు. ఎస్సారెస్పీ-2 కింద ఉన్న సమ్మక్కసాగర్ నీటిని పాకాల- బయ్యారం మళ్లిస్తే.. తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాలకుర్తి నియోజకవర్గంలో 44,942 ఎకరాలు, వర్ధన్నపేటలో 9,012 ఎకరాలు, డోర్నకల్‌లో 55,558 ఎకరాలకు ఎస్సారెస్పీ-2 ద్వారా గోదావరి జలాలు అందుతున్నాయి. భవిష్యత్తులో కూడా కాళేశ్వరం ఎత్తిపోతల చేపట్టే సూచనలు కనిపించటం లేదని, దీంతో ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టుకు మళ్లీ కరువు వస్తుందనే ఆవేదనలో రైతులు ఉన్నారు. దీంతో సీడబ్ల్యూసీ అభ్యంతరాలకు సమాధానం ఇచ్చి ఎస్సారెస్పీ-2 ఆయకట్టుకు నీటిని మళ్లించాలా? లేక కొత్త ఆయకట్టు కోసం పాకాల- బయ్యారం వరకు సమ్మక్కసాగర్ నీటిని ఎత్తిపోసేలా కొత్త డీపీఆర్‌ను తయారు చేయాలా అనే సందిగ్ధం అధికారుల్లో నెలకొంది.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతమ్

వడ్డెపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతమ్ అన్నారు. బుధవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని భవానీనగర్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నివాసంలో ఆయనను పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, వడ్డెపల్లి దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్, గొర్రె మధు, దొమ్మాటి రాజు తదితరులు పాల్గొన్నారు.



భవానీనగర్‌లో ప్రీతమ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మడికొండలో బతుకమ్మ, దసరా ఉత్సవాల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పండగలకు ప్రభుత్వం పెద్దపీట

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

మడికొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పండగలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి దేవస్థాన భూమి సర్వే నంబర్ 1074 అయోధ్యపురం రోడ్డులో 3 ఎకరాల భూమిని బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలాన్ని బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి రామలీల మైదానంగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కాజీపేట మండల అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ బిల్లా రవీందర్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, రామాలయ చైర్మన్ పల్లపు అర్జున్, నాయకులు వస్కుల నాగరాజు, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, వస్కుల శ్రీను, బైరి రజినివేణు తదితరులు పాల్గొన్నారు.

జేడీ బాల భాస్కర్‌కు అభినందనల వెల్లువ

వడ్డెపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ (జేడీ)గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ బాల భాస్కర్‌ను హైదరాబాద్‌లోని కళాశాల విద్య కార్యాలయంలో వడ్డెపల్లి పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళిగౌడ్ బుధవా రం మర్యాదపూర్వకంగా కలిశారు. బాలభాస్కర్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమౌళిగౌడ్ మాట్లాడుతూ.. పిం గిళి కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 13మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 11 మందికి రూ.14,700 జరిమానా విధించారన్నారు.డ్రైవింగ్ లైసెన్స్ లేని ఐదుగురికి రూ.3,000, వాహనాలు నడపుతున్న నలుగురు మైనర్లకు రూ.2,000 జరిమానా విధించారన్నారు.

టీషర్ట్స్ అందజేత



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కల్ మండలంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ బుధవారం క్రీడాకారులకు టీషర్ట్స్ అందజేశారు. నెల రోజులుగా జేఎన్ఎస్‌లో రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి కసరత్తు చేస్తున్న కబడ్డీ క్రీడాకారులను జేఎన్ఎస్ కబడ్డీకోర్టును సందర్శించి క్రీడాకారులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ అశోక్ కుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి సారంగపాణి, అసోసియేషన్ బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, దేవేందర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని కాజీపేట రైల్వేస్టేషన్, కాజీపేట మెయిన్‌రోడ్డు, జూబ్లీమార్కెట్, మజీద్ ఏరియాలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

చోరీల నియంత్రణకు పోలీసుల చర్యలు



రాత్రి వేళ గస్తీ కాస్తున్న పోలీసులు

మడికొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పలు గ్రామాల్లో దొంగలు వరుస దోపిడీలు చేయడంతో పాటు ప్రతిఘటించిన వారిపై దాడులకు పాల్పడిన నేపథ్యంలో మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. దొంగలు ఎక్కువగా గ్రామాల శివారులోని తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్నందున పండగల సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు బంగారం, వెండి వంటి విలువైన వస్తువులు, నగదు ఇంట్లో ఉంచకూడదని తెలిపారు. అలాగే స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే నిఘా పెడతామన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 8712685009, 8712685248 నెంబర్లకు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

మహిళలకు దసరా కానుక ఇవ్వాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలకు బతుకమ్మ చీరలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేవలం పొదుపు సంఘాల సభ్యులకు మాత్రమే కాకుండా మహిళలందరికీ చీరలు ఇచ్చి వారిని గౌరవించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో దొమ్మాటి ప్రవీణ్‌కుమార్, కౌసల్య, రమ, అక్షయ పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో ఇందిరమ్మ కాలనీ



వర్షపు నీటిలో ఇందిరమ్మ కాలనీ

జూలైవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షానికి 49వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీ నీట మునిగింది. మూడు రోజులుగా కాలనీ వాసులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ కాలనీలో సుమారు 300కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా ఇళ్లలోకి నీరు చేరడంలో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కాలనీ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా హుషారుగా బతుకమ్మల సందడి



ఎస్వీఎస్ కళాశాలలో బతుకమ్మలతో తరలివస్తున్న ఎర్రబెల్లి సువర్ణ



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ప్రారంభమైన బతుకమ్మల పర్వం బుధవారం నాలుగో రోజుకు చేరింది. ప్రతిచోట మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను ఆడుతూ పాడుతూ సందడి చేస్తూ తెలంగాణ సాంస్కృతిక పర్వం ఔన్నత్యాన్ని చాటుతున్నారు. బుధవారం రాత్రి హనుమకొండ ఏకశిలా పార్కు రామాలయంలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వందలాది మంది మహిళలు పాల్గొని సందడి చేశారు. జిల్లా అధ్యక్షుడు పరాంకుశం గిరిధర్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హరిపురం సునంద, ఉపాధ్యక్షురాలు యడుగిరి నిర్మల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు కూడా ప్రదానం చేశారు.

ఏకశిల కళాశాలలో బతుకమ్మ వేడుకలు

రాంనగర్ : ఏకశిల జూనియర్ కళాశాలలో బుధవారం నాలుగో రోజు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఎస్ కళాశాలలో..

హసన్‌పర్తి: తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ అని ఎస్వీఎస్ విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎర్రబెల్లి సువర్ణ అన్నారు. భీమారం ఎస్వీఎస్ కళాశాల కన్వెన్షన్ హాల్‌లో బుధవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు బతుకమ్మలతో తరలి వచ్చి ఆడిపాడారు. సువర్ణ బతుకమ్మ వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఎస్వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు మాట్లాడు తూ.. మన ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేయడమే కాకుండా వాటిని ఆచరించేలా కళాశాలలో వి ద్యార్థులతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ విద్యా సంస్థల అధ్యాపకులు, సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కమిషనరేట్‌లో..

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ గ్రౌండ్‌లో మహిళా సిబ్బంది బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమానికి సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఆయన సతీమణి డాక్టర్ దీప్తి హాజరై పోలీస్ సిబ్బందితో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాట లకు అనుగుణంగా కోలాటం వేశారు. ఈ సందర్భంగా ఉత్తమ బతుకమ్మలకు సీపీ దంపతులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్‌తో పాటు ఏఆర్ అదనపు డీసీపీ, ఏసీపీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళా సిబ్బందితో సీపీ దంపతులు

సురక్షిత డ్రైవింగ్ పద్ధతులతో ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న స్వప్న

హసన్‌పర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సురక్షిత డ్రైవింగ్ పద్ధతులను అనుసరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సైకాలజిస్టు మోటివేటర్ స్వప్న అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కళాశాల బస్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సేవ, దేశభక్తి, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై చేసిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏవో వేణుగోపాలస్వామి, కళాశాల బస్ డ్రైవర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రి మాతగా అమ్మవారు

3వ రోజుకు చేరిన శరన్నవరాత్రి పర్వం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మూడోరోజు అమ్మవారిని గాయత్రిమాతగా అలంకరింపజేశారు. యాగశాలలో మహాచండీయాగం నిర్వహించారు. గాయత్రి అలంకరణలో ఉన్న అమ్మవారిని సందర్శించిన భక్తులకు సకలవిద్యలు, సంప్రాప్తించడంతోపాటు తేజోమయమైన బుద్ధి కలిగి అజ్ఞానం తొలగిపోతుందని, గాయత్రి ఉపసన ఫలితం దక్కుతాయని గంగు ఉపేంద్రశర్మ వ్యాఖ్యానించారు. అనంతరం నిత్యాన్నదానం విశేషంగా జరిగింది. సాయంత్రం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో ప్రముఖ గాయకుడు, అన్నమాచార్య విద్వాంసుడు సూత్రపు అభిషేక్ బృందంతో భక్తిపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. హనుమకొండలోని రెడ్డికాలనీ, కుమార్‌పల్లి, లష్కర్‌బజార్, కొత్వారు, గుడిబండల్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై మూడోరోజు అమ్మవారిని గాయత్రిమాతగా అలంకరింపజేసి పూజాదికాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా రెడ్డికాలనీలో భారీ సైజులో ఏర్పాటు చేసిన అమ్మవారిని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. పద్మాక్షి ఆలయంలో కూడా ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల శంకర్‌శర్మ అవధాని ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.



రుద్రేశ్వరాలయంలో గాయత్రీమాతను కొలుస్తున్న భక్తులు

ప్రపంచ రేబిస్ దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



రాబిస్ దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రేబిస్ దినోత్సవ (ఈనెల 28వతేదీన) వాల్‌పోస్టర్లను బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ స్నేహ శబరీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీన ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని పెట్ పార్కులో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు రేబిస్‌పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. యాంటీరేబిస్ వ్యాక్సిన్‌ను తయారుచేసిన లూయి పాశ్చర్ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచ రాబిస్ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ పర్యవేక్షణలో రేబిస్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవగాహన సదస్సులో పెంపుడు కుక్కలకు, పెంపుడు పిల్లులకు ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్నామన్నారు. అలాగే జులై 6వ తేదీన ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ప్రతీ పశువైద్యశాలలో ఈ టీకాల డ్రైవ్‌ను చేపట్టి కుక్కలు, పిల్లులకు ఉచిత టీకాలు వేస్తామని, అలాగే ప్రతీరోజు ప్రతీ పశువైద్యశాలలో ఉచిత టీకాలను వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై.రాధాకిషన్, డాగ్‌బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడే దేవేందర్, మారుతి, శ్రీను, శ్రీకాంత్, గౌతం, సాయి, అయ్యప్ప, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర పరిష్కారం చూపాలి

తహసీల్దార్ కార్యాలయ తనిఖీలో ఏజేసీ వెంకట్‌రెడ్డి



భూభారతి దరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మండిపడ్డాడు. బాధితులకు సత్వర న్యాయం అందించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తహసీల్దారు, సిబ్బందిని మందలించారు. భూభారతి దరఖాస్తుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని హెచ్చరించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలతో పాటు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూభారతి దరఖాస్తులపై నిబంధనల మేరకు విచారణ చేసి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్, నాయబ్ తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మేనిఫెస్టోలో పెట్టిన హామీలు నెరవేర్చాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుల కోసం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని, ప్రతీ ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలంతోపాటు రూ.25వేల పెన్షన్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 90 శాతం ఉద్యమకారులపై కేసులు ఎత్తివేశారని సాంకేతిక కారణాలతో ఉద్యమకారులపై పెండింగ్ కేసులు ఉన్నాయని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేసులు ఎత్తివేసి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రకటనలో కోరారు.

వికాస్‌నగర్‌లో శ్రీకృష్ణ క్లినిక్ ప్రారంభం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వికాస్‌నగర్ కాలనీలో బుధవారం శ్రీకృష్ణ క్లినిక్‌ను 57, 59వ డివిజన్ల కార్పొరేటర్లు నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డి, గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ అల్లం, డాక్టర్ సాయిశ్రీ, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పులి వీరారెడ్డి, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బాసెట్టి మల్లయ్య, అల్లం మల్లికార్జునరావు, రాధారపు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ డీఈఈ హరికృష్ణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్మికులు

రైల్వే కార్మికులు విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

కాజీపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికులు విధులను బాధ్యతగా నిర్వర్తించాలని డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఈఈ హరికృష్ణ అన్నారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని డీజిల్ లోకో షెడ్ సీనియర్ డీఈఈగా హరికృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన చాంబర్‌లో రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాలువ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు బుధవారం హరికృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో తనకు కార్మికుల సహరించాలని కోరారు.కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు వేద ప్రకాష్, గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, తిరుపతి, యాదగిరి, శ్రీనివాస్, రవీందర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



స్టడీ టూర్‌కు వెళుతున్న దృశ్యం

శాస్త్రమిత్ర స్టడీ సర్కిల్ విజ్ఞాన యాత్ర

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమకాలీన సామాజిక అంశాలపై చర్చించి జ్ఞానాన్ని నలుగురితో పంచుకోవడానికి ఏర్పడిన సంస్థ శాస్త్ర మిత్ర స్టడీ సర్కిల్. ఈ సభ్యులు ప్రతీ నెల సమావేశమై తాట్ ప్రవోకింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. చారిత్రక, వైజ్ఞానిక, ధార్మిక క్షేత్ర పర్యటనకై శాస్త్రమిత్ర సభ్యులు కాకతీయ యూనివర్సిటీ నుంచి బయలుదేరి అమరావతిలోని బౌద్ధ స్తూపాన్ని సందర్శించి, ఆప్రాంతపు బుద్ధ సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకోవడం, ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన త్రికోటేశ్వరస్వామి కోటప్పకొండను సందర్శించడం, సముద్రతీర ప్రాంతంలో ప్రకృతి రమణీయమైన దృశ్యాలను వీక్షించినట్లు శాస్త్రమిత్ర స్టడీ సర్కిల్ అధ్యక్షుడు పరికిపండ్ల వేణు తెలిపారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



జిల్లా గ్రంథాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు జాబ్ క్యాలెండర్‌ను వెంట నే విడుదల చేయాలని హనుమకొండ జిల్లా గ్రంథాలయం ఎదుట నిరుద్యోగులు ప్లకార్డులతో బుధవారం నిరసన తెలిపారు. పది రోజులుగా హైదరాబాద్‌లో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, మొత్తం ఉద్యోగాలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న అశోక్‌కు మద్దతుగా నిరుద్యోగులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ కాత్యాయనీ దేవి
ఆశ్వయుజ శుద్ధ చవితి
గురువారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో నాలుగో రోజున శ్రీ కాత్యాయనిదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. పూర్వం 'కత' అనే మహర్షికి దేవీ ఉపాసన వల్ల ఒక కుమారుడు కలిగాడు. చిన్నతనం నుంచే తండ్రి నుంచి భక్తిని అలవరచుకున్న ఆ తపస్వికే 'కాత్యాయనుడు' అని పేరు. ఆయన గొప్ప తపశ్శక్తి సంపన్నుడు. దేవి భక్తుడు కావడంతో దేవినే పుత్రికగా పొందాలని తపస్సు చేశాడు. దేవి ప్రసన్నురాలై ఆ మహర్షికి పుత్రికగా జన్మించింది. కాత్యాయనుడి పుత్రిక కనుక ఆమె 'కాత్యాయనీదేవి'గా ప్రసిద్ధి పొందింది. లోకకంటకులైన రాక్షసులను... ముక్కోటి దేవతలు, త్రిమూర్తులు ప్రసాదించిన శక్తితో కాత్యాయనీ దేవి అంతం చేసి, లోకకల్యాణానికి దోహదం చేసింది. ఆమె భక్తుల పాలిట కల్పవల్లి. ఆ తల్లిని ఆరాధించడం వల్ల చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయని, రోగాలు, శోకాలు, భయాలు నశిస్తాయని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు భక్తుల ఇళ్లలో వర్ధిల్లుతాయని పురాణ వచనం.

నైవేద్యం:
పొంగలి, పరమాన్నం
అలంకరించే చీర రంగు:
ఎరుపు
అర్చించే పూల రంగు:
ఎరుపు
పారాయణ చెయ్యాల్సినవి:
కాత్యాయనీ మంత్రం, అష్టోత్తరం

గూగుల్ జెమిని రూపొందించిన 'నానో బనానా ఏఐ టూల్' అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఫొటోలు అప్‌లోడ్ చేసి క్షణాల్లో 3డి ఇమేజ్‌లా మార్చేసుకుని ఇన్‌స్టా, ఫేస్‌బుక్, వాట్సప్‌ల్లో షేర్ చేసుకుంటూ మురిసిపోతోంది యువత. ఇదిలా ఉంటే ఓ యువతికి ఎదురైన అనుభవం మాత్రం భయాందోళనలను కలిగించేలా ఉంది. కంటికి కనిపించకుండా గోప్యంగా ఉంచిన పుట్టుమచ్చను సైతం ఏఐ గుర్తించి ఫొటోలో చూపించిందని ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది.

'బనానా శారీ'తో భద్రం సుమా...

ఏంటీ శారీ ట్రెండ్..?

● చీరలంటే ఇష్టపడని ఆడవాళ్లు ఉండరు. అందులోనూ చీరకట్టులో ఫొటో అంటే ఎగిరి గంతేస్తారు. అందుకే ఈ నానో బనానా ఏఐ శారీ ట్రెండ్ అంతలా పాపులర్ అయింది. ముందుగా ఏదైనా ఫొటోను అప్‌లోడ్ చేసి చీరకట్టులో ఎలా ఉండాలని అనుకుంటున్నారో దానికి తగ్గట్టు ప్రాంప్ట్ ఇస్తే చాలు. క్షణాల్లో కోరుకున్న ఫొటో కళ్లముందు ప్రత్యక్షమవుతుంది. చీర రకం, చీర కట్టు, రంగు, బోర్డర్, పోల్కా డాట్స్, వింటేజ్ లుక్, రెట్రో స్టైయిల్, అలనాటి నటీమణుల స్టైయిల్, లాంగ్ హెయిర్, కర్లీ హెయిర్ లాంటివాటిని ప్రాంప్ట్‌లో వివరంగా చేరిస్తే చాలు చక్కగా ఫొటో వచ్చేస్తుంది. వానలో తడుస్తున్నట్టు, గొడుగు లేదా పూల సజ్జ పట్టుకున్నట్టు, గాల్లో చీర కొంగు ఎగురుతున్నట్టు ఉన్న మోడల్స్ యువతులను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. ఇలా ఏఐ తీసిన ఫొటోల్లో ఎంత అందంగా ఉన్నారో చూసుకుంటూ ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌ల్లో షేర్ చేస్తూ మురిసిపోతున్నారు అమ్మాయిలు.



జెమినికి ఎలా తెలుసు..?

ఇన్‌స్టాగ్రామ్‌లో తెగ వైరల్ అవుతున్న నానో బనానా శారీ ట్రెండ్‌ను చూసి తను కూడా ప్రయత్నించాలనుకుంది ఓ ఇన్‌ఫ్లుయెన్సర్. గూగుల్ జెమినిలోని ఫ్లాష్ 2.0 ఇమేజ్ మోడల్ సహాయంతో శారీ ఇమేజ్ పొందాలనుకున్నారు. అందులో భాగంగా ఫుల్ హ్యాండ్స్ ఉన్న చుడీదార్‌తోపాటు దుపట్టా వేసుకున్న ఫొటోను అప్‌లోడ్ చేశారు. ఆపై బ్లాక్ శారీ లుక్‌లో ఫొటో కావాలని ప్రాంప్ట్ ఇచ్చారు. వెంటనే నల్లచీర కట్టుకున్నట్లుగా ఓ స్టయిలిష్ ఫొటో ప్రత్యక్షమైంది. ఫొటో అందంగా వచ్చిందని ఆమె సంతోషించింది. అంతలోనే తన ఎడమ చేతిపై ఉన్న పుట్టుమచ్చ స్పష్టంగా కనిపిస్తుండడంతో ఒక్క నిమిషం భయం వేసిందని ఇన్‌స్టాలో చెప్పుకొచ్చారు ఆమె. 'వాస్తవానికి నా ఎడమ భుజం మీద పుట్టుమచ్చ ఉంది. నేను అప్‌లోడ్ చేసిన ఫొటోలో అది కనిపించడం లేదు. అయినా ఏఐ ఇమేజ్‌లోకి ఎలా వచ్చింది? నా పుట్టుమచ్చ గురించి జెమినికి ఎలా తెలుసు? ఏదేమైనా సామాజిక మాధ్యమాలు, ఏఐ వేదికల్లో ఫొటోలు అప్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి' అంటూ ఆమె పోస్ట్ చేసిన వీడియో అందరినీ ఆలోచింపజేస్తోంది.



ఏ జాగ్రత్తలు తీసుకోవాలంటే...

- కొత్త ట్రెండ్స్ వచ్చినప్పుడు ఇష్టానుసారం ఫొటోలను అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం రెండూ మంచి పద్ధతులు కావు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం మరిచిపోకూడదు. లేదంటే ఫొటోలే కాదు వ్యక్తిగత సమాచారం, సోషల్ మీడియా ఖాతా కూడా దుర్వినియోగం కావచ్చు.
- అప్‌లోడ్ చేసేముందు ఫొటోల మీద పేరు, ఊరు, ఫోన్ నెంబరు లాంటివి ఏవైనా ఉన్నాయేమో పరిశీలించుకోవాలి. ఫొటోల వెనక కూడా ఏమీ లేకుండా చూసుకోవాలి. ఎలాంటి సమాచారం ఉన్నా దాన్ని తొలగించాకే ఫొటోను అప్‌లోడ్ చేయడం మంచిది.
- సామాజిక మాధ్యమాల్లో తప్పనిసరిగా ప్రైవసీ సెట్టింగ్స్ పెట్టుకోవాలి. ఫొటోలు, ఇతర సమాచారాన్ని అందరికీ కాకుండా కావాల్సినవాళ్లకు మాత్రమే కనిపించేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- ఏఐ తీసిచ్చిన ఫొటోలను షేర్ చేసేముందు ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. వీటిని వెరిఫై చేయడానికి నమ్మకమైన టూల్స్‌ని మాత్రమే ఉపయోగించాలి.





తెలుగు రాష్ట్రాల్లో సుమారు 6 లక్షల మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వీరిలో చాలా మంది రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్‌ఎస్) నుంచి శిక్షణ పొందిన వారే! ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటల వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతోందని అధ్యయనాలు చెబుతున్నాయంటారు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ **అడిదం నీరజ.** వినూత్నమైన ఆలోచనలతో మరింత ఎక్కువ మంది రైతులను సహజ వ్యవసాయం వైపు మళ్లించే ప్రయత్నాలు చేస్తున్న నీరజను 'నవ్య' పలకరించింది.

ప్రకృతి వ్యవసాయంతోనే మనిషికి ఆరోగ్యం

"నేను పుట్టింది విజయవాడ దగ్గర. చదివింది ఆంధ్ర యూనివర్సిటీలో. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్) వచ్చిన తర్వాత ఉత్తరప్రదేశ్ వెళ్లిపోయాను. కేంద్ర ప్రభుత్వంలో సెక్రటరీగా రిటైరయ్యాను. గత 75 ఏళ్లలో ఐఎఫ్ఎస్ నుంచి ఇప్పటి దాకా ఇద్దరికే పూర్తిస్థాయి హోదా వచ్చింది. అందులో రెండో వ్యక్తిని నేనే! నేను కేంద్రంలో వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నప్పుడు 'సేంద్రియ వ్యవసాయం.. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అనేక స్కీమ్‌లు ప్రారంభించాం. వీటి ద్వారా మన దేశంలో ఉన్న రకరకాల వ్యవసాయ పద్ధతులు.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలిసింది. ఆ తర్వాత ఎరువుల శాఖలో అడిషినల్ సెక్రటరీగా పనిచేస్తున్నప్పుడు మన దేశంలో రసాయన ఎరువుల వినియోగం ఎంత తీవ్రంగా ఉందో.. దాని వల్ల కలిగే సమస్యలేమిటో అర్థమయింది. ప్రతి సీజన్‌లోను ఎరువులకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయేది. అప్పుడు మన రైతులు రసాయన ఎరువులపై ఎంత ఆధారపడ్డారో తెలిసింది. దీనికి ప్రత్యామ్నాయం కేవలం ప్రకృతి వ్యవసాయమే అనే స్పష్టత కూడా వచ్చింది.

9 మూల సిద్ధాంతాలు..

నాకు ఆర్‌వైఎస్ఎస్ గురించి చాలా కాలంగా తెలుసు. సంస్థ చైర్మన్ విజయకుమార్ గారు మాజీ ఐఏఎస్. ఆయన రైతుల మనిషి. వారితో మమేకమై పనిచేసే మనిషి. రసాయన ఎరువులపై ఆధారపడిన రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించటం అంత సులభం కాదు. ఈ విషయంలో ఆయన అసాధారణమైన కృషి చేస్తున్నారు. అందుకే నేను రిటైరైన తర్వాత ఆర్‌వైఎస్ఎస్‌లో ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌గా చేరాను. ప్రస్తుతం మా సంస్థలో ఆరు లక్షల మంది రైతులు భాగస్వాములుగా.. సుమారు ఆరు లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. తొమ్మిది మూల సిద్ధాంతాలపై ఆధారపడి ఆర్‌వైఎస్ఎస్ పనిచేస్తుంది. ఆవు మూత్రం, పేడ, ఇతర పదార్థాలను వినియోగించి జీవామృతం, ద్రవామృతం, కషాయాలను ఎలా తయారుచేయాలో ఆర్‌వైఎస్ఎస్ సిబ్బంది రైతులకు నేర్పిస్తారు. పంటను అమ్మేందుకు ఉన్న అవకాశాలను వారికి వివరిస్తారు. ఈ క్రమంలో ఆర్‌వైఎస్ఎస్ రైతులు తమ కాళ్ల మీద తామే నిలబడేలా చేస్తుంది. మా ఉద్దేశంలో- ప్రోత్సాహకాలు ఇవ్వటం కన్నా.. వారికి విజ్ఞానాన్ని అందించి.. స్వయంసమృద్ధి కలిగేలా చేయటమే ముఖ్యం. అదే మా సిద్ధాంతం. అంతే కాదు. మా సంస్థను రైతులే నడుపుతారు. వారే తమ సహరైతులకు శిక్షణ ఇస్తూ ఉంటారు. దీని కోసం వారు రకరకాల మోడల్స్‌ను తయారుచేశారు. ఉదాహరణకు రాయలసీమలో ఎక్కువ వర్షాలు పడవు. అందువల్ల అక్కడ భూమి, వాతావరణ పరిస్థితులకు తగినట్టుగా మోడల్స్‌ను తయారుచేసి అందిస్తారు. దీని వల్ల వారికి ఎక్కువ దిగుబడి లభిస్తుంది. ఇక ప్రకృతి వ్యవసాయంలో అనుసరించే విధానాల వల్ల భూమిలో సారం, పంట దిగుబడులు పెరుగుతాయి. రైతుకు ఆదాయం కూడా



పెరుగుతుంది. రసాయనాలు, రసాయన ఎరువులు లేని ఆహార ఉత్పత్తులు తీసుకోవటం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగవుతుంది. ఇలా సమాజంలోని అందరికీ ఏదో ఒక మేలు జరుగుతుంది. ఇక్కడ ఇంకో ముఖ్యమైన విషయం చెప్పాలి. ఆర్‌వైఎస్ఎస్ అనుసరిస్తున్న విధానాన్ని కేంద్ర ప్రభుత్వం- 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్'- పేరిట దేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ అమలు చేయటానికి ప్రయత్నాలు ప్రారంభించింది. కేవలం కేంద్ర ప్రభుత్వమే కాదు.. అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా ఆర్‌వైఎస్ఎస్‌తో కలిపి పనిచేస్తున్నాయి. ప్రస్తుతం 15 రాష్ట్రాలలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఆరోగ్యంపై కూడా దృష్టి..

ఒకవైపు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు ఆ విధంగా పండించిన ఆహారాన్ని తింటే ఎటువంటి ఫలితాలు వస్తున్నాయన్న అంశంపై అధ్యయనాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం 400 గ్రామాల్లోని మహిళలతో కలిసి ఆర్‌వైఎస్ఎస్ పనిచేస్తోంది. వారికి కిచెన్ గార్డెన్స్ ఎలా ఏర్పాటు చేసుకోవాలి.. ఫుడ్ బాస్కెట్స్ వల్ల ప్రయోజనాలేమిటనే విషయంపై అవగాహన కల్పిస్తున్నాం. ఒక కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే- గృహిణికి ఆహారపదార్థాల పట్ల అవగాహన అవసరం. ఇటీవల ఆర్‌వైఎస్ఎస్‌తో కలిపి మంగళగిరి ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్లు కొన్ని పరిశోధనలు చేశారు. వీరి అధ్యయనంలో ఎటువంటి రసాయనాలు లేని ఆహారపదార్థాలు తిన్న గర్భిణుల లోనూ, చిన్నారులలోనూ హిమోగ్లోబిన్ శాతం పెరిగింది. అంటే సహజమైన ఆహార ఉత్పత్తులను క్రమం తప్పకుండా తింటే ఆరోగ్యసమస్యలు కూడా రావు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన పెరిగితే అనేక ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. కేవలం రక్తహీనత వంటి సమస్యలే కాకుండా రసాయన ఎరువుల ద్వారా పండించే పంటల వల్ల క్యాన్సర్ వంటి సమస్యలు వస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనిపై ప్రజల్లో అవగాహన పెరిగితే వారు ప్రతి రోజు తినటం మొదలుపెడతారు. దీని వల్ల ఈ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. డిమాండ్ పెరిగితే రైతులు ముందుకు వచ్చి పంటలు పండించటం మొదలుపెడతారు. అందుకే మేము రైతుల్లోనే కాకుండా.. ప్రజల్లో కూడా అవగాహన పెంచటానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

● **బూటు శ్రీనివాస్,** విశాఖపట్నం
ఫొటోలు: **రఫీ**

వేడుక



నేడు అట్ల బతుకమ్మ

బతుకమ్మ వేడుకల్లో అయిదో రోజైన ఆశ్వయుజ శుద్ధ చవితి (గురువారం) నాడు బియ్యాన్ని నానబెట్టి, దంచి చేసిన అట్లను గౌరమ్మకు నివేదిస్తారు. కాబట్టి 'అట్ల బతుకమ్మ' అని పిలుస్తారు. ఈ రోజున చామంతి, మందార, బీర, తంగేడు, గునుగు, గుమ్మడి తదితర పూలతో అయిదు ఐదు ఎత్తుల్లో బతుకమ్మను పేరుస్తారు.

నైవేద్యం:
బియ్యం పిండితో చేసిన అట్లు

కౌన్సెలింగ్

డాక్టర్! నాకు 30 ఏళ్లు. గర్భధారణ తర్వాత నెలసరి ఆగిపోయినా, అప్పుడప్పుడూ ఎంతో తక్కువగా రక్తస్రావం కనిపిస్తోంది. ఇలా ఎందుకు జరుగుతోంది? ఇది సహజమేనా?

ఓ సోదరి, హైదరాబాద్

గర్భధారణ - రక్తస్రావం

వైద్య పరిభాషలో దీన్ని 'స్పాటింగ్' అంటారు. పది శాతం ఆరోగ్యకరమైన గర్భిణుల్లో ఈ లక్షణం కనిపిస్తుంది. అయితే ఈ లక్షణం తీవ్రత, పర్యవసానాలు, గర్భధారణ తర్వాతి తొలి, మలి నెలల మీద ఆధారపడి ఉంటాయి. గర్భం దాల్చిన తొలినాళ్లలో తేలికపాటి ఇంప్లాంటేషన్ బ్లీడింగ్ కనిపించవచ్చు. లేదా గర్భాశయ ముఖద్వారం దగ్గర బిడ్డ పక్కనే చిన్న రక్తపు గడ్డ ఏర్పడవచ్చు. అయితే ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ లేదా గర్భస్రావం మాదిరిగా ఈ రెండు పరిస్థితులూ ప్రమాదకరమైనవి కావు. అయితే గర్భం దాల్చిన చివరి నెలల్లో ఇలాంటి స్పాటింగ్ గర్భస్రావాన్నీ, నెలలు నిండకుండా జరిగిపోయే ప్రసవాన్నీ సూచిస్తాయి. అలాగే ప్లాసెంటా ప్రీవియా అనే పరిస్థితి కారణంగా జరగబోయే తీవ్ర రక్తస్రావాన్ని కూడా ఇది సూచిస్తుంది. కాబట్టి గర్భిణుల్లో చుక్కలుగా రక్తస్రావం జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రతించి, గర్భస్రావాన్ని నివారించుకోవడం కోసం, గర్భంలో బిడ్డ పరిస్థితి, ప్లాసెంటా ఉన్న ప్రదేశాన్ని తెలుసుకోవడంతో పాటు, స్కానింగ్ కూడా పరీక్షించుకోవాలి.



డాక్టర్ శ్రుతి రెడ్డి పొద్దుటూరు,
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్,
గైనకాలజిస్ట్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో, హైదరాబాద్.



ఉపవాస విందు ఇలా..

దసరా నవరాత్రుల సందర్భంగా మహిళలు ఉపవాసం ఉంటూ అమ్మవారిని అర్చిస్తుంటారు. ఉపవాసం కారణంగా శరీరం నీరసించి అలసటగా అనిపిస్తుంటుంది. అలాంటి సమయాల్లో తక్షణ శక్తిని అందించడంతోపాటు తినదగిన వంటకాల తయారీ మీకోసం...



గురువారం

కుట్టు పరాటా- మఖానా మఖనీ గ్రేవీ




ఒక గిన్నెలో కుట్టు పిండి, ఉప్పు వేసి నీళ్లు చల్లుకుంటూ చపాతీ పిండిలా కలపాలి. దీన్ని చిన్న ఉండలుగా చేసి పరాటాలు పామాలి. స్టవ్ మీద పాన్ పెట్టి నూనె రాసి పరాటాలు వేసి రెండువైపులా దోరగా కాల్చాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి వెన్న, లవంగాలు, ఏలకులు, జీలకర్ర, గరం మసాల పొడి, కసూరి మేథీ వేసి రెండు నిమిషాలపాటు వేయించాలి. తరవాత టమాటా ప్యూరీ వేసి దగ్గరకు వచ్చేదాకా ఉడికించాలి. ఆపైన క్రీమ్, వేయించిన మఖానా వేసి పాలు పోసి బాగా కలపాలి. తరవాత ఉప్పు కలిపి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మఖానా గ్రేవీని కుట్టు పరాటాతో కలిపి తింటే రుచిగా ఉంటుంది.

శుక్రవారం

మఖానా ఖీర్

చిన్న గిన్నెలో కొన్ని వేడిపాలు పోసి కుంకుమపువ్వు రేకులు వేసి నానబెట్టాలి. స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. ఆపైన మఖానా వేసి కలుపుతూ దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. అవి చల్లారాక చేత్తో కచ్చాపచ్చాగా మెదపాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి మరిగించాలి. తరవాత మఖానా మిశ్రమం వేసి ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. అందులో బెల్లం తురుం, యాలకుల పొడి, కుంకుమ పువ్వు రేకుల మిశ్రమం, వేయించిన బాదం-జీడిపప్పుల పలుకులు వేసి మెల్లగా కలపాలి. ఈ ఖీర్‌ను వేడిగా, చల్లగా కూడా తినవచ్చు.



శనివారం

స్వీట్ పొటాటో- సాబుదాన టిక్కీ



సగ్గుబియ్యంలో నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. దనిసి గడ్డలను శుభ్రంగా కడిగి మెత్తగా ఉడికించాలి. ఆపైన వెడల్పాటి గిన్నెలో వేసి మెత్తగా మెదపాలి. అందులో నానబెట్టిన సగ్గుబియ్యం, కచ్చాపచ్చాగా దంచిన వేరుశనగ పప్పు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తురుం, కొత్తిమీర తరుగు, ఉప్పు, జీలకర్ర పొడి, నిమ్మరసం వేసి ముద్దలా కలపాలి. అరచేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని పై మిశ్రమాన్ని చిన్న టిక్కీల మాదిరి చేసి పెట్టుకోవాలి. స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి రాసి టిక్కీలు పేర్చి రెండు వైపులా దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఈ టిక్కీలను గ్రీన్ చట్నీతో తినవచ్చు.

ఆదివారం

కుట్టు పూరీ- జీరా ఆలు

కుట్టు పిండి (చిలగడ దుంపల పిండి)లో ఉప్పు వేసి వేడి నీళ్లు చల్లుతూ ముద్దలా కలపాలి. ఈ పిండిని కొద్ది కొద్దిగా తీసుకుంటూ పూరీలు పామాలి. స్టవ్ మీద మూకుడు పెట్టి నూనె పోసి వేడిచేయాలి. అందులో పూరీలు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి కొద్దిగా నెయ్యి, జీలకర్ర, పచ్చి మిర్చి ముక్కలు వేసి వేయించాలి. తరవాత ఉడికించి తొక్కతీసిన ఆలు గడ్డ ముక్కలు, ఉప్పు వేసి టాస్ చేస్తూ కలపాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి దించాలి. కుట్టు పూరీలను జీరా ఆలు కూరతో కలిపి తింటే రుచి బాగుంటుంది.



సోమవారం

స్వీట్ పొటాటో- కుట్టు పిజ్జెట్స్



ఒక గిన్నెలో పన్నీర్ తురుం, ఉడికించిన ఆలు గడ్డల ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, పుదీనా తరుగు, కొత్తిమీర తరుగు, కొద్దిగా క్రీమ్, మిరియాల పొడి, ఉప్పు వేసి కలిపి పెట్టుకోవాలి. దనిసి గడ్డలను ఉడికించి వెడల్పాటి గిన్నెలో వేసి మెత్తగా మెదపాలి. అందులో కుట్టు పిండి, ఉప్పు, నెయ్యి వేసి వేడి నీళ్లు చల్లుతూ ముద్దలా కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న బిళ్లలు చేయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి కొద్దిగా నూనె రాసి ఈ బిళ్లలు పరిచి రెండు వైపులా దోరగా వేయించాలి. ఈ బిళ్లల మీద కొద్దిగా పన్నీర్-ఆలుగడ్డ ముక్కల మిశ్రమం ఉంచి రెండు నిమిషాలు మగ్గించి పళ్లెంలోకి తీయాలి.



అష్టలక్ష్మి చంద్రవంక కంఠిని టీటీడీ చైర్మన్‌కు అందిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి కుటుంబం

శ్రీవారికి అష్టలక్ష్మి చంద్రవంక కంఠి

» విరాళంగా అందజేసిన ఎంపీ కొండా కుటుంబం



తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి 60 లక్షల విలువైన 535 గ్రాముల బంగారు అష్టలక్ష్మి చంద్ర వంక కంఠి విరాళంగా అందింది. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కుటుంబం, జేకేఎంఆర్ ఫౌండేషన్ కలిసి ఈ చంద్రవంక కంఠిని స్వామివారికి సమర్పించాయి. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు కొండా రామచంద్రా రెడ్డి, డాక్టర్ మీరా రెడ్డి, గౌతమి రెడ్డి కలిసి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి ఈ అష్టలక్ష్మి చంద్ర వంక కంఠిని రంగనాయక మండపంలో మంగళవారం అందజేశారు.

శ్రీవారికి రూ.3.86 కోట్ల స్వర్ణ యజ్ఞోపవీతం

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి బుధవారం రూ.3.86 కోట్ల విలువైన స్వర్ణ యజ్ఞోపవీతం విరాళంగా అందింది. విశాఖపట్నానికి చెందిన హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ పువ్వాడ మస్తాన్ రావు, కుంకుమరేఖ దంపతులు దీనిని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి అందజేశారు. 3.86 కిలోల బంగారంతో చేసిన ఈ యజ్ఞోపవీతంలో విలువైన వజ్రాలు పొదిగారు.

ఉదయం 10.30 అయినా ఆయిల్‌ఫెడ్ కార్యాలయానికి రాని ఉద్యోగులు

» మెమోలు జారీ చేయాలని ఎండీకి తుమ్మల ఆదేశం

» సకాలంలో హాజరుకాకుంటే చర్యలుంటాయని హెచ్చరిక



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్‌ఫెడ్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10.30 గంటలకు ఆయన ఆయిల్‌ఫెడ్ కార్యాలయానికి వెళ్లేసరికి పలువురు ఉద్యోగులు ఇంకా రాలేదు. దీంతో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో విధులకు హాజరుకాని ఉద్యోగులకు మెమోలు జారీ చేయాలని ఎండీ శంకరయ్యను ఆదేశించారు. వ్యవసాయశాఖ ప్రధాన కార్యాలయంతో పాటు అనుబంధ కార్పొరేషన్లలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగుల రోజువారీ హాజరు వివరాలు లైవ్ అప్‌డేట్ ఉండేలా డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుకు సూచించారు. కాగా ఆయిల్‌ఫెడ్‌లో త్వరలో కొత్త ఉద్యోగుల నియామకాలు చేపట్టబోతున్నామని, దీంతో ఆయిల్‌ఫెడ్ మరింత బలోపేతమవుతుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్‌ఫెడ్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అన్నిజిల్లాల్లో విజయ ఎడిబుల్ ఆయిల్ అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని, కొత్తగా నిర్మిస్తున్న మెగా ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సిద్దిపేటలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో ప్రారంభిస్తారని, అదేరోజు రిఫైనరీ యూనిట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని తుమ్మల తెలిపారు.

గ్రూప్-1 నియామకాలకు పచ్చజెండా

(మొదటిపేజీ తరువాయి)

వరకూ ఎందుకీ పరీక్ష నిర్వహించలేదు.. 2014 నుంచి రాష్ట్రంలో కమిషన్ లేదా?" అని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కాగా.. ద్విసభ్య ధర్మాసనం జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులతో టీజీపీఎస్సీకి భారీ ఊరట లభించినట్లయింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనంలో లోపాలు, డబుల్ హాల్‌టికెట్లు, పరీక్షా కేంద్రాల కేటాయింపు, కొన్ని సెంటర్లలో ఎక్కువ మంది ఎంపిక కావడం, ఎంపిక చేసిన అభ్యర్థులను కొన్ని సెంటర్లకు కేటాయించడం, తెలుగు మాధ్యమ అభ్యర్థులపై వివక్ష, ఎవాల్యుయేటర్ల ఎంపికలో లోపాలు వంటి కారణాలను చూపుతూ.. ఆ పరీక్ష ఫలితాలను రద్దుచేయాలంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకుల జాబితాను కొట్టేస్తూ ఈ నెల 9న 222 పేజీల తీర్పు వెలువరించింది. అయితే.. ఆ తీర్పు తప్పులతడకగా ఉందని, అది చెల్లదని పేర్కొంటూ టీజీపీఎస్సీతో పాటు ఎంపికైన అభ్యర్థులు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో మొత్తం 15 రిట్ అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. టీజీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి, కమిషన్ స్టాండింగ్ కౌన్సిల్ పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపించారు. 'గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో భారీగా తప్పులు జరిగాయనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు. చిన్న చిన్న కారణాలను సాకుగా చూపుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. వాటన్నింటికీ శాస్త్రీయంగా పూర్తి వివరాలతో టీజీపీఎస్సీ సమాధానం చెప్పింది. సింగిల్ జడ్జి ఆ విషయాలను పట్టించుకోకుండా ఫలితాలను రద్దు చేశారు. పునర్ మూల్యాంకనం అనేది కమిషన్ రూల్స్‌లో లేనే లేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన 'సంజయ్‌సింగ్ వర్సెస్ యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్' తీర్పు ప్రకారం మోడరేషన్ పద్ధతి అమలు చేయలేదని సింగిల్ జడ్జి రూలింగ్ ఇవ్వడం సరి కాదు. ఒక్కో సమాధాన పత్రాన్నీ ఇద్దరు ఎవాల్యుయేటర్లు దిద్దుతారు. వారు ఇచ్చిన మార్కుల మధ్య 15 శాతం కంటే ఎక్కువ వ్యత్యాసం ఉంటే సదరు సమాధాన పత్రం మూడో ఎవాల్యుయేటర్ వద్దకు వెళ్తుంది. మొత్తం సెంటర్లు 45 అని ముందు ప్రకటించి 46కు పెంచడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఒక సెంటర్ ఏర్పాటు చేయాల్సి రావడం వల్ల అలా జరిగింది. అలాగే కోఠి ఉమెన్స్ కాలేజీలో 18, 19 సెంటర్లలో కేవలం మహిళలే ఉండటానికి కారణం.. అక్కడ పురుషలకు టాయిలెట్ సౌకర్యాలు లేవు. కేవలం మహిళలను మాత్రమే కేటాయించాలని సదరు కాలేజీ చేసిన విజ్ఞప్తి మేరకు అక్కడ మహిళలను మాత్రమే కేటాయించారు. ఇవన్నీ కమిషన్ అధికార పరిధిలోని అంశాలు. వీటి వల్ల పిటిషనర్లకు కలిగిన నష్టం ఏంటో నిరూపించలేదు' అని పేర్కొన్నారు.

ఆధారాలెక్కడ?

విచారణ సందర్భంగా ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ, భారీ లోపాలపై ప్రశ్నించింది. "డబుల్ హాల్‌టికెట్లు, సెంటర్ల పెంపు, ప్రత్యేకంగా మహిళల కేటాయింపు వంటివి కమిషన్ పరిధిలోని అంశాలు.. వాటి ఆధారంగా ఫలితాలను ఎలా కొట్టేయగలం? ఫలితాలను కొట్టేయడానికి ఈ చిన్న విషయాలు కారణాలా? సింగిల్ జడ్జి తీర్పులో పేర్కొన్న విధంగా సమగ్రత లేదనడానికి, వివక్ష, విధానపరమైన లోపాలు వంటి అంశాలకు ఆధారాలు ఎక్కడ ఉన్నాయి?" అని ప్రశ్నించింది. అలాంటివేవీ లేకుండానే ఫలితాలను కొట్టేశారని ఏజీ సమాధానం ఇచ్చారు. ఒకే సబ్జెక్టును తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో రాసే అభ్యర్థుల పేపర్లను ఎలా దిద్దుతారని ధర్మాసనం ప్రశ్నించగా.. ఏ మాధ్యమంలో రాసినా అభ్యర్థుల ప్రతిభను బట్టి కచ్చితమైన మార్కులు ఇవ్వడానికి ఎవాల్యుయేటర్లు, చీఫ్ ఎగ్జామినర్లు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ ఇచ్చారని.. ఏజీ బదులిచ్చారు. టీజీపీఎస్సీ తరఫున మరో సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదిస్తూ.. అన్ని చిన్న చిన్న విషయాలే తప్ప మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ వంటి భారీ ఆరోపణలు లేనేలేవని పేర్కొన్నారు. ఏపీలో తెలుగు మాధ్యమ అభ్యర్థులు తెలంగాణ కంటే ఇంకా తక్కువ శాతం ఎంపికయ్యారని గుర్తుచేశారు.

తప్పుగా అర్థం చేసుకున్నారు..

ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్ మురళీధర్, దేశాయి ప్రకాశ్‌రెడ్డి, న్యాయవాదులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు వాదించారు. టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణలో పాటించిన విధానమే తప్పు అనుకున్నప్పుడు.. రీఎవాల్యుయేషన్ చేయడం వల్ల ఆ తప్పులన్నీ ఒప్పు అవుతాయా? అని వారు ప్రశ్నించారు. పేర్కొన్నారు. సింగిల్ జడ్జి కమిషన్ అధికార పరిధిలోకి చొచ్చుకుపోయారని.. ఆయన తీర్పును అమలు చేస్తే భవిష్యత్తులో పరీక్షలపై విపరీతమైన కేసులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలిపారు. రెండు హాల్‌టికెట్లు ఇవ్వడం అనేది కమిషన్ విచక్షణపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.

సింగిల్ జడ్జి వద్ద కేసు గెలిచిన రిట్ పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు జి.విద్యాసాగర్, రచనారెడ్డి, సురేందర్‌రావు వాదనలు కొనసాగించారు. రూల్స్‌లో లేనివిధంగా మూడో ఎవాల్యుయేటర్ ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. మూడో ఎవాల్యుయేటర్ ఉన్నట్లు కమిషన్ ఎక్కడా చెప్పలేదని.. ఇదంతా ఫ్రాడ్ చేయడానికి డిజైన్ చేశారని ఆరోపించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. "మొత్తం ప్రొసీజర్ తప్పు అన్నప్పుడు పునర్ మూల్యాంకనం వల్ల లాభం ఏంటి?" అని ప్రశ్నించింది. దీనికి సీనియర్ న్యాయవాది సురేందర్‌రావు సమాధానం ఇస్తూ.. అసలు మూల్యాంకనమే జరగలేదని.. ఒక్కో సమాధానానికి కాకుండా ఒక్కో అభ్యర్థికి మార్కులు కేటాయించారని పేర్కొన్నారు. అభ్యర్థులు రాసిన సమాధానాలు తప్పో లేదా ఒప్పో చెప్పకుండా అభ్యర్థుల వారీగా మార్కులు కేటాయించారని తెలిపారు. పేపర్లు దిద్దకుండా మార్కులు కేటాయించారని ఆరోపించారు. కాబట్టి మళ్లీ పేపర్లు దిద్దితే అది పునర్ మూల్యాంకనం కాదని.. అది తాజా మూల్యాంకనమే అవుతుందని పేర్కొన్నారు.

పేపర్లు దిద్దకుండానే..

అయితే.. అసలు మూల్యాంకనమే జరగలేదన్న వాదనను అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. భౌతికంగా సమాధాన పత్రాల్లోని ఒక్కో పేజీపై రెడ్ పెన్‌తో గీత గీసి మార్కులు అక్కడ రాస్తారా? ఇదేమి వాదన అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మళ్లీ రెండో ఎవాల్యుయేటర్ పేపర్ దిద్దేటప్పుడు ఎలా? ఆయన కూడా మళ్లీ గీతలు గీయాలా? అడ్డంగా నిలువుగా గీతలు గీసి మార్కులు రాస్తారా? చిన్న పిల్లల పేపర్లు దిద్దినట్లు గీతలు గీస్తేనే సమాధాన పత్రాల మూల్యాంకనం చేసినట్లు భావించాలనే వాదన ఏంటని అని ఏజీ ప్రశ్నించారు. సీనియర్ న్యాయవాది రచనారెడ్డి తన వాదనను కొనసాగిస్తూ.. కమిషన్ తన నోటిఫికేషన్‌లోని రూల్స్‌ను తానే ఉల్లంఘించిందని పేర్కొన్నారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. సమగ్రత లేకపోవడం అనేది తీవ్రమైన, గంభీరమైన ఆరోపణ అని దానికి ఎక్కడ ఆధారాలు ఉన్నాయో చూపాలని రచనారెడ్డిని ప్రశ్నించింది. నిపుణులు మాత్రమే చేయాల్సిన పనుల్లోకి కోర్టులు ఎలా దూరగలవని ప్రశ్నించింది. అందరి వాదనలు విన్న అనంతరం.. కీలకమైన విషయాలతో లఘు నోట్ ఇవ్వాలని ఇరు పక్షాలనూ ఆదేశించింది. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చుకోవచ్చని.. అయితే ఆ నియామకాలు తమ తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టంచేస్తూ.. తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది.

గ్రూప్-1 తుది జాబితా విడుదల

» 45 మంది డిప్యూటీ కలెక్టర్లు, 115 డీఎస్పీలు సహా..

562 మందితో జాబితా విడుదల చేసిన టీజీపీఎస్సీ

» హైకోర్టు తీర్పుతో అర్ధరాత్రి వెల్లడించిన కమిషన్

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షల ఫలితాలకు సంబంధించి టీజీపీఎస్సీ తుది జాబితాను విడుదల చేసింది. రాష్ట్ర హైకోర్టు బుధవారం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో అర్ధరాత్రి తుది జాబితాను సిద్ధం చేసింది. మొత్తం 563 పోస్టుల కోసం ఇప్పటికే 600 మందిని ఎంపికచేసిన కమిషన్.. వారి ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ప్రక్రియను పూర్తిచేసింది. తుది జాబితా ప్రకటించబోయే సమయంలో కోర్టు స్టే ఇవ్వడంతో ప్రక్రియ నిలిచిపోయింది. నియామక ప్రక్రియ ప్రారంభించవచ్చని బుధవారం కోర్టు తీర్పు ఇవ్వడంతో.. వెంటనే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికే ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసుకున్న వారిలో 563 మందికి వారి ర్యాంకుల ఆధారంగా తుది జాబితా సిద్ధం చేసి అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టారు. 562 మందిని ఎంపిక చేసి.. ఒక పోస్టును పెండింగ్‌లో ఉంచారు. తుది జాబితాలో 45 డిప్యూటీ కలెక్టర్, 115 డీఎస్పీ పోస్టులతోపాటు వివిధ శాఖల్లోని మొత్తం 563 పోస్టులకు సంబంధించిన ఎంపిక ప్రక్రియ బుధవారం అర్ధరాత్రి పూర్తయింది. దీనికి సంబంధించి అభ్యర్థులకు టీజీపీఎస్సీ సమాచారం అందించింది. ర్యాంకులవారీగా పోస్టులు కేటాయించారు. తుది జాబితా విడుదల కావడంతో.. ఎంపికైనవారు తమకు కేటాయించిన శాఖల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

టాప్-10 ర్యాంకర్లు వీరే.. (డిప్యూటీ కలెక్టర్లు)

1. లక్ష్మీదీపిక, 2. వెంకటరమణ,
3. వంశీకృష్ణారెడ్డి, 4. తేజస్విని, 5. రుతిక,
6. హర్షవర్ధన్, 7. అనూష, 8. నిఖిత,
9. భవ్య, 10. శ్రీకృష్ణసాయి

ఆ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయండి

16 ప్రాజెక్టుల జీవోతో పాటు పత్రాలు.. ట్రిబ్యునల్‌కు అందించిన తెలంగాణ

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం, జూరాల, నాగార్జునసాగర్, ఆకేరువాగు కేంద్రంగా చేపట్టిన 16 ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలని కృష్ణా ట్రిబ్యునల్‌ను తెలంగాణ కోరింది. కృష్ణాలో 904 టీఎంసీలను తెలంగాణకు కేటాయించేలా వాదనలు వినిపించాలని, ఆ మేరకు ప్రాజెక్టుల నిర్మాణాల కోసం అవసరమైన సమగ్ర ఇన్వెస్టిగేషన్లు, ప్రాజెక్టుల సామర్థ్యం పెంపు, డీపీఆర్‌లు సిద్ధం చేయడంపై దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం విదితమే. ఆ ఆదేశాలతో రాష్ట్రంలో 16 ప్రాజెక్టుల డీపీఆర్‌లు సిద్ధం చేయడానికి వీలుగా జీవో నెం.34ను జారీ చేయగా.. ఆ జీవోను బుధవారం వాదనల సందర్భంగా ట్రిబ్యునల్‌కు అందించారు. ట్రిబ్యునల్‌లో రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపై విచారణ జరుగుతున్న విషయం విదితమే. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలతో పాటు పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీలకు బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు ఆ మేరకు నీటిని వినియోగించుకోవచ్చనే స్వేచ్ఛతో కేటాయించిన దానిలో 45 టీఎంసీలతో పాటు జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కేటాయించిన జలాలన్నీ కలుపుకొని మొత్తం 1,050 టీఎంసీలపై ప్రస్తుతం వాదనలు జరుగుతున్నాయి. ట్రిబ్యునల్ విచారణ గురువారంతో ముగియనుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఓజీ చిత్రానికి షాక్

● టికెట్ ధరల పెంపును రద్దు చేసిన తెలంగాణ హై కోర్టు



ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా టికెట్ ధరల పెంపునకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను హైకోర్టు సస్పెండ్ చేసింది. అలాగే, ఓజీ సినిమాకు సెన్సార్ ఏ సర్టిఫికెట్ ఇచ్చిన నేపథ్యంలో 18 ఏళ్లలోపు పిల్లలను సినిమాకు అనుమతించరాదని, వారికి టికెట్లు విక్రయించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. 'ఓజీ' సినిమా టికెట్ ధరలు పెంచుకునేలా హోంశాఖ ముఖ్యకార్యదర్శి ఈ నెల 19న జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ బర్ల మల్లేశ్ యాదవ్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. 2021లో రాష్ట్ర ప్రభుత్వం టికెట్ ధరలను నిర్ధారిస్తూ జీవో 120 జారీ చేసిందని.. సదరు జీవో ప్రకారమే టికెట్ రేట్లు వసూలు చేయాలని ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసిందని గుర్తు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రీమియర్ షోకు ఒక్కో టికెట్‌కు రూ.800, అక్టోబరు 4 వరకు ప్రదర్శించే మిగితా షోలకు టికెట్ ధరలు పెంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం జారీ చేసిన మెమోను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే 18 ఏళ్లలోపు పిల్లలకు ఓజీ సినిమా టికెట్లు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ అక్టోబరు 9కి వాయిదా పడింది.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)



దసరా నవరాత్రుల సందర్భంగా వారాహి అమ్మవారిపై చిత్రీకరించిన పాట 'వారాహి శరణు'. రంగనాథ్, సర్వజ్ఞ ఈ పాటను చిత్రీకరించగా, మాతంగి మూవీ మేకర్స్‌పై ధాత్రి నిర్మించారు. త్వరలోనే పాటను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ పాటకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ధాత్రి మాట్లాడుతూ 'మాకెంతో ఇష్టమైన వారాహి దేవికి ఈ పాటను భక్తిశ్రద్ధలతో అంకితం ఇస్తున్నాం. ఇప్పటికే పలు ప్రాజెక్ట్‌లను మొదలుపెట్టాం. మా సినీ ప్రయాణానికి అమ్మవారి ఆశీస్సులు తోడుంటాయని ఆశిస్తూ ఈ పాటను రూపొందించాం' అని చెప్పారు.

జైలర్ సాబ్ వచ్చేది అప్పుడే!



రజనీకాంత్ హీరోగా 2023లో వచ్చిన 'జైలర్' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో దీనికి కొనసాగింపుగా 'జైలర్ 2' తెరకెక్కుతోంది. ప్రస్తుతం చిత్రబృందం కేరళలో మరో షెడ్యూల్‌ను పూర్తి చేసింది. నెల రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్‌లో పాలక్కాడ్‌లో భారీ పోరాట ఘట్టాలతో సాగే క్లైమాక్స్ సీక్వెన్స్‌ను తెరకెక్కించారు. షూటింగ్ పూర్తవడంతో రజనీకాంత్ కేరళ నుంచి చెన్నై తిరిగొచ్చారు. ఈ చిత్రంలో రమ్యకృష్ణ, యోగిబాబు, ఎస్ జే సూర్య కీలకపాత్రలు పోషిస్తున్నారు. మోహన్‌లాల్, మిథున్ చక్రవర్తి అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. వచ్చే ఏడాది జూన్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

వినోదం పంచే భూతం



ఒక భూతం బారిన పడిన ఐదుగురు కుర్రాళ్లకు ఎదురైన భయానక అనుభవాల నేపథ్యంలో సృజన ప్రొడక్షన్స్ బేనర్‌పై బి. వెంకటేశ్వరరావు నిర్మించిన చిత్రం 'భూతం ప్రేతం'. రాజేశ్ ధృవ దర్శకుడు. యాదమ్మ రాజు, గల్లీబాయ్ భాస్కర్, గడ్డం నవీన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌ను బుధవారం దర్శకుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ప్రేక్షకులను నవ్వించడంతో పాటు ఉత్కంఠకు గురిచేసే థ్రిల్లింగ్ అంశాలతో ఈ చిత్రం తెరకెక్కింది అని దర్శకుడు తెలిపారు. ఈ ఏడాది ఆఖరిలో 'భూతం ప్రేతం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గిరీశ్ హోతుర్, సినిమాటోగ్రఫీ: యోగేశ్ గౌడ్.

భయపెట్టే లవ్‌స్టోరీ



నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆధ్యరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ చెలియా'. ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరా దేవి ప్రొడక్షన్స్ బేనర్స్‌పై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. బుధవారం నటుడు శ్రీకాంత్ టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. హారర్, లవ్, యాక్షన్ అంశాల మేళవింపుగా ఈ చిత్రం తెరకెక్కుతోందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ కాన్సెప్ట్ నేపథ్యంలో ఒక చక్కటి ప్రేమకథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాము, దెయ్యాల నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా కథ సాగుతుంది' అని తెలిపారు. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేసి, రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం కుమార్, సినిమాటోగ్రఫీ: సురేశ్ బాలా.

సిరిసిల్ల డీపీఆర్వో శ్రీధర్ సస్పెన్షన్

» ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై వాట్సా‌ప్‌లో పోస్ట్

సిరిసిల్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా పౌర సంబంధాల అధికారి వి. శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అధికారుల సంఘం వాట్సాప్ గ్రూప్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై వచ్చిన ఒక కార్టూన్‌ను శ్రీధర్ పోస్ట్ చేశారు. దీంతో బాధ్యతాయుతమైన జిల్లా అధికారి అయి ఉండి చట్టబద్ధమైన విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని, వివిధ సమూహాల మధ్య వివాదాలను కారణంగా చూపిస్తూ శ్రీధర్‌ను సస్పెండ్ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా జిల్లా నుంచి వెళ్లకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ మధ్య ప్రొటోకాల్ వివాదం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా అధికారుల సంఘం వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన పోస్ట్ సీరియస్‌గా మారినట్లు భావిస్తున్నారు.

సీడీఎస్ జనరల్ చౌహాన్ పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్), మిలటరీ వ్యవహారాల విభాగం కార్యదర్శి జనరల్ అనిల్ చౌహాన్ పదవీ కాలాన్ని మరో ఎనిమిది నెలలు పొడిగిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ నెల 30న పదవీ విరమణ చేయాల్సి ఉండగా, పదవీ కాలాన్ని వచ్చే ఏడాది మే 30వ తేదీ వరకు పొడిగించింది. ఆయన 2022 సెప్టెంబరు 30 నుంచి ఈ పదవిలో కొనసాగుతున్నారు.

71 మంది మావోయిస్టుల లొంగుబాటు

వారిలో 21 మంది మహిళలు, ముగ్గురు మైనర్లు

» 30 మందిపై రూ.64 లక్షల రివార్డు

» పోలీసులపై దాడులు, విధ్వంసక చర్యల్లో వారి ప్రమేయం



పోలీసు అధికారుల సమక్షంలో లొంగిపోయిన 71 మంది మావోయిస్టులు

చర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా పోలీసుల ఎదుట బుధవారం 71మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 21 మంది మహిళలతో పాటు ఓ బాలుడు (17), ఇద్దరు బాలికలు (16, 17) ఉన్నారు. వీరిలో 30 మందిపై రూ.64 లక్షల రివార్డు ఉంది. వీరు మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారు. బమన్ మడ్కం (30), మాంకీ అలియాస్ షమీలా మాండవి (20)లు ఒక్కొక్కరిపై రూ.8 లక్షల చొప్పున, గంగి అలియాస్ రోహిణీ బర్సే (25), దేవె అలియాస్ కవితా మాద్వి (25), సంతోష్ మాండవి (30)లు ఒక్కొక్కరిపై రూ.5 లక్షల చొప్పున, మిగతా వారిపై కూడా రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు రివార్డు ఉంది. పోలీసులపై జరిగిన పలు దాడుల్లో బమన్, షమీలా, గంగి ప్రమేయం ఉందని దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు. మిగతా మావోయిస్టులు రోడ్లు తవ్వేయడం, చెట్లు కూల్చేయడం, నక్సలైట్ల బ్యానర్లు కట్టడం, పోస్టర్లు అంటించడం, కరపత్రాలు పంచడం వంటి కార్యకలాపాల్లో పాల్గొన్నారని చెప్పారు. మావోయిస్టు పార్టీ డొల్ల సిద్ధాంతంతో విసిగిపోయామని లొంగిపోయినవారు తెలిపారని పేర్కొన్నారు. బస్తర్ రేంజ్ పోలీసులు ప్రారంభించిన పునరావాస కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త పునరావాస విధానం తమను ప్రభావితం చేశాయని చెప్పారని తెలిపారు. లొంగిపోయినవారికి రూ.50 వేల ఆర్థిక సహాయంతో పాటు పునరావాసం కల్పిస్తామన్నారు. గత 17 నెలల్లో బస్తర్ డివిజన్‌లో లాల్‌వర్రాట్ కార్యక్రమం కింద 1,113 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిలో 297 మందిపై రివార్డులు ఉన్నాయని ఎస్పీ చెప్పారు. లొంగిపోయినవారిలో దంతెవాడ జిల్లా నుంచి 461 మంది ఉన్నారన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేతలు రాజు దాదా అలియాస్ కట్టా రామచంద్రారెడ్డి (63), కోసా దాదా అలియాస్ కడారి సత్యనారాయణ రెడ్డి (67) మృతిచెందిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. తాజాగా వరుస లొంగుబాట్లతో పార్టీ మనుగడ కష్టంగా కనిపిస్తోంది.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

మద్యానికి బానిసలై బైకుల దొంగలుగా మారి..

» కరీంనగర్‌లో పోలీసులకు చిక్కిన ముగ్గురు మైనర్లు

» ముగ్గురూ ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటున్న ఇంటర్ విద్యార్థులే..

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురూ మైనర్లే.. కరీంనగర్‌లోని ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ ఇంటర్ చదువుతున్నారు. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన వీరు మద్యానికి బానిసలుగా మారారు. అయితే మద్యానికి సులభంగా డబ్బును సమకూర్చుకునే మార్గాలను అన్వేషించి టూవీలర్ల చోరీలను మొదలుపెట్టారు. కరీంనగర్ టౌన్, రూరల్ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద పార్క్ చేసే ద్విచక్రవాహనాలను చోరీ చేయడం వీరి టార్గెట్. ఆ ముగ్గుర్నీ కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.7 లక్షల విలువైన 13 స్ప్లెండర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు కరీంనగర్ రూరల్ ఏసీపీ జి.విజయసారథి విలేకరులకు తెలిపారు. కరీంనగర్ శివారులోని పెద్దపల్లి ఫ్లైఓవర్ వద్ద బుధవారం ఈ ముగ్గురూ ఓ బైక్‌పై అనుమానాస్పదంగా కనపడటంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. లోతుగా విచారణ చేయడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి, చల్మెడ, అపోలో రీచ్ ఆస్పత్రుల వద్ద 13 ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు వారు ఒప్పుకున్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

అబూజ్‌మాడ్ ఎన్‌కౌంటర్ బూటకం

» ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో కాత కుమారుడి పిటిషన్

» డీజీపీ, కలెక్టర్ ప్రభృతులకు ఈ-మెయిల్ ఫిర్యాదు

» పోలీసుల ఎన్‌కౌంటర్ కథ అబద్ధం

» మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ



తీగలకుంటపల్లిలో రామచంద్రారెడ్డికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కోహెడ/చర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మాడ్‌లో జరిగిన ఎదురు కాల్పుల ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఆరోపిస్తూ ఎదురు కాల్పుల్లో అశువులు బాసిన కాత రామచంద్రారెడ్డి కొడుకు.. ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పోలీసులు చెబుతున్న అబూజ్‌మాడ్ ఎన్‌కౌంటర్ కథ అబద్ధమని మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. తమ కేంద్ర కమిటీ (సీసీ) సభ్యులు కాత రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డిలను అరెస్టు చేసి, తర్వాత హత్య చేశారని ఆరోపించింది. 10 నెలల క్రితమే బాధ్యతలు అప్పగించడంతో వారు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారన్న మావోయిస్టు పార్టీ.. వారిద్దరు కొంతకాలంగా గెరిల్లా దళాలకు దూరంగా ఉన్నారని పేర్కొంది. రాయ్‌పూర్‌లోని వివిధ ప్రాంతాల్లో నిరాయుధులుగా ఉండగా ఈ నెల 11-20 తేదీల మధ్య అరెస్టు చేసి, పార్టీ సమాచారం కోసం పోలీసులు హింసించారని తెలిపింది. చివరకు ఈ నెల 22న అబూజ్‌మాడ్‌కు తీసుకొచ్చి ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారని మావోయిస్టు పార్టీ ధ్వజమెత్తింది. ప్రభుత్వం ముందు లొంగిపోయి.. ప్రస్తుతం డీఆర్‌జీలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తులే.. తమ సీసీ సభ్యుల సమాచారం పోలీసులకు ఇచ్చారని ఆరోపించింది. కోసా దాదా కొరియర్ సంగతిని వారే పోలీసులకు తెలిపారని, ఇంటి వద్దే ఉంటున్న కొరియర్‌ను గత నెల 13న పోలీసులు అపహరించుకుపోయారని మావోయిస్టు పార్టీ వెల్లడించింది. దీనివల్లే రాజుదాదాను పోలీసులు చేరుకోవడం తేలికైందన్నది. కొరియర్ గురించి ఈ నెల 9న తమకు రాసిన లేఖలో రాజుదాదా అన్ని విషయాలు తెలిపారని, లొంగుబాట్ల వల్ల ప్రమాదం పొంచి ఉందని సీసీ సభ్యులను హెచ్చరించారని పేర్కొంది. ఇదే చివరి లేఖ అని రాజు దాదా తన లేఖలో పేర్కొన్నారని గుర్తు చేసిన మావోయిస్టు పార్టీ.. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నట్లు వెల్లడించింది.

ఎవరూ లేకుండానే కాత పోస్టుమార్టం

తన తండ్రి మృతదేహానికి నూతన చట్టం ప్రకారం కుటుంబ సభ్యుల ముందు న్యాయమూర్తి సమక్షంలో నిర్వహించాల్సిన పోస్టుమార్టం.. ఎవరూ లేకుండానే పూర్తి చేశారని కాత రామచంద్రారెడ్డి తనయుడు రాజా చంద్ర 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. తన తల్లి శాంతి, బంధువులతో కలిసి తన తండ్రి మృతదేహం తేవడానికి ఛత్తీస్‌గఢ్ వెళ్లానన్నారు. ఎన్‌కౌంటర్ జరిగి 2 రోజులవుతున్నా మృతదేహాన్ని చూడకుండా పోలీసులు తమను అడ్డుకుంటున్నారని ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు ఉన్నాయని ఆ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ వేసినట్లు రాజాచంద్ర చెప్పారు. ఈ విషయమై ఆ రాష్ట్ర డీజీపీ, నారాయణపూర్ కలెక్టర్, ఎస్పీ, జిల్లా మేజిస్ట్రేట్‌లకు మంగళవారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. హైకోర్టులో కేసు వేసినందున మృతదేహాన్ని తమ గ్రామానికి తేవడానికి మరో 2 రోజులు పడుతుందన్నారు. 'మృతదేహాన్ని తీసుకెళ్లండి. చూపేందుకు వీలు కాదు' అని పోలీసులు చెప్పడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, కాతా (కట్ట) రామచంద్రారెడ్డికి నివాళిగా కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామస్తులు బుధవారం ర్యాలీ నిర్వహించారు.

పన్నున్‌పై ఎన్ఐఏ కేసు

» భారత స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ పతాకం ఆవిష్కరించకుండా మోదీని నిలువరిస్తే.. 11 కోట్ల ఆఫర్

» దేశంలో అలజడి సృష్టించాలని పిలుపు

» ఖలిస్థానీ ఉగ్రవాదిపై కేసు నమోదు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: అమెరికాకు చెందిన ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నున్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. భారత స్వాతంత్ర్య దినోత్సవం.. ఆగస్టు 15 నాడు ప్రధాని నరేంద్ర మోదీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయకుండా అడ్డుకోవాలని 'సిక్కు సైనికుల'కు పన్నున్ అదే నెల 10న పిలుపునిచ్చాడు. అలా చేసిన వారికి రూ.11 కోట్ల నజరానా ఇస్తానని ప్రకటించాడు. ఈ నేపథ్యంలో ఎన్ఐఏ పన్నున్‌పై తాజాగా కేసు నమోదు చేసింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల మేరకు.. నిషేధిత సిఖ్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) కీలక నేత పన్నున్ ఆగస్టు 10న పాకిస్థాన్‌లోని లాహోర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "భారత స్వతంత్ర దినోత్సవం నాడు ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ పతాకం ఎగురవేయకుండా మన సైనికులు అడ్డుకోవాలి. అలా అడ్డుకున్న ధీరులకు రూ.11 కోట్లు కానుకగా ఇస్తా." అని వ్యాఖ్యానించాడు. ఇదేసమయంలో పంజాబ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాలను కలుపుతూ రూపొందించిన ప్రతిపాదిత ఖలిస్థానీ రాష్ట్ర మ్యాప్‌ను ఆయన ఈ సమావేశంలో ప్రదర్శించాడు. భారత్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు 'షహీద్ జాతా'ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించాడు. ఈ పరిణామాలను నిశితంగా గమనించిన ఎన్ఐఏ.. పన్నున్‌పై కేసు నమోదు చేసింది. "ఈ చర్యల ద్వారా భారత దేశ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, భద్రతకు భంగం కలిగించే చర్యలకు పన్నున్ పాల్పడ్డాడు. అంతేకాదు, తన ప్రసంగాల ద్వారా దేశంలోని సిక్కులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు." అని ఎఫ్ఐఆర్‌లో అధికారులు పేర్కొన్నారు. భారతీయ న్యాయసంహిత, ఉపా చట్టాల కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పన్నున్‌తో పాటు మరికొందరిపైనా కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

ప్రేమ వివాహం నచ్చక..

కుమార్తెను ఈడ్చుకుంటూ తీసుకెళ్లిన తల్లిదండ్రులు

కీసర రూరల్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవటం నచ్చక.. సొంత కూతురుని అత్తారింటి నుంచి బలవంతంగా ఈడ్చుకెళ్లిన ఘటన మేడ్చల్ జిల్లా కీసర పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపల్లికి చెందిన ప్రవీణ్, శ్వేతలు మూడు నెలల క్రితం ఆర్య సమాజ్‌లో ప్రేమ వివాహం చేసుకుని హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. ప్రవీణ్ తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో భార్యతో కలిసి తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం ప్రవీణ్ ఇంటిపై దాడి చేశారు. ముందస్తు పథకం ప్రకారం ప్రవీణ్‌తో పాటు అతని సోదరుడు, తల్లి కళ్లల్లో కారం చల్లి అందరినీ కర్రలతో చితకబాదారు. కుమార్తెను ఈడ్చుకుంటూ లాక్కెల్లి కారులో తీసుకెళ్లారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దాడిలో గాయాల పాలైన ప్రవీణ్ తల్లిని ఆస్పత్రికి తరలించారు.

రాత్రి గదికొస్తే... ఫారిన్ ట్రిప్‌కు తీసుకెళ్తా!

» విద్యార్థినులకు స్వామీజీ గలీజు మెసేజీలు

» లైంగిక వేధింపులు... బ్లాక్‌మెయిల్ ఆరోపణలు

» స్వామి చైతన్యానంద సరస్వతిపై కేసు నమోదు

» పరారీలో నిందితుడు... లుకౌట్ నోటీసు జారీ



స్వామి చైతన్యానంద

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: 'రాత్రికి నా గదికొస్తే ఫారిన్ ట్రిప్‌కు తీసుకెళ్తా.. ఖర్చులన్నీ నేనే భరిస్తా'... విద్యార్థినులకు ఓ స్వామీజీ పంపిన అసభ్యకర మెసేజీలు ఇవి. ఢిల్లీలోని వసంత్ కుంజ్ ప్రాంతంలో శృంగేరీ మఠం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీశారద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సంస్థ డైరెక్టర్ స్వామి చైతన్యానంద సరస్వతి (స్వామి పార్థసారథి) తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ 17మంది విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాధితులంతా ఈడబ్ల్యూఎస్ స్కాలర్‌షిప్‌లపై పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నారు. తమను లైంగికంగా వేధించాడని, అసభ్యకరమైన సందేశాలు పంపేవాడని తమ ఫిర్యాదులో ఆరోపించారు. తాను చెప్పినట్లు వినకపోతే మార్కులు తగ్గిస్తానని, పరీక్షల్లో ఫెయిల్ చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేసేవాడని పేర్కొన్నారు. ముగ్గురు మహిళా వార్డెన్లు సైతం నిందితుడికి సహకరించారని తెలిపారు. ఈ క్రమంలో మొత్తం 32మంది విద్యార్థినుల స్టేట్‌మెంట్లను పోలీసులు నమోదు చేశారు. ఈ కేసులో ఆగస్టు 4న ఎఫ్ఐఆర్ దాఖలు చేసే సమయానికి నిందితుడు లండన్‌లో ఉన్నాడని, చివరిసారిగా అతడి లొకేషన్ ఆగ్రా సమీపంలో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. చైతన్యానంద విదేశాలకు పారిపోకుండా లుకౌట్ నోటీసు జారీ చేశారు. ఢిల్లీతో పాటు హరియాణా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, బిహార్‌లోని ఆశ్రమం శాఖలపై దాడులు చేసి, తనిఖీలు చేపట్టారు. కాగా, లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో చైతన్యానందను పదవి నుంచి తొలగించినట్లు శృంగేరీ మఠం అధికార వర్గాలు తెలిపాయి. అతడితో అన్ని సంబంధాలను తెంచుకుంటున్నట్లు ప్రకటించింది.

ఏసీబీ వలలో వ్యవసాయ అధికారి

» రూ.50వేలు తీసుకుంటుండగా పట్టివేత .. వికారాబాద్ జిల్లాలో ఘటన

మోమిన్‌పేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్ దుకాణ అనుమతికి సంబంధించి లంచం తీసుకుంటూ మండల వ్యవసాయ అధికారి (ఏవో) ఏసీబీ వలలో చిక్కారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఫెర్టిలైజర్ దుకాణం కోసం మండల వ్యవసాయాధికారి భూపతి జయశంకర్‌ని ఆశ్రయించారు. ఈ దుకాణానికి అనుమతి కోసం అయన రూ.లక్ష డిమాండ్ చేయగా బాధితుడు రూ.75వేలు ఇస్తానన్నాడు. దీంతో ఏవో లైసెన్స్ జారీ చేశారు. తర్వాత ఆయన డబ్బులు అడగడంతో ముందు రూ.50 వేలు, తర్వాత రూ.25 వేలు ఇస్తానని చెప్పిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల పథకం ప్రకారం బుధ వారం సదరు వ్యక్తి ఏవోకు ఫోన్ చేసి మోమిన్‌పేట కేంద్రంలోని మరో ఫెర్టిలైజర్ దుకాణం వద్దకు డబ్బులు తీసుకోవడానికి రమ్మన్నారు. అక్కడ ముందుగానే కాపుకాసిన ఏసీబీ అధికారులు బాధితుడి నుంచి రూ.50వేలు తీసుకుంటుండగా ఏవోను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు.

కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలపై ప్రత్యక్ష పోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేయలేదని ఆరోపించింది. మరోవైపు, ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం స్పష్టమవుతోందని పేర్కొంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన బుధవారం, పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. కొత్త కమిటీ సభ్యులకు నియామక సర్టిఫికెట్లు అందజేశారు. ఈ తొలి సమావేశం సందర్భంగా రాంచందర్‌రావు, పదాధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో బీజేపీ క్రమంగా బలపడుతోందని.. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని, దీన్ని ప్రజలకు గుర్తించారని, వారి విశ్వాసానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. బీజేపీలో ఒకరికి మరొకరు పోటీ కాదని.. ప్రత్యర్థులే పోటీ అనే విషయాన్ని గుర్తెరగాలని ఉద్బోధించారు. పార్టీలో ఎవ్వరినీ తక్కువ చేసి మాట్లాడొద్దని.. అలా ఎవరైనా చేస్తే పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. పదాధికారులు గ్రామాలకు వెళ్లి పార్టీ బలోపేతం కోసం, ప్రజల సమస్యల కోసం పనిచేయాలని సూచించారు. బీసీలను మోసం చేసింది కాంగ్రెసేనని.. మోదీ సర్కారు బీసీలకు పెద్దపీట వేసిందని, కేంద్ర క్యాబినెట్‌లో 27మంది ఓబీసీలు ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ విజయం వందశాతం ఖాయమని రాంచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ఇప్పటికే ఒక కమిటీ పనిచేస్తోందని పేర్కొంటూ, పోలింగ్ బూత్‌వారీగా కార్యాచరణకు సిద్ధంగా ఉండాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు.

వికసిత భారత్‌కు ఇంధన భద్రత కీలకం

- వాటిని సాధించేందుకు కేంద్రం అంకితభావంతో ఉంది: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బొగ్గు, గనులు, పునరుత్పాదక శక్తి, ఖనిజ రంగాల్లో కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న అనేక చర్యల ఫలితంగా భారత్ అంతర్జాతీయ ఇంధన రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం, ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ సదస్సులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఇంధన ఎనర్జీ రంగంలో సరికొత్త ఆవిష్కరణలతో అద్భుతమైన అవకాశాలు అందిపుచ్చుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. 2047 నాటికి వికసిత భారత్ సాధించేందుకు ఇంధన భద్రత, పర్యావరణ సుస్థిరత రెండు స్తంభాల్లాంటివని, వీటిని సాధించేందుకు తమ మంత్రిత్వ శాఖ అంకిత భావంతో పనిచేస్తోందన్నారు. ఇంధనభద్రతకు సంబంధించి భవిష్యత్తులో క్రిటికల్ మినరల్స్ అవసరం భారీగా పెరగనుందని, ముఖ్యంగా లిథియం, నికెల్, కోబాల్ట్ అవసరాలు 2040 నాటికి భారీగా పెరగనున్నాయన్నారు. 2070 నాటికి నెట్ జీరో ఉద్గారాల దిశగా మన దేశాన్ని నడిపించే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

స్థానికంలోనూ బీఆర్‌ఎస్‌కు గుండు సున్నా

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మళ్లీ అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నాయకులు కలలు కంటున్నారని, కానీ వారికి స్థానిక ఎన్నికల్లోనూ గుండు సున్నా రావడం ఖాయమని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికే వారికి గుండు సున్నా వచ్చిందని గుర్తు చేశారు. కేటీఆర్, హరీశ్‌లు నీతులు చెప్పడం.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను స్వాగతించాలని హితవు పలికారు.

హైడ్రాకు ఇంకా ఎక్కువ పవర్స్ ఇవ్వాలి: వీహెచ్

హైడ్రాకు ఇంకా ఎక్కువ పవర్స్ ఇవ్వాలని, అలా ఇస్తే కబ్జా అయిన అసైన్డ్ భూములూ బయటికి వస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా ఇప్పటికే రూ. 15 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడిందన్నారు. దీన్ని చూసి తట్టుకోలేని ప్రతిపక్షాలు.. పేదోళ్ల ఇళ్లను హైడ్రా కూల్చేస్తోందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఒకవేళ పేదోళ్ల ఇళ్లు కూలగొట్టాల్సి వస్తే వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారని వి.హనుమంతరావు గుర్తుచేశారు. గ్రూప్ 1 నియామకాలకు సంబంధించి హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు- ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనుకున్న వారికి చెంపపెట్టు వంటిదని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ అన్నారు. ఈ తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తోందని వారు తెలిపారు.

అవినీతి కేసుల విచారణ వేగవంతం చేయాలి

- సీఎంకు ఎఫ్‌జీజీ లేఖ

అవినీతి నిరోధక సంస్థ (ఏసీబీ) కేసుల్లో చిక్కుకున్న ఉద్యోగులు, అధికారులకు త్వరితగతిన శిక్షపడేలా చూడాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ మధ్య ఏసీబీ అధికారులు పెద్దఎత్తున అవినీతి కేసులను నమోదు చేస్తున్నారని ఎఫ్‌జీజీ లేఖలో పేర్కొంది. 2011, 2012లలో జరిగిన మద్యం కుంభకోణంలో ప్రత్యేక దర్యాప్తు బృందం 67 మంది రెవెన్యూ, ఎక్సైజ్, పోలీసు అధికారులపై కేసులు నమోదు చేసిందని వివరించింది. వీరిలో ఇద్దరిపై విచారణ పూర్తయి, నిర్దోషులుగా తేలారని, మిగతా 65 మందిపై 13 ఏళ్లుగా కేసులు పెండింగులోనే ఉన్నాయని తెలిపింది. ఇలాంటి చాలా కేసులు సచివాలయంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నది. కేసులు తేలడానికి 10-12 ఏళ్ల కాలం పడుతోందని వెల్లడించింది. అందుకే అవినీతి కేసులు రెండు మూడేళ్లలో తేలిపోయి, దోషులకు శిక్ష పడేలా చూడాలని సీఎంను ఎఫ్‌జీజీ కోరింది.

గంగా పరీవాహక ప్రాంతంలో ఆహారభద్రతకు ముప్పు!

- వెయ్యేళ్లలో ఎన్నడూ లేనంతగా ఎండుతున్న గంగా నది

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: కోట్లాది మంది తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తున్న గంగా నదీ పరీవాహక ప్రాంతం గత వెయ్యేళ్ల కాలంలో ఎన్నడూ లేనంతగా ఈ మూడు దశాబ్దాల్లో తీవ్రంగా ఎండిపోతోందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. గత 1300 ఏళ్ల నుంచి పరిశీలిస్తే 1991 నుంచి 2020 మధ్య కాలంలో ఎక్కువగా ఎండిందని నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. దీనివల్ల ఆహార భద్రతకు ముప్పు ఏర్పడనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. నైరుతి రుతుపవనాల (జూన్-సెప్టెంబరు) సమయంలోనూ గంగా నది ఎండిపోవడానికి వర్షపాతం తగ్గడమే కారణమని ఐఐటీ గాంధీనగర్, అమెరికాలోని ఆరిజోనా యూనివర్సిటీ పరిశోధకులు కనుగొన్నారు. ఈ బృందం 1991-2020 మధ్యకాలంలో రికార్డులు, నీటి ప్రవాహ నమూనాల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా.. గత 1300 సంవత్సరాల నీటి ప్రవాహ నమూనాలను అంచనా వేసింది. 'సుమారు 60 కోట్ల మంది ప్రజల జీవనానికి ఎంతో కీలకమైన గంగా నదీ పరీవాహక ప్రాంతం ఆందోళనకర స్థాయిలో ఎండిపోతోంది. దీని వల్ల తాగునీరు, ఆహార భద్రతకు ముప్పు వాటిల్లనుంది' అని పరిశోధకులు పేర్కొన్నారు. 1990 నుంచి తరచూ వస్తున్న కరువులు కూడా గంగా నది ఎండిపోవడానికి కారణమని వారు తెలిపారు. 1951 నుంచి 2020 మధ్యకాలంలో మొత్తం వార్షిక వర్షపాతం 9.5 శాతం తగ్గిందని ఈ బృందం అంచనా వేసింది. వర్షపాతం తగ్గడానికి వాతావరణ మార్పులే కారణమని పేర్కొంది. హిందూ మహాసముద్ర ప్రాంతం వేడెక్కుడం, ఉత్తర భారతంలో రుతుపవనాలు బలహీనంగా ఉండడం ఈ పరిస్థితికి కారణమని తెలిపింది.

కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వండి!

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్న విషయం తెలిసిందే. వీరిలో ఫార్ములా ఈ-ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థ, త్రైపాక్షిక ఒప్పందంలో కీలకమైన ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థ ఎండీ, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఉన్నారు.

ఒప్పందం దగ్గర్నుంచి చెల్లింపుల దాకా..

ఫార్ములా ఈ-కారు రేసుకు సంబంధించి ఒప్పందం దగ్గర్నుంచి డబ్బు చెల్లింపు దాకా నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ముందస్తు అనుమతులు తీసుకోకుండా ఎఫ్ఈవోకు రెండు విడతలుగా డబ్బు చెల్లించారని, విదేశీ కరెన్సీలో చెల్లింపులు జరిగాయని, దీని వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని వివరించినట్లు సమాచారం. ఇదంతా ఆనాడు మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాల మేరకే జరిగిందనడానికి అవసరమైన అన్ని ఆధారాలను సేకరించామని పేర్కొన్నట్లు సమాచారం. కాగా, క్యాబినెట్ అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో డబ్బును హెచ్ఎండీఏ నిధుల నుంచి చెల్లించడం వల్ల ప్రభుత్వానికి ఎలాంటి నష్టం జరిగిందో తెలుపుతూ పురపాలక శాఖ కార్యదర్శి హోదాలో దానకిశోర్ ఇచ్చిన ఫిర్యాదుతో గత ఏడాది ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ వెంటనే మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్‌తో పాటు నిందితులందరినీ పలుమార్లు ఏసీబీ, ఈడీ అధికారులు వేర్వేరుగా విచారించి ఆధారాలు సేకరించారు. కేటీఆర్ అప్పట్లో వాడిన సెల్‌ఫోన్, ట్యాబ్ ఇవ్వాలని ఏసీబీ నోటీసులు జారీ చేసినప్పటికీ.. వాటిని ఇవ్వకుండా కేటీఆర్ ఏసీబీని ప్రశ్నిస్తూ లేఖ రాయడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

అరవిందకుమార్‌పై చర్యకు కేంద్రానికి లేఖ..

అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలపై ఐపీసీ సెక్షన్లతోపాటు అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో ఐపీసీ సెక్షన్లకు సంబంధించి తదుపరి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే అరవింద్‌కుమార్ ఐఏఎస్ అధికారి కావడంతో ఆయనపై అవినీతి నిరోధక చట్టం ప్రకారం నమోదైన సెక్షన్లలో ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం. దీంతో కేంద్ర సిబ్బంది, వ్యవహారాల శాఖకు ఏసీబీ రిపోర్టు, విజిలెన్స్ నివేదికను జత చేసి.. అరవింద్‌కుమార్‌పై పీసీ యాక్ట్ ప్రకారం చర్యలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయనున్నట్లు సమాచారం.

రేపు అతి భారీ వర్షాలు!

రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

- నేడు పలు జిల్లాల్లో వానలు
- ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

హైదరాబాద్, బాసర, గద్వాల, నాగార్జునసాగర్, పుల్‌కల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో శుక్రవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో గురువారం భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఓ ఆవర్తనం గురువారానికి అల్పపీడనంగా మారనుందని, శుక్రవారానికి అది వాయుగుండంగా బలపడి శనివారం తీరాన్ని దాటనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో శనివారం వరకు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. శుక్రవారం కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇక, కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద ఉధృతి కొనసాగుతోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 586.60 అడుగుల(303.4310టీఎంసీలు) నిల్వ ఉంది. సాగర్‌కు ఎగువ నుంచి 3,66,816 క్యూసెక్కుల నీరు వస్తుండగా 3,20,046 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి బుధవారం 3.80 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 3,45,730 క్యూసెక్కులను సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 25 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 2.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 2.48 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 22 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. మరోపక్క, ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతోంది. బుధవారం సాయంత్రం నుంచి ప్రాజెక్టులోని మొత్తం ఎనిమిది గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 69,068 క్యూసెక్కులు ఉండగా 67,531 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. బుధవారం రాత్రి వరకు 16.673 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. సంగారెడ్డి సమీపంలోని మంజీర రిజర్వాయర్ వద్ద కూడా వచ్చిన నీటిని వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు. కాగా, మహారాష్ట్ర నుంచి భారీగా వస్తున్న వరదతో బాసర వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. బాసరలో భక్తులు స్నానాలు ఆచరించే ప్రాంతాలన్నీ నీటమునిగాయి. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌తో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



సింగూరు ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న జలాలు

సికింద్రాబాద్-ముంబై మార్గంలో పలు రైళ్లు ఆలస్యం, రీషెడ్యూల్

హైదరాబాద్‌సిటీ: సికింద్రాబాద్-ముంబై మార్గంలో పలు ముఖ్యమైన రైళ్లు గంటలకొద్దీ ఆలస్యంగా నడుస్తున్నాయి. కుర్దువాడి-షోలాపూర్ మధ్య ఓ రైల్వే వంతనపై ప్రమాదకర స్థాయిలో నీరు ప్రవహిస్తుండడమే ఇందుకు కారణం. దీంతో కొన్ని రైళ్లను దారిమళ్లించిన రైల్వే అధికారులు మరికొన్నింటిని బుధవారం రీషెడ్యూల్ చేశారు. 22731 ముంబై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 10గంటలు ఆలస్యంగా నడుస్తున్నందున ముంబై నుంచి హైదరాబాద్ రావాల్సిన హుస్సేన్‌సాగర్(12701) ఎక్స్‌ప్రెస్‌ను రీషెడ్యూల్ చేశారు. ముంబై-సికింద్రాబాద్ మధ్య నడిచే దురంతో ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్- పుణె శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా రీషెడ్యూల్ అయ్యాయి. అలాగే, సికింద్రాబాద్-భువనేశ్వర్ మధ్య నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్ కూడా బుధవారం 4గంటలు ఆలస్యంగా (రాత్రి 8.50గంటలకు) రీషెడ్యూల్ చేశారు. రైళ్ల రీషెడ్యూల్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కృష్ణా జలాల వాటాపై అవగాహన లేని రేవంత్, ఉత్తమ్

- సీఎంది ఒక మాట, మంత్రిది మరో మాట
- సమ్మక్క సాగర్ పూర్తి చేసింది బీఆర్‌ఎస్సే
- కాంగ్రెస్‌ది అబద్ధపు ప్రచారం: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): "కృష్ణా జలాల్లో 763 టీఎంసీలు ఇవ్వాలని డిమాండ్ చేశామని మంత్రి ఉత్తమ్ గొప్పగా చెప్పారు. మరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం జూన్ 18న కృష్ణా బేసిన్ మీద 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్‌వోసీ ఇవ్వండి.. ఆ తర్వాత ఏ ప్రాజెక్టులైన కట్టుకోండి అని ఏపీ సీఎం చంద్రబాబుకు ఆఫర్ ఇచ్చారు. ఈ నెల 13న జరిగిన నీటి పారుదల శాఖ సమీక్షలో కృష్ణా జలాల్లో 904 టీఎంసీల వాటా సాధించి తీరాలి అని సీఎం అన్నారు. కృష్ణా జలాల వాటా విషయంలో సీఎం ఒక మాట.. మంత్రి ఉత్తమ్ మరో మాట మాట్లాడారు. నీటి వాటాపై వారు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు" అని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సీఎం, మంత్రి అజ్ఞానం వల్ల తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటి వాటాను కోల్పోయే పరిస్థితి ఉందని బుధవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ కృష్ణా జలాల్లో పూర్తి వాటా సాధించేందుకు సెక్షన్ 3 కోసం పోరాటం చేశారని పేర్కొన్నారు. సమ్మక్క-సారక్క బ్యారేజీకి మంత్రి ఉత్తమ్ అనుమతులు సాధించినట్టు చెప్పుకుంటున్నారని.. ఛత్తీస్‌గఢ్‌తో కేవలం 50 ఎకరాల ముంపునకు సంబంధించి సూత్రప్రాయ అంగీకారం కుదిరితే ఏవో గొప్పలు సాధించినట్టు ప్రచారం చేసుకుంటున్నారన్నారని విమర్శించారు. కాంగ్రెస్ చేసిన తప్పులను సరిదిద్ది, దేవాదులను పటిష్ఠం చేసేందుకు ఏడు టీఎంసీల సామర్థ్యంతో సమ్మక్క-సారక్క బ్యారేజీని కేసీఆర్ నిర్మించినట్లు తెలిపారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తు 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచాలని నిర్ణయించిందని, ఈ విషయంపై సీఎం రేవంత్ ఎందుకు మాట్లాడటం లేదని ఆయన నిలదీశారు.

దేశ ద్రోహి కాంగ్రెస్.. ప్రజా ద్రోహి బీజేపీ

- యూరియా అడిగితే రైతులపై థర్డ్ డిగ్రీనా?
- ఇదేనా రాహుల్ చెప్పిన మొహబ్బత్ కీ దుకాణ్
- జీఎస్టీ పేరిట మోదీ రూ.15 లక్షల కోట్లు దోచుకున్నందుకు పండుగ చేసుకోవాలా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్/ఖైరతాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): "దేశ ద్రోహి కాంగ్రెస్.. ప్రజా ద్రోహి బీజేపీ. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ సర్కార్ సామాన్యుడి నడ్డి విరుస్తోంది. యూరియా కోసం రోడ్డెక్కిన రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం రేవంత్ రెడ్డి సిగ్గుమాలిన పనితనానికి నిదర్శనం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం కరీంనగర్‌కు చెందిన డాక్టర్ దంపతులు ఒంటెల రోహిత్ రెడ్డి, గోగుల గౌతమి రెడ్డిలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. జీఎస్టీ పేరుతో ఎనిమిదేళ్లుగా ప్రజల నుంచి రూ.15 లక్షల కోట్లు దోచుకున్న ప్రధాని మోదీ.. ఇప్పుడు బిహార్ ఎన్నికల కోసం జీఎస్టీ శ్లాబులు తగ్గించి పండుగ చేసుకోవాలనడం హాస్యాస్పదమని విమర్శించారు. రైతు డిక్లరేషన్‌లో చెప్పిన ఏ ఒక్క హామీని రేవంత్ రెడ్డి అమలు చేయడం లేదని, యూరియా కోసం రైతులు రోడ్డెక్కితే పోలీసులతో కొట్టిస్తున్నారని, సూర్యాపేటలో యూరియా ఆందోళనలో పాల్గొన్న గిరిజన యువకుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, ఈ అంశాన్ని ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమిషన్ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాహుల్ గాంధీ చెప్పిన 'మొహబ్బత్ కీ దుకాణ్' అంటే రైతులను కొట్టడమేనా అని ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రయోజనాల కోసమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయించకుండా సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాగా, అధికారం కోసం అడ్డమైన హామీలు ఇచ్చి అమలు చేయకపోవడాన్ని కాంగ్రెస్ అలవాటుగా మార్చుకుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ బృందం సభ్యులు బుధవారం కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిగ్ వర్కర్స్‌కు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పీపుల్స్ ప్లాజాలో బీఆర్ఎస్ బతుకమ్మ వేడుకలు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు తలసాని, పద్మారావు గౌడ్, సత్యవతి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, వాణీదేవి, ఎల్. రమణ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు చేయండి

26న బతుకమ్మకుంట సంబురాల్లో పాల్గొననున్న సీఎం.. 29న సరూర్‌నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో ఉత్సవం

- గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకి ఎక్కే అవకాశం: సీఎస్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే భారీ బతుకమ్మ కార్యక్రమంతో పాటు 26న ముఖ్యమంత్రి పాల్గొనే బతుకమ్మకుంట బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆయన సచివాలయం నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అంబర్‌పేట్‌లో ప్రభుత్వం పునరుద్ధరించిన బతుకమ్మకుంటలో 26న నిర్వహించే బతుకమ్మ సంబురాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారని సీఎస్ తెలిపారు. దీనికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. బతుకమ్మకుంట ప్రారంభోత్సవ కార్యక్రమ ఆహ్వానాలను ప్రజాప్రతినిధులు, వీఐపీలకు సకాలంలో పంపాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే బతుకమ్మ కార్యక్రమానికి 10వేలకుపైగా మహిళలు హాజరవుతారని, ఇది గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కే అవకాశం ఉందన్నారు. 27న ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్, 29న పీపుల్స్ ప్లాజా, 30న ట్యాంక్‌బండ్‌పై పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశామని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు.



గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

కార్నివాల్‌కు హెచ్ఎండీఏ ఏర్పాట్లు

ఈ నెల 27న ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్ నిర్వహించేందుకు హెచ్ఎండీఏ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ట్యాంక్‌బండ్‌పై ఆ రోజున సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పూర్తిగా రాకపోకలు నిలిపివేయనున్నారు. అలాగే ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నాయి. బతుకమ్మ కార్నివాల్‌లో నగరంలోని అన్ని ప్రాంతాల మహిళలు పెద్దఎత్తున పాల్గొనేందుకు, బతుకమ్మ ఆడేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నారు. సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగించే కార్యక్రమాలు ఉండనున్నాయి. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

గాంధీభవన్‌లో వేడుకలు

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారంనాడు గాంధీభవన్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాల్లో పార్టీ సీనియర్ నేత వీహెచ్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్రఅధ్యక్షురాలు సునీతారావు, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు.

బడి ఎగ్గొట్టి సరదాగా బయటకు వెళితే..

తీవ్ర ఇబ్బందుల్లో పడ్డ ముగ్గురు తొమ్మిదో క్లాసు బాలికలు.. వారికి మాయమాటలు చెప్పిన ముగ్గురు యువకులు

- ఆరుగురు కలిసి యాదగిరిగుట్టకు.. లాడ్జిలో గది అద్దెకు.. రాత్రంతా అక్కడే
- మర్నాడు ఇంటికి బాలికలు..
- కన్నవారు నిలదీయడంతో అత్యాచారం జరిగినట్లు వెల్లడి
- నిందితుల అరెస్టు.. పోక్సో కేసు నమోదు.. లాడ్జి యజమాని అరెస్టు

అల్వాల్, హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురు బాలికలు తొమ్మిదో క్లాసు చదువుతున్నారు. బడికి వెళ్తున్నామని ఇంట్లోవాళ్లకు చెప్పి.. వెళ్లకుండా సరదాగా బయట తిరిగారు. బాలికలను మాటల్లో పెట్టిన ఓ ముగ్గురు యువకులు వారిని యాదగిరిగుట్టకు తీసుకెళ్లారు. మర్నాడు ఇంటికి తిరిగొచ్చిన ఆ బాలికలు.. ఎక్కడికి వెళ్లారు? అని గట్టిగా నిలదీయడంతో తమపై యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని వెల్లడించారు. అల్వాల్‌లో వెలుగుచూసిన ఈ ఘటన స్థానికులను తీవ్ర ఆవేదన, ఆందోళనకు గురిచేసింది. ఆల్వాల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముగ్గురు బాలికలు కూడా ఒకే పాఠశాలలో చదువుతున్నారు. బడిలో బతుకమ్మ ఉత్సవాలపై ప్రత్యేక కార్యక్రమాలున్నాయని ఇంట్లోవాళ్లకు చెప్పి ఈనెల 20న ఉదయం 7:30కే ఆధార్ కార్డులు పట్టుకొని బయట కొచ్చారు. స్కూలుకు వెళ్లకుండా ఆల్వాల్ గోల్నాక చౌరస్తావద్ద బస్సెక్కి సికింద్రాబాద్‌కు వెళ్లారు. అక్కడి నుంచి మరో బస్సులో ఉస్మానియా వర్సిటీ పీఎస్ ప్రాంతంలో దిగారు. దగ్గర్లోని ఓ బస్టాపు వద్ద నిల్చున్నారు. ఓయూ మాణికేశ్వరి నగర్ వాస్తవ్యుడు, జీహెచ్ఎంసీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 19 ఏళ్ల యువకుడు బాలికలను చూసి వారితో మాటలు కలిపాడు. అనంతరం.. వారాసిగూడ పెట్రోల్ బంక్‌లో పనిచేసే 21 ఏళ్ల స్నేహితుడికి, మల్లేశ్వర్‌నగర్‌కు చెందిన 22 ఏళ్ల స్నేహితుడికి ఫోన్ చేసి అక్కడికి పిలిపించుకున్నాడు. తన ఇద్దరు స్నేహితులను అతడు బాలికలకు పరిచయం చేశాడు. మాటల్లో.. ఆ బాలికలు యాదగిరిగుట్టకు వెళుతున్నారని తెలుసుకొని, తామూ అక్కడికి వెళుతున్నామని వారిని ఆ ముగ్గురు యువకులు నమ్మించారు. ఆరుగురు కలిసి బస్సులో యాదగిరిగుట్టకు వెళ్లారు. గుట్టపై దర్శనం అనంతరం లాడ్జ్‌లో గదికి అద్దెకు తీసుకున్నాడు. రాత్రంతా ఆ గదిలోనే ఉన్నారు. 21వ తేదీన ఆరుగురు కలిసి హైదరాబాద్‌కు వచ్చారు. ఓయూ పీఎస్ పరిధిలో బాలికలను వదిలిపెట్టి, ముగ్గురు యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతకు ముందు రోజు.. బాలికలు బడికి రాకపోవడంతో ఓ టీచర్.. తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. పిల్లలు బడికి వెళ్లలేదని తెలిసి ఆందోళనకు గురైన బాలికల తల్లిదండ్రులు స్నేహితుల ఇళ్లలో వాకబు చేసిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మర్నాడు ఆదివారం ఓయూ పీఎస్ పరిధిలోంచి బాలికలే తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. వారు గట్టిగా నిలదీసేసరికి.. జరిగిదంతా చెప్పారు. తమపై యువకులు పాల్పడ్డ దారుణాన్ని కన్నవారికి వెల్లడించారు. ముగ్గురు యవకులను పోలీసులు గుర్తించి.. వారిని అరెస్టు చేశారు. ఆ ముగ్గురిపైనా పోక్సో కేసు నమోదు చేశారు. యువకుల వెంట బాలికలు ఉన్నారని తెలిసి కూడా యాదగిరిగుట్టలో గదిని అద్దెకు ఇచ్చిన యజమాని సోమేశ్‌ను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు చెన్నైకి సీఎం రేవంత్



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వం గురువారం భారీ ఎత్తున నిర్వహించ తలపెట్టిన 'మహా విద్యా చైతన్య ఉత్సవం'లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఆహ్వానం మేరకు ఆయన చెన్నైకి బయలుదేరి వెళ్లనున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

దసరా తర్వాత డీసీసీ అధ్యక్షుల నియామకం

» నేడు ఢిల్లీలో రాహుల్ దిశానిర్దేశం

రాష్ట్రంలోని 35 డీసీసీలకు అధ్యక్షుల నియామక ప్రక్రియ.. దసరా తర్వాత ప్రారంభం కానుంది. ఈ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను నిర్వహించేందుకు అధిష్ఠానం.. 22 మంది ఏఐసీసీ పరిశీలకులను నియమించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంతో పాటు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ కోసం కూడా అధిష్ఠానం పరిశీలకులను నియమించింది. వీరందరికి, అధ్యక్షుల ఎంపిక ప్రక్రియపై అవగాహన కోసం గురువారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో అధిష్ఠానం ఒక సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ పాల్గొననున్నారు. కాంగ్రెస్ పెద్దలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నియామక ప్రక్రియపై దిశానిర్దేశం చేయనున్నారు. ఏఐసీసీ పరిశీలకులు అక్టోబర్ 4 నుంచి పది రోజుల పాటు వారు క్షేత్రస్థాయిలో పర్యటించి.. డీసీసీ అధ్యక్షుల ఎంపికపై స్థానిక నాయకుల అభిప్రాయాలను సేకరించి, సమగ్ర నివేదికను అధిష్ఠానానికి సమర్పిస్తారు. పరిశీలకులు ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా రాష్ట్ర నాయకత్వాన్నీ సంప్రదించి.. డీసీసీ అధ్యక్షులను అధిష్ఠానం ప్రకటించనుంది.

జనరల్ అసిస్టెంట్లుగా.. బదిలీ వర్కర్లు

» 1,258 మంది క్రమబద్ధీకరణకు సింగరేణి ఓకే

కొత్తగూడెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్లుగా చేరి భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్, సర్ఫేస్‌లలో పనిచేస్తూ మస్టర్లు పూర్తి చేసిన 1,258 మందిని జనరల్ అసిస్టెంట్ కేటగిరీ-1గా క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పిస్తూ బుధవారం సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు విడుదల చేసింది. 2024 డిసెంబరు 31 లేదా అంతకు ముందు తమ సంవత్సరకాలం సర్వీసు పూర్తిచేసిన వారికి ఈ అవకాశం కల్పించనున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. భూగర్భ గనుల్లో 190 మస్టర్లు, ఓపెన్ కాస్ట్ గనుల్లో, సర్ఫేస్‌లో 240 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లను క్రమబద్ధీకరించేందుకు యాజమాన్యం అంగీకరించింది. సింగరేణి సీఎండీ ఎన్. బలరాం, డైరెక్టర్ పర్సనల్ పోత్రు గౌతమ్‌లతో గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జరిపిన చర్చల అనంతరం యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రెండురోజుల్లో టెండర్ నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు అవసరమైన డిజైన్లు తయారు చేయడానికి అంతర్జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) కోరుతూ నోటిఫికేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తును ముమ్మరం చేసింది. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కోసం ఈవోఐ పిలవడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని ఈనెల 19న నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఆ తర్వాత రెండువారాల్లోగా డిజైన్ కన్సల్టెంట్‌ను ఎంపిక చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఆదేశాలు ఇచ్చారు. దాంతో అత్యంత నైపుణ్యం కలిగిన సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేయడానికి ఏయే అంశాలు ప్రామాణికంగా తీసుకోవాలనే అంశంపై నీటిపారుదలశాఖ కసరత్తును చేస్తోంది. రెండురోజుల్లోగా టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేసే అవకాశాలున్నాయి.

యాసంగిలో మహిళా సంఘాలతో ఎరువుల సరఫరా: మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల ద్వారా ఎరువులను సరఫరా చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మహిళలకు 5 వేల ఎలక్ట్రికల్ ఆటోలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి 600 బస్సులు కొనుగోలు చేయించామని, వాటి ద్వారా మహిళా సంఘాలు ఆదాయం పొందుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో 7 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలు విజయవంతంగా నిర్వహించాయన్నారు.

సమ్మక్కసాగర్ అనుమతికి 2 నెలలు ఆగాల్సిందే!

» ప్రాజెక్టుపై నేడు ఢిల్లీలో సీడబ్ల్యూసీ భేటీ

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమ్మక్కసాగర్ (తుపాకుల గూడెం) ప్రాజెక్టుకు అనుమతుల కోసం మరికొంత సమయం పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) జారీ చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినప్పటికీ.. ప్రాజెక్టు వల్ల కలిగే గరిష్ఠ ముంపుపై ఐఐటీ-ఖరగ్‌పూర్ ఇచ్చే నివేదిక ఆధారంగానే ఆ రాష్ట్రం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్ట్ కారణంగా ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే 170 ఎకరాలకు గాను.. ఎకరానికి రూ. 20 లక్షల చొప్పున పరిహారం చెల్లించడానికి తెలంగాణ ఇప్పటికే సుముఖత వ్యక్తం చేసింది. మరో వైపు, గురువారం న్యూఢిల్లీలో సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఇరిగేషన్ ప్లానింగ్‌పై కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) సమావేశం కానుంది. ఈ భేటీలో సీడబ్ల్యూసీ లేవనెత్తే అనుమానాలన్నీ నివృత్తి చేసే విధంగా తెలంగాణ ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది. దాంతో నెల రోజుల్లో ముంపు పరిహారం తేలితే.. మరో నెలరోజుల్లో సీడబ్ల్యూసీలోని వివిధ డైరెక్టరేట్లతో పాటు సాంకేతిక సలహామండలి(టీఏసీ) అనుమతి లభించేందుకు మార్గం సుగమం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తెలుగులోనూ 99 మార్కులు!

» ఇంటర్ విద్యలో మాతృభాషను ప్రోత్సహిస్తాం

» ప్రభుత్వ కాలేజీల్లో 91,853 కొత్త ప్రవేశాలు


» ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో తెలుగు భాషను ప్రోత్సహించడానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఇంటర్ విద్యా కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అత్యధిక మార్కులు సాధించేందుకు విద్యార్థులు సంస్కృతాన్ని ద్వితీయ భాషగా ఎంచుకోవడం వల్ల తెలుగు తీసుకునే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా ఈ విద్యా సంవత్సరం నుంచే తెలుగులోనూ గరిష్ఠంగా 99 మార్కులు వచ్చేలా మార్పులు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ నిర్ణయం మాతృభాష పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని కృష్ణ ఆదిత్య తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి 9 శాతం వృద్ధి నమోదైంది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో గతేడాది 83,635 మంది చేరగా, ఈ ఏడాది ఈ సంఖ్య 91,853కు పెరిగిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఇంటర్ ప్రవేశాలు 9.82 లక్షలకు చేరాయన్నారు. వచ్చే ఏడాది నుంచి అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాలను మార్చనున్నామని తెలిపారు. అలాగే, కాలేజీల్లోని ఖాళీల భర్తీకి 494 అతిథి అధ్యాపకులను నియమించడానికి ప్రభుత్వం అనుమతించిందని, ఈ నియామకాలు త్వరలో చేపడతామని వెల్లడించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా మూడు కాలేజీలు వచ్చే ఏడాది నుంచి ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు.

రేపే జీవో విడుదల!

(మొదటిపేజీ తరువాయి)



విషయం తెలిసిందే. ఆ మేరకు ఖరారైన రిజర్వేషన్లు, జనాభా, సామాజిక వర్గాల వారీగా ఎలా ఉన్నాయన్న అంశాలను జిల్లాల కలెక్టర్లు బుధవారం మరోసారి పరిశీలించారు. ఆ వివరాలన్నింటినీ సీల్డ్ కవర్లో భద్రపరిచి ఉంచగా.. ఒక సెట్‌ను బుధవారం రాత్రి ప్రభుత్వానికి అందజేశారు. వాటిని పంచాయతీరాజ్ శాఖ మరోసారి పరిశీలించనుంది. వాటన్నింటినీ క్రోడీకరించి గురువారం సాయంత్రానికి సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి అందించనుంది.

ప్రత్యేక జీవో విడుదలకు రంగం సిద్ధం..

పంచాయతీరాజ్ శాఖ నుంచి రిజర్వేషన్లకు సంబంధించిన సమగ్ర నివేదికలు అందడంతో ప్రభుత్వం స్థానిక ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఉత్తర్వులను జారీ చేయనుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం 2018 పంచాయతీరాజ్ చట్టంలో చేసిన సవరణలతో ఈ జీవోను విడుదల చేయనుంది. ఇక ఎన్నికల నిర్వహణకు అవసరమైన శిక్షణకు కూడా సిద్ధంగా ఉండాలంటూ పంచాయతీరాజ్ శాఖ నుంచి జిల్లాల కలెక్టర్లకు, ఎంపీడీవోలు సహా ఇతర అధికార యంత్రాంగానికి బుధవారం సాయంత్రం సందేశాలు వెళ్లాయి. మరోవైపు గ్రామాల వారీగా అవసరమైన బ్యాలెట్ బాక్సులు, అత్యవసరం కోసం వినియోగించేందుకు కూడా ఉండేలా బాక్సులను ఇప్పటికే మండలాలకు చేరవేసినట్టు సమాచారం. దీంతోపాటు ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పేపర్ల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు పంచాయతీరాజ్ శాఖ సూచించింది. అయితే నమూనా బ్యాలెట్ పత్రాలు కూడా మండలాలకు చేరాయని మండల అధికారుల ద్వారా తెలిసింది. ఎన్నికలకు షెడ్యూల్ విడుదలై, నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక, ఖరారైన అభ్యర్థులను బట్టి వారికి కేటాయించిన గుర్తుల ప్రకారం బ్యాలెట్ పత్రాలను ముద్రించనున్నారు. వీటిని కూడా మండల, జిల్లాల వారీగా అందుబాటులో ఉన్నచోట ముద్రించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సమరానికి ఎట్టకేలకు రంగం సిద్ధమైంది.

మొదట ఏ ఎన్నికలు?

స్థానిక ఎన్నికల నిర్వహణ కోసం రిజర్వేషన్ల నుంచి అన్ని వ్యవహారాలను పూర్తి చేయడంతో.. మొదట ఏ ఎన్నికలు ఉంటాయనే చర్చ తెరపైకి వచ్చింది. అయితే తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని, ఆ తరువాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సర్పంచ్ ఎన్నికలు రెండు దశల్లో ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ప్రత్యేక జీవో విడుదలైన అనంతరం ఏ ఎన్నికలు మొదట నిర్వహిస్తారనేదానిపై స్పష్టత వస్తుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో స్థానిక సంస్థలకు తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, ఆ తరువాత రెండో దశలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. ఇప్పుడు కూడా అదే ఆనవాయితీని కొనసాగించే అవకాశం ఉందంటున్నారు.

లోకల్ జోష్..

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సమరానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండడంతో క్షేత్రస్థాయిలో ఎన్నికల జోష్ మొదలైంది. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్న ఆశావహులంతా రిజర్వేషన్ల ఖరారు అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మండల అధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు తమ గ్రామం, మండలంలో ఏ సామాజికవర్గాలకు రిజర్వేషన్లను కేటాయించారనే వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే గతంలో ఉన్న రిజర్వేషన్లు ఈ దఫా మారబోతున్నాయనే అంచనాలతో ఎవరికి వారు తమకు ఈసారి అవకాశం వస్తుందో, రాదోనంటూ లెక్కలు వేసుకుంటున్నారు.

ఊహల ఆధారంగా పిటిషన్లు వేస్తారా?

» పత్రికల్లో వచ్చిన కథనాలు చూసి కోర్టును ఆశ్రయిస్తారా ?: హైకోర్టు

» స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వద్దంటూ దాఖలైన పిటిషన్ కొట్టివేత



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఊహలు, అంచనాల ఆధారంగా పిటిషన్లు దాఖలు చేయడం ఏంటి ? పత్రికల్లో వచ్చిన కథనాలను చూసి ఏదో ఊహించుకుని పిటిషన్లు వేయడం ఏంటి ?.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో దాఖలైన ఓ పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు బుధవారం ఈ వ్యాఖ్యలు చేసింది. పత్రికల్లో వచ్చిన కథనాలు చూసి ప్రభుత్వం జీవో ఇవ్వబోతుందని ఊహించుకుని పిటిషన్ వేయడం అసమంజసం అని పేర్కొంటూ సదరు పిటిషన్‌ను కొట్టేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇవ్వడానికి ప్రయత్నిస్తుందోని, అది రాజ్యాంగ విరుద్ధమంటూ బుట్టెంగారి మాధవరెడ్డి అనే సామాజిక కార్యకర్త, జలపల్లి మల్లవ్వ హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదిస్తూ.. తెలంగాణ పంచాయతీ రాజ్ యాక్ట్ - 2018 లోని సెక్షన్ 285ఏ ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా గరిష్ఠ పరిమితి విధించారని.. సదరు నిబంధన అమలులో ఉందని.. దానిని కదిలించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ ఇప్పటివరకు బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం ఏంచేస్తుందో తెలియకుండా ఎలా పిటిషన్ దాఖలు చేస్తారని ప్రశ్నించింది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా విచారణ చేపట్టలేమని 'జార్జ్ ఫెర్నాండేజ్ ' కేసులో సుప్రీం కోర్టు ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొంది. ఈ మేరకు ఇది ప్రీమెచ్యూర్ పిటిషన్ అని కొట్టేసింది. అయితే ప్రభుత్వం జీవో జారీ చేస్తే మళ్లీ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని పేర్కొంది.

దేశవ్యాప్తంగా కొత్తగా 10,023 మెడికల్ సీట్లు

» ఇందులో ఎంబీబీఎస్ సీట్లు 5,023.. పీజీ సీట్లు 5వేలు

» ప్రభుత్వ కాలేజీల్లో మంజూరుకు కేంద్రం నిర్ణయం

» రూ.15,034కోట్ల ఖర్చు.. రాష్ట్రాల వాటా రూ.4,731కోట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ కాలేజీల్లో కొత్తగా 10,023 యూజీ, పీజీ వైద్య విద్య సీట్లను మంజూరు చేసింది. బుధవారం జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్తగా మంజూరైన సీట్లలో 5,023 ఎంబీబీఎస్ సీట్లు, 5000 పీజీ సీట్లు ఉన్నాయి. 2028-29 నాటికి ఈ సీట్లు అందుబాటులోకి వస్తాయని కేంద్రం వెల్లడించింది. ఈ సీట్లను అందుబాటులోకి తీసుకురావడానికి మొత్తం రూ.15,034.50 కోట్ల వ్యయం కానుండగా ఇందులో కేంద్రం వాటా రూ.10,303.20 కోట్లు. రాష్ట్రాల వాటా రూ.4,731.30 కోట్లు. ఒక్కో సీటుకు రూ.1.50 కోట్లు వ్యయం చేయనున్నారు. ప్రస్తుతం దేశంలో 808 మెడికల్ కాలేజీలున్నాయి. ఇందులో 1,23,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు ఇండియాలోనే ఉన్నాయని కేంద్రం పేర్కొంది. గడిచిన పదేళ్లలో కొత్తగా 69,352 యూజీ, 43,041 పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. అయినప్పటికీ దేశంలో డాక్టర్ల కొరత ఉన్నందున వైద్య సీట్ల పెంపు అనివార్యమైందని వివరించింది. ఏటా దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. మెడికల్ సీట్ల సంఖ్య పరిమితంగా ఉండటంతో చాలా మంది వైద్య విద్యను అభ్యసించలేని పరిస్థితి నెలకొంది. కేంద్రం తాజాగా తీసుకున్న నిర్ణయంతో వైద్య విద్యలో ప్రవేశం పొందే అవకాశం విద్యార్థులకు ఎక్కువగా ఉంటుంది. తద్వారా ఎక్కువ మంది వైద్యులు అందుబాటులోకి వస్తారు. అలాగే స్పెషలిస్ట్ డాక్టర్ల లభ్యత పెరుగుతుంది. సర్కారీ దవాఖానాల్లో కొత్త స్పెషాలిటీ సేవలు ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది.

మనకు పీజీ సీట్లే!

కేంద్రం ప్రకటించిన కొత్త యూజీ, పీజీ సీట్లలో తెలంగాణ కేవలం పీజీ సీట్లనే ఎంచుకోనుందని వైద్యవర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం జిల్లాకొక మెడికల్ కాలేజీ ఉందని, రాష్ట్రానికి పీజీ సీట్లు అవసరమని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కొత్త యూజీ, పీజీ సీట్లకు ఎన్ఎంసీ వచ్చే నెలలో దరఖాస్తులు కోరే అవకాశం ఉందని, అప్పుడు రాష్ట్రం పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేస్తుందని వివరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 35 మెడికల్ కాలేజీలుండటంతో 200-300 పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసే అవకాశం ఉందని వైద్యవిద్య సంచాలక కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

శ్రీశైలానికి ఎలివేటెడ్ కారిడారే!

(మొదటిపేజీ తరువాయి)

సూత్రప్రాయంగా అంగీకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులోనూ 33 శాతం అంటే సుమారు రూ.2,541 కోట్లను నేరుగా ఇవ్వనున్నట్టు సమాచారం. మిగిలిన 17 శాతానికి సంబంధించి ప్రాజెక్టు నిర్మాణ సామగ్రి, తదితరాలకు ఉండే పన్నులను రద్దు చేస్తామని చెప్పినట్లు తెలిసింది. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్రాల మధ్య చర్చలు జరగనున్నాయి. త్వరలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ ఖర్చులో సగం భరించేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. త్వరలోనే కేంద్రం ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయని అధికారికవర్గాల సమాచారం.

54 కిలోమీటర్లతో కారిడార్..

శ్రీశైలం మార్గానికి సంబంధించి కేంద్రానికి అందించిన 6 రకాల అలైన్‌మెంట్లలో రహదారి స్వరూపంతో పాటు ఏ విధానానికి ఎన్ని నిధులు అవసరమవుతాయనే పూర్తి వివరాలను పేర్కొన్నారు. టోల్‌ప్లాజ్‌లు, బైపాస్‌లు, గ్రామాలు ఉన్న చోట నిర్మించతలపెట్టిన ర్యాంపులు, ఘాట్ రోడ్‌లో చేపట్టే రోడ్డు నిర్మాణాల అంశాలను కూడా పొందుపర్చారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో చేపట్టాలని పేర్కొన్నారు. నివేదికను పరిశీలించి, కేంద్రం ఆమోదం తెలిపితే.. వెంటనే సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్)ను ఖరారు చేసి, 2025-26 ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభించే అవకాశం ఉంది. కాగా కొత్త అలైన్‌మెంట్ల ప్రకారం ఈ మార్గం మన్ననూర్ చెక్‌పోస్టుకు కొంచెం ముందు బ్రాహ్మణపల్లి నుంచి ప్రారంభమై.. ఈగలపెంట తర్వాత ముగుస్తుంది. ఈ మధ్యలో మన్ననూరు, వట్టిపల్లి దగ్గర రెండు బైపాస్‌లను, ఆ తర్వాత ఒకచోట టోల్‌ప్లాజా, రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. ఘాట్ రోడ్డు దగ్గర ప్రత్యేకంగా నిర్మాణాలుంటాయి. మన్ననూరు చెక్‌పోస్ట్ నుంచి పాతాళగంగ వరకు నిర్మించే ఈ కారిడార్ పొడవు 54 కిలోమీటర్లు ఉండనుంది. ఈ రహదారి పూర్తయి, అందుబాటులోకి వస్తే హైదరాబాద్-శ్రీశైలంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లేందుకు ప్రయాణ సమయం, దూరం కూడా తగ్గనుంది.

నూతన హైకోర్టు భవన నిర్మాణానికి వంద ఎకరాల భూమి..

» పరిశీలించిన హైకోర్టు సీజే

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన వంద ఎకరాల భూమిని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి, ఏజీ సుదర్శన్‌రెడ్డి తదితరులతో కలిసి సీజే ఉన్నారు.

అప్పులకుప్పలా మారిన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం

పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు.. రైతును రాజు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం జిల్లా ఆరెంపులలో ఓ లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్/అశ్వారావుపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అప్పులకుప్పగా రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లక్షలాది మంది పేదలకు గత ప్రభుత్వం బిల్లులు నిలిపివేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాడి ఆత్మగౌరవాన్ని నిలిపేలా ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తోందన్నారు. ఇల్లు పూర్తయిన వారం రోజుల్లోనే బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. బుధవారం ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో పొంగులేటి పర్యటించారు. తొలుత ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం రూ.15 కోట్లతో నిర్మించనున్న 9,700 మెట్రిక్ టన్నుల శీతల గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రైతును రాజు చేయడమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల యూరియా సమస్య ఏర్పడితే ఢిల్లీలో రైతుల పక్షాన పోరాటం చేశామన్నారు. రాబోయే వారంరోజుల్లో యూరియా సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. అనంతరం ఆరెంపుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఉంటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షలు ఇళ్లు మంజూరు చేశామని, వచ్చే మూడేళ్లలో దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తామన్నారు. 11 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు ఇంట్లో పొంగులేటి భోజనం చేశారు. అశ్వారావుపేటలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, సభ్యుల ప్రమాణీ స్వీకార కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్ పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఇమేజ్ పెంచుతాం

» పనికిరాని వస్తువులను నాలాలో వేయొద్దు: పొన్నం

» షేక్‌పేట్ ఓయూ కాలనీలో కేటీఆర్ హయాంలో డబ్బులు తీసుకొని రోడ్డు మూసేశారు

» 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై తప్పుడు ప్రచారం

» బీఆర్ఎస్ సోషల్ మీడియాపై ఫిర్యాదు చేస్తాం: వివేక్



కృష్ణానగర్ నాలా సమస్యను పరిశీలిస్తున్న మంత్రులు పొన్నం , వివేక్ , అధికారులు

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తూ, బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం యూసుఫ్‌గూడ డివిజన్ కృష్ణానగర్‌లోని వరద ప్రభావిత ప్రాంతంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిన్నటివరకు అధికారంలో ఉండి కుర్చీలో కూర్చున్న వాళ్లు కృష్ణానగర్ నాలా సమస్యపై మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని పనికిరాని వస్తువులను నాలాలో పడేయొద్దని విజ్ఞప్తి చేశారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కమీషన్లు దండుకుని రూ.60 వేల కోట్లుగా ఉన్న అప్పును రూ.8 లక్షల కోట్లకు పెంచారని ఆరోపించారు. కృష్ణానగర్ నాలా సమస్యపై ఇద్దరు సీనియర్ ఇంజనీర్లను అదనంగా నియమించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. షేక్‌పేట ఓయూ కాలనీలో మాజీ మంత్రి కేటీఆర్ హయాంలో డబ్బులు తీసుకొని రోడ్డును మూసివేశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన కలిగించడానికి బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని, అందులో భాగంగానే 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపై, బీఆర్ఎస్ సోషల్ మీడియాపై సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేయాలన్నారు. కాగా, నాలాపై ఉన్న, రోడ్డు మధ్యలో ఉన్న ప్రజల నివాసాలను కూల్చబోమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. గాజుల రామారంలో ప్రజల ఇంటిని కూల్చ లేదని, అక్రమంగా కబ్జా చేసి నిర్మించిన కట్టడాలను మాత్రమే కూల్చామని తెలిపారు. నాలాపై ఉన్న ఇండ్లను తొలగించాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

రాబడి పెంచే మార్గాలు ఆలోచించాలి

» పన్నులపై ఆధార పడొద్దు

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎంపీ లక్ష్మణ్ హితవు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు నిధులు సమకూర్చుకునేందుకు ఇతర మార్గాలను ఆలోచించాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ సూచించారు. జీఎస్టీ సంస్కరణలతో తెలంగాణకు ఏటా రూ.7,000 కోట్ల నష్టం వాటిల్లుతుందని మల్లు భట్టి విక్రమార్క చెప్పడం సరి కాదని, ప్రజల పన్నులతో ఆర్థికంగా నిధులు సమకూర్చుకోవడం సరి కాదని బుధవారం లక్ష్మణ్ తన నివాసంలో మీడియాకు చెప్పారు. పన్నుల రూపంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ ప్రభుత్వాలు దోపిడీ చేశాయని, కానీ, జీఎస్టీ సంస్కరణలతో ప్రధాని మోదీ ప్రజలకు విముక్తి కలిగించారన్నారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు రూ.2.5 లక్షల కోట్లు ఆదా అవుతుందన్న లక్ష్మణ్.. దీంతో వారు భారీ ఎత్తున కొనుగోళ్లు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్డీయే సర్కారు హయాంలో ఆదాయం పన్ను మినహాయింపును రూ.12 లక్షలకు పెంచడంతోపాటు జీఎస్టీ సంస్కరణలతో ప్రజలపై పన్నుల భారం తగ్గించిందన్నారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన గత 11 ఏళ్లలో దేశంలో అవినీతిని నిర్మూలించడంతోపాటు ప్రభుత్వ పథకాల్లో 90% ప్రజలకు నేరుగా అందుతున్నాయని ఆయన తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షల నేపథ్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించి కొనుగోలు చేయాలన్న ప్రధాని మోదీ పిలుపుతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని లక్ష్మణ్ పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


SAMSUNG
Galaxy S25 Ultra
Got a question? Go live. Get answers.
12:00
100
Google Gemini Live
Gemini, what's the best way to style this for a rock-meets-Indian party?
For a rock themed Indian party, you could pair it with a black leather jacket and some chunky silver jewelry.
Google Gemini